వుదయం

ఎల్‌నినో ప్రభావంతో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగే ప్రమాదం

పేద, మధ్యతరగతి కుటుంబాలపై భారం పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.
తెలంగాణ జన సమితి వరంగల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జావిద్.

వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి
అక్టోబర్ 28.

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలోనీటి ఎద్దడి, విద్యుత్ సమస్యలు,వ్యవసాయ రంగంలో పంట నష్టాలు తలెత్తే ప్రమాదం ఉందని తెలంగాణ జన సమితి వరంగల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జావిద్ అన్నారు. వాతావరణ పరిస్థితుల ప్రభావంతో నిత్యావసర వస్తువులు,కూరగాయల ధరలు పెరిగితే పేద, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ఆయన కోరారు. రేషన్ దుకాణాల ద్వారా బియ్యం,వంటనూనె,గోధుమలు, చక్కెర, ఉల్లిగడ్డలు, చింతపండు, కారం, ఉప్పు, అల్లం, వెల్లుల్లి, పప్పులు తదితర నిత్యావసర వస్తువులను ప్రజలకు సరసమైన ధరలకు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో రైతులకు పంట నష్టం జరిగితే ప్రభుత్వం వారిని ఆదుకోవాలని షేక్ జావిద్ డిమాండ్ చేశారు. కూరగాయల ధరలను నియంత్రించేందుకు సంబంధిత శాఖల అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కోరారు. వాతావరణ మార్పుల కారణంగా ప్రజలకు తాగునీటి కొరత, విద్యుత్ సమస్యలు ఎదురుకాకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం 2027 జూలై వరకు కొనసాగే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో వరంగల్ జిల్లాలో పరిస్థితులను సమీక్షించి, అవసరమైతే కరువు జిల్లాగా ప్రకటించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. రైతులు,

పేదలు, మధ్యతరగతి ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి, నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు సమగ్ర చర్యలు చేపట్టాలని షేక్ జావిద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు

మహాదేవపూర్, అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి):

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని భూపాలపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు అన్నారు. బుధవారం మహాదేవపూర్ మండలంలోని ఎలికేశ్వరం గ్రామంలో ఝాన్సీ లక్ష్మీబాయి మండల సమాఖ్య సంఘం ఏపీఎం,కే. రాజన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌల్ట్రీ మదర్ యూనిట్‌ను జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రా రం భిం చా రు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, వారికి వడ్డీ లేని రుణాలతో పాటు స్వల్పకాలిక రుణాలను అందిస్తూ చేయూతనిస్తుందని అన్నారు.

ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు.మహిళా సంఘం ద్వారా మూడు లక్షల రుణం పొంది పౌల్ట్రీ ఏర్పాటు చేసి 2000 సోనాలి రకానికి చెందిన నాటుకోడి పిల్లల పెంపకం చేపట్టడంపై అభినందించారు.ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ తిరుపతి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ప్రతాప్ రెడ్డి, గ్రామ సంఘం అధ్యక్షురాలు విజయ, వివో ఏ, సీసీ లు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదుపై పట్టభద్రులకు అవగాహన

గ్రామ పార్టీ అధ్యక్షుడు కావట్టి రమేష్.

ఖానాపురం, అక్టోబర్ 28
(వుదయం ప్రతినిధి):

వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదుపై పట్టభద్రులకు అవగాహన కల్పించినట్లు గ్రామ పార్టీ అధ్యక్షుడు కావటి రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకుమండలంలోని రాగంపేట గ్రామంలోని పట్టభద్రులకు ఎమ్మెల్సీ ఓటు నమోదుపై అవగాహన కల్పించి త్వరగా ఓటు నమోదు చేసుకోవాలని పట్టభద్రులకు తెలిపినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దుగ్యాల రాజేశ్వర్ రావు,మీసం రవీందర్,ఏపూరి సంపత్, బొమ్మరబోయిన ప్రవీణ్, బొమ్మరబోయిన మహేష్, వాంకుడోత్ భాస్కర్, గోడిశాల మొగిలి, బొల్లేబోయిన రాజు, రాములు తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులను వెంటనే రద్దు చేయాలి: ప్రమోద్ కుమార్

మామూళ్ల మత్తులో పరకాల ఎక్సైజ్ అధికారులు
"ఇంటింటికీ మద్యం అనాథలవుతున్న కుటుంబాలు
"ఆడబిడ్డల తాళిబొట్లు తెంచుతున్న మద్యం దుకాణాలు బంద్ చేయాలి"
– సిఐటియు నాయకులు ప్రమోద్ కుమార్

పరకాల టౌన్, అక్టోబర్ 28
(వుదయం ప్రతినిధి) :

కంటికి కనిపించని గంజాయిని అరికడతామని ప్రకటనలు గుప్పించే ఎక్సైజ్ శాఖ, సమాజంలో కల్లముందే వేలాది కుటుంబాలను కూల్చేస్తున్న బెల్ట్ షాప్ మద్యం విక్రయాలపై ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తోందని సీఐటీయూ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మడికొండ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ... మద్యం మహమ్మారి వల్ల ఎంతోమంది చిన్న వయసులోనే ప్రాణాలు కోల్పోతుంటే, వారిని నమ్ముకున్న ఆడబిడ్డలు చిన్న వయసులోనే విధవలుగా మారుతున్న దారుణ పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాశనమవుతున్న జీవితాలను కాపాడటంలో ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. వైన్ షాపుల నుంచి నేరుగా గల్లీల్లోకి, ఇళ్ల వద్దకే మద్యం రవాణా అవుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఊరూరా యథేచ్ఛగా నడుస్తున్న అక్రమ 'బెల్ట్ షాపుల' వల్ల ఎన్నో పేద, మధ్యతరగతి కుటుంబాలు వీధిన పడుతున్నాయని, వైన్ షాపు నిర్వాహకులే ఈ బెల్ట్ షాపులకు మందు సరఫరా చేస్తూ ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు.

ఎక్సైజ్ శాఖ వీటిని అరికట్టడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. అక్రమ మద్యం దుకాణాలను బంద్ చేయించి, అక్రమ బెల్ట్ షాపులను తక్షణమే తొలగించే వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ పోరాటం కొనసాగుతుందని ప్రమోద్ కుమార్ స్పష్టం చేశారు.

కొంతమంది జీవితాలైనా నిలబడాలనే ఉన్నతమైన ఆశయంతో చేపడుతున్న ఈ ఉద్యమానికి ప్రజలు, ప్రజాసంఘాలు, మహిళ లోకం పూర్తి స్థాయిలో సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

సమాజాన్ని వినాశనం వైపు తీసుకెళ్తున్న మద్యం రక్కసిపై ప్రతి ఒక్కరూ స్వరం విప్పాలని, బెల్ట్ షాపులను శాశ్వతంగా మూసివేసేలా

ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

డ్రగ్స్ మాయలో పడి జీవితాలు నాశనం కావొద్దు

మహిళలు సమర శంఖం!
వరంగల్ ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్.

పర్వతగిరి, అక్టోబర్ 28
(వుదయం ప్రతినిధి):

ఇంటిని చక్కదిద్దే ఇల్లాలే నేడు సమాజానికి పట్టుకొమ్మై డ్రగ్స్ భూతంపై సమర శంఖం పూరించింది యువతను బలిగొంటున్న మత్తు పదార్థాల రాక్షస క్రీడకు అడ్డుకట్ట వేసేందుకు వరంగల్ పోలీస్ శాఖ వినూత్నంగా చేపట్టిన 'సంఘ మిత్ర' కార్యక్రమం వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రం లో సంఘమిత్ర మహిళల ఆధ్వర్యంలో 200 మహిళలు, యువతులు సరికొత్త చరిత్ర సృష్టించింది. పర్వతగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని రైతు వేదిక వద్ద మంగళవారం ఘనంగా జరిగిన ఈ మహాసభకు మహిళలు ఉప్పెనలా కదిలివచ్చారు.మాదకద్రవ్యాల రహిత సమాజమే తమ ధ్యేయమని వారంతా ముక్తకంఠంతో ప్రతిజ్ఞ చేసి, ఉద్యమానికి నాంది పలికారు. వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత ఐపీఎస్ దిశానిర్దేశం, ప్రత్యేక చొరవతో రూపొందించిన ఈ 'సంఘ మిత్ర' (సమాజానికి మిత్రులు) కార్యక్రమం కేవలం ఒక పోలీసు అవగాహన సదస్సుగా కాకుండా అక్షరాలా ప్రజా ఉద్యమంగా రూపుదిద్దుకుంది. కుటుంబంలో ప్రతి క్షణం పిల్లల నీడలా ఉంటూ వారి ప్రవర్తనను పసిగట్టే శక్తి ఒక్క మహిళలకే ఉందని, అందుకే డ్రగ్స్ నిర్మూలనలో వారే ప్రధాన సైన్యం కావాలని ఈ వేదిక చాటిచెప్పింది.

ఈ కార్యక్రమంలో మామునూరు ఏసీపీ వెంకటేష్, పరతగిరి సీఐ సంతోష్ ఎస్సై రాజకుమార్ పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ సంఘ్వార్, ఐపీఎస్ హాజరై ప్రసంగించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, యువతపై వాటి ప్రభావం, డ్రగ్స్‌కు దూరంగా ఉండాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఒకప్పుడు క్రీడలు, చదువులతో కళకళలాడాల్సిన యువత నేడు డ్రగ్స్ ఊబిలో చిక్కుకుని ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం. ఈ పెను ప్రమాదం నుంచి మన బిడ్డలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ తల్లిపై, సోదరిపై ఉంది" అని ఆయన ఉద్వేగంగా పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల వల్ల ఆరోగ్యం క్షీణించడం, ఆర్థికంగా కుటుంబాలు రోడ్డున పడడం, చివరకు నేరాల బాట పట్టడం వంటి దుష్పరిణామాలపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

పోలీసులు ప్రజల మధ్య వారధిగా మహిళలు..

గ్రామాలు, పట్టణాల్లో గంజాయిగుప్పమంటున్నా, ఎవరైనా మత్తుకు బానిసలవుతున్నా సమాజాన్ని అప్రమత్తం చేయాల్సిన బాధ్యత మహిళా సంఘాలదేనని వక్తలు స్పష్టం చేశారు. పోలీసులకు, సాధారణ ప్రజలకు మధ్య బలమైన వారధిలా 'సంఘ మిత్ర' నిలుస్తుందని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో మామూనూరు ఏసీపీ వెంకటేశ్వర్లు, పర్వతగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్. సంతోష్, పర్వతగిరి ఎస్సై పి.రాజ్ కుమార్ తదితర పోలీస్ అధికారులు ప్రత్యక్ష పర్యవేక్షణ చేస్తూ ప్రజలను సమన్వయం చేశారు.

పలిమెల మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించకపోవడం బాధాకరం

పలిమెల మండలానికి ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలి
- మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి

పలిమెల: అక్టోబర్ 28
(వుదయం ప్రతినిధి)

పలిమెల మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించకపోవడం బాధాకరమని మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారుల తప్పిదం వల్లే పలిమెల మండల రైతులకు శాపంగా మారిందన్నారు. ఎస్సీ, ఎస్ టీ, బీసీ ప్రజలు జీవిస్తూ సాగునీటికి ఎలాంటి అవకాశం లేక సంవత్సరాల తరబడి 365 రోజులు కరువుతో అల్లాడుతున్న ప్రాంతం పలిమెల మండలం అని మండలానికి ప్రత్యేక ప్యాకేజీ కేటాయించి మండల రైతులను ఆదుకోవాలని అన్నారు.అసలు వర్షాధారం వల్లనే వ్యవసాయ రంగం నడిచేది పలిమెల మండలం అని తెలిపారు. ఉన్నతాధికారులు పునరాలోచించి క్షేత్రస్థాయిలో సర్వే చేసి పలిమెల మండలాన్ని కరువు మండలాల జాబితాలోకి చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

గణపతి సచ్చిదానంద స్వామీజీ పర్యటనను విజయవంతం చేయండి

మహాదేవపూర్, అక్టోబర్ 28(వుదయం ప్రతినిధి):

గణపతి సచ్చిదానంద స్వామీజీ వారి ఆశీస్సులతో నిర్వహించనున్న ధార్మిక కార్యక్రమాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్కం అశోక్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కట్కం అశోక్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. శ్రీ దత్తాత్రేయస్వామి దేవాలయాల అభివృద్ధికి, ధార్మిక కార్యక్రమాల నిర్వహణకు ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు నవంబర్ 1 వతేది ఆదివారం ధన్వాడ లో నిర్వహించనున్న ఈ ధార్మిక కార్యక్రమాల్లో భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆయన పిలుపునిచ్చారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, సద్భావనను పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు, పి ఎసిఎస్ చైర్మన్ చల్ల తిరుపతి రెడ్డి,మండల అధికార ప్రతినిధి బుర్రి శివరాజు తోపాటు పాల్గొన్నారు.

టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తుళ్ల రవి

వర్ధన్నపేట అక్టోబర్ 28
(వుదయం ప్రతినిధి):

టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వర్ధన్నపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన తుళ్ల రవికి వర్ధన్నపేట ఎమ్మెల్యే, కేఆర్ నాగరాజు నియామక ఉత్తర్వుల పత్రాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.బుధవారం హనుమకొండలోని సుబేదారిలో ఉన్న తన క్యాంపు కార్యాలయంలో తుళ్ల రవిని అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర అధ్యక్షుడు,మాన కొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ డిపార్ట్‌మెంట్‌ను బలోపేతం చేయాలని సూచించారు.కాంగ్రెస్ పార్టీ ఆశయాలు,సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ,ఎస్సీ వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ విస్తరణకు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.తుళ్ల రవికి రాష్ట్రస్థాయి బాధ్యతలు దక్కడం పట్ల పలువురు కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకన్న గౌడ్,పీఏసీఎస్ చైర్మన్ అబ్బిడి రాజిరెడ్డి, ఐనపోలు మాజీ చైర్మన్ ప్రభాకర్ గౌడ్, కొత్తపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు తాళ్లపల్లి యాదగిరి గౌడ్, ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పోశాల మధుకర్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దీకొండ ఉపేందర్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాంపల్లి యాదగిరి, సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షుడు దుబ్బ అంజన్న, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దామర ప్రశాంత్,ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెపాక సమ్మయ్య,నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

స్వగ్రామ విద్యార్థులకు అండగా దాతృత్వం..

పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన వారికి రూ.5 వేల చొప్పున బహుమతి .
వచ్చే ఏడాది మండల స్థాయిలో టాప్-2 విద్యార్థుల ఇంటర్ చదువుల ఖర్చు భరిస్తా: పూస సతీష్ కుమార్

రాయపర్తి అక్టోబర్ 28
(వుదయం ప్రతినిధి):

స్వగ్రామంపై మమకారం.. విద్యార్థుల భవిష్యత్తుపై బాధ్యత.. చదువుల్లో రాణించాలనే తపనకు ప్రోత్సాహం.. వెరసి కొండూరు గ్రామానికి చెందిన పూస సతీష్ కుమార్-లక్ష్మి దంపతులు విద్యార్థుల విద్యాభివృద్ధికి అండగా నిలుస్తున్నారు. రాయపర్తి మండలం కొండూరు ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేసి తమ సేవాభావాన్ని చాటుకున్నారు.కొండూరు గ్రామానికి చెందిన పూస కృష్ణమూర్తి, కళావతి దంపతుల కుమారుడైన సతీష్ కుమార్ చిన్నతనంలో అదే పాఠశాలలో ఐదో తరగతి వరకు చదువుకున్నారు. అనంతరం హైదరాబాద్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసి వ్యాపార రంగంలో స్థిరపడ్డారు. తాను చదువుకున్న పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించాలనే సంకల్పంతో గత రెండేళ్లుగా ఏటా తన వంతు సహకారం అందిస్తున్నారు. గతంలో పదో తరగతి విద్యార్థులకు డిక్షనరీలు పంపిణీ చేయగా, గతేడాది పరీక్షా ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లు అందజేశారు. అప్పట్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు ఇస్తానని ప్రకటించారు.ఇచ్చిన మాట ప్రకారం నగదు బహుమతులు 2025 మార్చిలో కొండూరు పాఠశాల నుంచి పదో తరగతి పరీక్షలకు హాజరై ప్రతిభ చాటిన విద్యార్థులకు తాజాగా నగదు ప్రోత్సాహకాలు అందించారు. ప్రథమ స్థానం సాధించిన కర్ర గణేష్ (తండ్రి ప్రవీణ్‌రెడ్డి), ద్వితీయ స్థానం సాధించిన జున్ను శిరీష (తల్లి రేణు)లకు ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున బహుమతులు అందజేశారు. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు,భవిష్యత్తులో మరింత ఉన్నతంగా రాణించేందుకు ఈ ప్రోత్సాహం దోహదపడుతుందని పలువురు పేర్కొన్నారు.

మండల స్థాయి ప్రతిభావంతులకు అండ ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ.. స్వగ్రామ విద్యార్థులు విద్యారంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే ఉద్దేశంతో ప్రత్యేకంగా హైదరాబాద్ నుంచి కొండూరుకు వచ్చి నగదు బహుమతులు అందించినట్లు తెలిపారు. వచ్చే ఏడాది పదో తరగతిలో మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించే విద్యార్థుల ఇంటర్మీడియట్ చదువులకు అయ్యే ఖర్చులన్నింటినీ తానే భరిస్తానని ప్రకటించారు.గ్రామీణ విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఉన్నత విద్యను అభ్యసించాలన్నదే తన ఆకాంక్ష అని వెల్లడించారు.పూస సతీష్‌కుమార్-లక్ష్మి దంపతులు విద్యార్థుల పట్ల చూపుతున్న అభిమానం, సేవాభావాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కొనతం పద్మలత, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ అబేదా బేగం, ఉపాధ్యాయులు అభినందించారు. గ్రామీణ విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు ముందుకు రావడం మరెందరికో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో

సీనియర్ ఉపాధ్యాయులు వి.వి.ఆర్. ఆచార్య, రఘు, శ్యాంసుందర్, స్వామి, శివకృష్ణ, అమరస్వర్ణ, అనితారాణి, రాజు తదితర ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తుఫాను హెచ్చరిక.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మరో 24–48 గంటలు కీలకం..
భారీ నుంచి అతి భారీ వర్షా లు కురిసే అవకాశం
విద్యుత్ తీగలతో జాగ్రత్త..
ఎంపీఓ కూచన ప్రకాశ్

రాయపర్తి, అక్టోబర్ 28
(వుదయం ప్రతినిధి):

తుఫాను ప్రభావంతో రానున్న 24 నుంచి 48 గంటల్లో రాయపర్తి మండలంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ) కూచన ప్రకాశ్ సూచించారు.వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని,అత్యవసర పరిస్థితుల్లో అధికారుల సూచనలు పాటించాలని కోరారు. ఇళ్లలోనే ఉండండి.. అత్యవసరమైతేనే బయటకు రండివర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో వృద్ధులు, గర్భిణులు, చిన్నపిల్లలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు.పాత మట్టి ఇళ్లు, బలహీనమైన పైకప్పులు ఉన్నవారు ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని, అవసరమైతే గ్రామ పంచాయతీ ఏర్పాటు చేసే పునరావాస కేంద్రాలను ఆశ్రయించాలని తెలిపారు.

విద్యుత్ తీగల వద్దకు వెళ్లొద్దు

తెగిపడిన విద్యుత్ తీగలు, తడిసిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో విద్యుత్ ఉపకరణాల వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయొద్దు

భారీ వర్షాలతో చెరువులు, కుంటలు, వాగులు, వంకలు పొంగిపొర్లే ప్రమాదం ఉన్నందున నీటి ప్రవాహాల వద్దకు వెళ్లవద్దని, పొంగిపొర్లుతున్న కాజ్‌వేలను దాటే సాహసం చేయవద్దని ఎంపీఓ స్పష్టం చేశారు.

పశువులను సైతం వాగుల వైపు తోలుకెళ్లవద్దని కోరారు.అత్యవసర వస్తువులు సిద్ధంగా ఉంచుకోవాలి

మొబైల్ ఫోన్లు, ఎమర్జెన్సీ లైట్లను ముందుగానే ఛార్జింగ్ చేసుకోవాలని, తాగునీరు, నిత్యావసర వస్తువులు, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రైతులు కోసిన పంటలు,ధాన్యం వర్షానికి తడవకుండా సురక్షిత ప్రాంతాల్లో భద్రపరుచుకోవాలని తెలిపారు. సహాయం కోసం ఈ నంబర్‌కు వాట్సాప్ చేయండి

వర్షాల నేపథ్యంలో గ్రామ పంచాయతీ సిబ్బంది అందుబాటులో ఉంటారని ఎంపీఓ కూచన ప్రకాశ్ తెలిపారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని లేదా సంబంధిత అధికారులను సంప్రదించాలని కోరారు. సహాయం కోసం 9063000090 నంబర్‌కు వాట్సాప్ ద్వారా సమాచారం అందించాలని సూచించారు.ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించి, తమతో పాటు కుటుంబ సభ్యుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీఓ విజ్ఞప్తి చేశారు.

మా చెరువు శివారుని కబ్జా చేస్తే ఊరుకునేది లేదు

- అక్రమంగా చెరువు శివారును చదును చేయడంపై తిమ్మాపూర్ ప్రజల ఆగ్రహం

ఎల్కతుర్తి, అక్టోబర్ 28
(వుదయం ప్రతినిధి) :

మా చెరువు శివారును కబ్జా చేయాలని చూస్తే ఊరుకునేది లేదని తిమ్మాపూర్ ప్రజలు, యువత ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా గుంటూరు పల్లె గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో తిమ్మాపూర్ శివారులోని ఊర చెరువును కబ్జా చేసి ఆక్రమించుకోవాలనే దురుద్దేశంతో పోచమ్మ తల్లి దేవాలయం నిర్మించడంతోపాటు, బోరు వేశారు. దానితో ఆగకుండా దసరాకు నాలుగు రోజుల ముందు ఊర చెరువు శివారులో భూమి చదును చేసి మొరం నింపారు.

దీనిని ఖండిస్తూ తిమ్మాపూర్ సర్పంచ్ ముప్పు మానస మహేందర్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులను సంప్రదించి ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు రెవెన్యూ ఇన్స్పెక్టర్ సదానందం, జి పి కృష్ణ ఆ స్థలాన్ని పరిశీలించేందుకు బుధవారం గ్రామానికి రావడంతో తిమ్మాపూర్ గ్రామంలోని ప్రజలు పెద్ద సంఖ్యలో ఆ స్థలానికి చేరుకొని తమ స్థలాన్ని కబ్జా చేసి ఆక్రమించాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. 55 ఎకరాలలో ఉన్న చెరువు కింద కింద 250 ఎకరాల సాగు భూమి ఉన్నది. అలాంటి చెరువును ఎవరి అనుమతి లేకుండా గుంటూరు పల్లె వాసులు ఇష్టం వచ్చినట్లు సుమారు రెండు ఎకరాల భూమిని కబ్జా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తిమ్మాపూర్ గ్రామంలో ప్రజలకు నీటి ఎద్దడి ఏర్పడుతుంది అని తాము బాధపడుతుంటే తిమ్మాపూర్ గ్రామ శివారు లోకి వచ్చి గుంటూరు పల్లె వాసులు బోరు వేసి నీళ్లు తరలిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ చెరువు విస్తీర్ణంలోకి వచ్చి భూమి చదును చేసి మొరం పోసి కబ్జా చేయాలని చూస్తున్న గుంటూరు పల్లె గ్రామపంచాయతీ పాలకవర్గంపై చర్యలు తీసుకొని తమ భూమిని అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని ప్రజలు అధికారులను కోరారు.

రైతుల గోస కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టదా?

నల్లబెల్లిని కరువు మండలంగా ప్రకటించాలి
బీఆర్ఎస్ నేతలు సారంగపాణి, మురళీధర్ హెచ్చరిక

నల్లబెల్లి, అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి):

వర్షాభావంతో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని బీఆర్ఎస్ నల్లబెల్లి మండల అధ్యక్షుడు డాక్టర్ బానోతు సారంగపాణి ప్రశ్నించారు. నల్లబెల్లి మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుక

ఇందిరమ్మ ఇల్లు ఏదీ..?
పూరి గుడిసెలోనే వృద్ధురాలి బతుకు!

- 30 ఏళ్లుగా గుడిసెలోనే నివాసం.. రెండు ప్రభుత్వాల్లోనూ అందని ఇల్లు
- అర్హులకు అన్యాయం జరిగిందంటూ యరగాని పిచ్చమ్మ ఆవేదన

మునగాల, అక్టోబర్ 28 (వుదయం):

ప్రభుత్వాలు మారినా తమ బతుకులు మారడం లేదని, అర్హత ఉన్నప్పటికీ సొంత ఇల్లు కల నెరవేరడం లేదని మునగాల మండలం నేలమర్రి గ్రామ పంచాయతీ పరిధికి చెందిన వృద్ధురాలు యరగాని పిచ్చమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. గత 30 సంవత్సరాలుగా పూరి గుడిసెలోనే జీవనం సాగిస్తున్న తనకు ఇప్పటివరకు ఏ ప్రభుత్వమూ ఇల్లు మంజూరు చేయలేదని వాపోయారు. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనూ తనకు ఇల్లు మంజూరు కాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనైనా ఇందిరమ్మ ఇల్లు వస్తుందని ఆశపడ్డానని పిచ్చమ్మ తెలిపారు. అయితే ఇటీవల విడుదలైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలోనూ తన పేరు లేకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యానని పేర్కొన్నారు.

ఇల్లు ఉన్నవారికే ఇందిరమ్మ ఇళ్లా?

తనలాంటి నిరుపేదలకు ఇల్లు మంజూరు చేయకుండా, ఇప్పటికే రేకుల ఇళ్లు ఉన్నవారికి, ఇళ్లు కలిగిన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని పిచ్చమ్మ ఆరోపించారు. నిజంగా ఇల్లు అవసరమైన అర్హులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తన సమస్యను గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడికి, సర్పంచికి వివరించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని తెలిపారు. మూడు దశాబ్దాలుగా పూరి గుడిసెలోనే జీవిస్తున్న తన పరిస్థితిని అధికారులు గుర్తించి న్యాయం చేయాలని ఆమె కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులైన నిరుపేదలను గుర్తించి తనకు ఇల్లు మంజూరు చేయాలని వేడుకుంటున్నారు.

అధికారులు స్పందించి న్యాయం చేస్తారా?

ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు అందుతున్నాయా లేదా అనే అంశంపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. యరగాని పిచ్చమ్మ పరిస్థితిని పరిశీలించి, నిబంధనల ప్రకారం ఆమె అర్హతను నిర్ధారించి న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మునుగోడు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

- బాధితుల ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోపోతే సహించేది లేదు
- గంజాయి, సైబర్ నేరాలపై ప్రత్యేక నిఘా ఉండాలి
- శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు తప్పనిసరి

మునుగోడు,అక్టోబర్ 28(వుదయం):

బాధితులకు న్యాయం అందించడమే పోలీసుల మొదటి ప్రాధాన్యత అని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడికి న్యాయం జరుగుతుందనే నమ్మకం కలిగించాలని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ఆదేశించారు. బుధవారం మునుగోడు పోలీస్ స్టేషన్‌ను ఆయన వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించారు. ముందుగా స్టేషన్‌కు చేరుకున్న ఎస్పీకి సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం రిసెప్షన్ కౌంటర్, రికార్డుల నిర్వహణ, సీసీ కెమెరాల పనితీరు, పెండింగ్ కేసులను లోతుగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలతో పోలీసులు మర్యాదగా వ్యవహరిస్తూ శాఖ ప్రతిష్టను పెంపొందించాలని సూచించారు. బాధితుల సమస్యలను ఓపికగా విని చట్టప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి పక్కా ప్లాన్..

స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలను సమీక్షించిన ఎస్పీ, దర్యాప్తులో జాప్యం జరగకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. శాస్త్రీయ పద్ధతిలో ఆధారాలు సేకరించి, నిర్ణీత గడువులోగా కోర్టుల్లో చార్జిషీట్లు దాఖలు చేయాలని స్పష్టం చేశారు. నేరస్థులకు శిక్ష పడేలా పకడ్బందీగా వ్యవహరించాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

రౌడీషీటర్లపై నిరంతర నిఘా..

శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించవద్దని, పాత నేరస్తులు, రౌడీషీటర్ల కదలికలపై కన్ను వేసి ఉంచాలని తెలిపారు. గ్రామాల్లో బీట్ వ్యవస్థను బలోపేతం చేస్తూ రాత్రి వేళల్లో పెట్రోలింగ్ పెంచాలన్నారు. గంజాయి, మాదకద్రవ్యాల విక్రయాలు, అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని, యువత బానిస కాకుండా గ్రామ స్థాయిలో చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే పెరుగుతున్న సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎస్పీ పేర్కొన్నారు. మహిళల భద్రత విషయంలో అత్యంత ప్రాధాన్యతనిచ్చి, వారి ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించాలన్నారు. విధుల నిర్వహణలో క్రమశిక్షణ, సమయపాలన పాటించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో చండూర్ సీఐ రాము, డీసీఆర్‌బీ సీఐ శ్రీను నాయక్, మునుగోడు ఎస్ఐ శోభన్ బాబుతో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నప్రసాద వితరణ!

అనంతగిరి, అక్టోబర్ 28 వుదయం

అయ్యప్ప స్వాముల సేవే పరమావధిగా భావిస్తూ తెలంగాణ శబరిమలగా పేరుగాంచిన అనంతగిరి అయ్యప్ప సన్నిధిలో కొనసాగుతున్న అన్నప్రసాద వితరణ భక్తిశ్రద్ధలతో సాగుతోంది. ఆర్నాబ్ తుఫాన్ ప్రభావం ఉన్నప్పటికీ అన్నప్రసాద వితరణకు విఘాతం కలగకుండా భక్తులకు ఆహారం అందించారు. 22వ రోజు సుమారు 240 మంది అయ్యప్ప స్వాములు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అన్నదానానికి ముందుకొచ్చిన దాతలు22వ రోజు అన్నప్రసాద వితరణకుమహారాజపోషకులు బుర్రా పుల్లారెడ్డి–సుధారాణి దంపతులు, వారి కుమారుడు బుర్రా ప్రమోద్ రెడ్డి దంపతులు, పసుమర్తి హరిప్రకాష్–ప్రత్యూష దంపతులు దాతల సహకారంతో నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదం అందించేందుకు ముందుకొచ్చిన దాతల సేవలను అయ్యప్ప భక్తులు అభినందించారు.సేవే లక్ష్యంగా అన్నప్రసాద వితరణ

అయ్యప్ప మాలధారణతో దీక్షలో ఉన్న స్వాములకు అన్నప్రసాదం అందించడం ద్వారా భక్తిసేవ, ఆధ్యాత్మిక భావనను చాటుతున్నారు.వాతావరణ ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పటికీ అన్నప్రసాద వితరణ కొనసాగించడం సన్నిధిలో సేవాభావానికి నిదర్శనంగా నిలిచింది.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కొండపల్లి వాసు, పందిరి వీరయ్య, కోదాటి హితేష్, ఐతనబోయిన వెంకటేశ్వర్లు, దండు రమేష్, అల్లెబోయిన కోటయ్య, ఈదుల యాదగిరి, కొమెర వెంకన్న, కనకయ్య, జెర్రిపోతుల రాము,కొత్తపల్లి సాయి తదితర మాల ధారణ స్వాములు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.అయ్యప్ప స్వాముల సేవలో అన్నదానం నిరంతరం కొనసాగాలని, దాతలకు స్వామివారి ఆశీస్సులు కలగాలని భక్తులు ఆకాంక్షించారు.

అత్యవసరమైతేనే బయటకు రండి

ప్రజలకు ఎస్ఐ నరేష్

చింతకాని, అక్టోబర్ 27 (వుదయం ప్రతినిధి):

బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చింతకాని ఎస్ఐ జి.నరేష్ సూచించారు.అత్యవసర పరిస్థితులు మినహా ఇళ్ల నుంచి బయటకు రావద్దని, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈదురుగాలుల కారణంగా విద్యుత్ తీగలు తెగిపడే ప్రమాదం ఉన్నందున విద్యుత్ స్తంభాలకు, తెగిపడిన తీగలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాల సమీపంలో ఆశ్రయం పొందవద్దని సూచించారు. ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదకర పరిస్థితులు ఎదురైతే వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు!

- నలుగురు ఆడబిడ్డలను అనాథలుగా చేసి వెళ్లిన తండ్రి
- కుటుంబానికి అండగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి
- రూ.10 వేల ఆర్థిక సాయం అందించిన వీరమల్ల సురేష్‌గౌడ్

మునుగోడు,అక్టోబర్ 28 (వుదయం):

మునుగోడు మండలంలోని కొంపెల్లి గ్రామంలో హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న తండ్రి మృతితో నలుగురు ఆడబిడ్డలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. తండ్రి అంత్యక్రియల్లో పెద్ద కూతురు సాక్షి తలకొరివి పెట్టడం అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. కొంపెల్లి గ్రామానికి చెందిన బోయపర్తి మహేందర్ (39) వారం రోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబానికి చెందిన మహేందర్‌కు నలుగురు ఆడపిల్లలు సంతానం. కుటుంబాన్ని పోషిస్తూ బిడ్డల భవిష్యత్తుకు అండగా నిలిచిన ఆయన ఆకస్మిక మరణంతో కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. బుధవారం నిర్వహించిన అంత్యక్రియల్లో పెద్ద కూతురు సాక్షి తండ్రికి తలకొరివి పెట్టింది.తండ్రిని కోల్పోయిన ఆడబిడ్డలు కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు గ్రామస్తులను కలచివేసింది. కుటుంబాన్ని ఆదుకోవాల్సిన వ్యక్తి మృతి చెందడంతో నలుగురు చిన్నారుల బాధ్యత భార్య రోజాపై పడింది.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

మహేందర్ మృతి విషయం తెలుసుకున్న మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం పంపించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మండుల సత్యం మహేందర్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. అదే విధంగా కొంపెల్లి గ్రామానికి చెందిన ఆదిత్య ట్రాన్స్‌పోర్ట్ మేనేజింగ్ డైరెక్టర్ వీరమల్ల సురేష్‌గౌడ్ బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు.కుటుంబానికి పెద్ద దిక్కును కోల్పోయిన రోజా, ఆమె నలుగురు ఆడబిడ్డలకు భవిష్యత్తుపై భరోసా కల్పించేందుకు దాతలు,ప్రజాప్రతినిధులు,స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఆపదలో ఉన్న ఈ కుటుంబానికి సమాజం అండగా నిలిచి చిన్నారుల భవిష్యత్తుకు చేయూత అందించాలని కోరారు.

పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన ఐఎన్‌టీయూసీ నాయకులు: ఎండి.రజాక్

కొత్తగూడెం ఏరియా వ్యాప్తంగా కేక్ కటింగ్, మొక్కలు నాటడం, అన్నదాన కార్యక్రమాలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

అక్టోబర్ 28(వుదయం ప్రతినిధి)

తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని సింగరేణి కొత్తగూడెం ఏరియాలో ఐఎన్‌టీయూసీ నాయకులు బుధవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎం.డి. రజాక్ ముఖ్య అతిథిగా పాల్గొనగా, ఫిట్ కార్యదర్శుల ఆధ్వర్యంలో వివిధ కార్యాలయాలు, గనుల వద్ద కేక్ కటింగ్, స్వీట్ల పంపిణీ, మొక్కలు నాటడం, ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తగూడెం ఏరియాలోని పీపీకే, 5బీ షాఫ్ట్, పీకే కోల్ మైన్స్, ఏరియా వర్క్‌షాప్, సివిల్ విభాగం, ఎస్ అండ్ పీసీ, జనరల్ మేనేజర్ కార్యాలయం, మైన్స్ రెస్క్యూ స్టేషన్ కార్యాలయాల్లో జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కార్మికులకు స్వీట్లు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడంతో పాటు ఆలయాల్లో ప్రత్యేక అర్చనలు నిర్వహించారు.

అనంతరం హెడ్ ఆఫీస్ ఏరియాలోని జ్యోతి అనాథ వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. రామవరంలో కేక్ కటింగ్, మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించగా, చుంచుపల్లి మండలం ధన్‌బాద్ ప్రాంతంలో అన్నదాన కార్యక్రమంలోనూ ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి అండగా పొంగులేటి: రజాక్

ఈ సందర్భంగా ఎం.డి. రజాక్ మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. కార్మికులకు, ప్రజలకు ఏ సమస్య వచ్చినా ఆదుకునే పెద్దన్నగా ఆయన వ్యవహరిస్తున్నారని అన్నారు. కార్మికుల పట్ల ఆయన చూపుతున్న ఆదరాభిమానాలు అభినందనీయమని తెలిపారు. భవిష్యత్తులోనూ కొత్తగూడెం ఏరియా మరింత అభివృద్ధి చెందేందుకు, సింగరేణి ఉద్యోగులకు అవసర మైన మౌలిక వసతులు, సంక్షేమ సదుపాయాలు కల్పించేందుకు మంత్రి మరింత చొరవ చూపాలని ఆకాంక్షించారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ డాక్టర్ బి. జనక్ ప్రసాద్ సైతం మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమాల్లో కేంద్ర, బ్రాంచ్ కమిటీ సభ్యులు, ఫిట్ కార్యదర్శులు, అసిస్టెంట్ సెక్రటరీ జల్లి కిరణ్, ఇన్‌చార్జులు బొద్దుల రవీందర్, జోసెఫ్ కిషోర్, వీరభద్రం, భాను కమల్, కే. కుమార్, కే. నాగేశ్వరరావు, బాలు, వై. శంకర్‌రావు, ఎం.ఏ.సవీర్, లగ్గాల అజయ్, ఎస్.డి.యాకుబుద్దీన్, బొజ్జ వెంకటస్వామి, కే.కృష్ణమోహన్, కే. వెంకటస్వామి, విజయ్‌కుమార్, రంగినేని వెంకటేశ్వర్లు, సదానందం, లెనిన్‌బాబు, దశరథ్, గులాం గౌస్, హనోక్ రాజ్, జనార్ధన్, జి.రమేష్, త్రిపాటి, ఎర్రబెల్లి ఈశ్వర్, కాంగ్రెస్ నాయకులు జానీ పాషా, గంగాధర్, సంపత్, సంజయ్, రాము తదితరులు పాల్గొన్నారు.

అలాగే ఐఎన్‌టీయూసీ నాయకులు నాగుల శంకర్, దుర్గాసింగ్, దాసరి శ్రీనివాస్, కొలుగురి శ్రీనివాస్, రోశయ్య, చందులాల్, జడల చంద్రశేఖర్, ఎం.వేణుగోపాల్, కిషోర్, ఉమర్, సత్యనారాయణ, చంద్రావతి, అరవింద్, వెంకటేశ్వరరావు, ఖాజా పాషా, పరశురాం, టీఆర్ఎస్ రాజు, పి.ఆర్.సి. రెడ్డి, గణేష్, ఏ. రవికుమార్, శ్రీనివాస్ బత్తుల, అంకుష్, శివరాం, ఎస్.కె.రియాజ్, అభిలాష్, నాగేందర్, శ్రీధర్, సంపత్, సురేష్, వినయ్, రామాచారి, సాయి సందీప్, నరేష్, రాజేష్, మధు బాలాజీ, గుణ, భరత్, నవీన్, క్రాంతి, షారుక్, అజీజ్ తదితర కేంద్ర, బ్రాంచ్ కమిటీ నాయకులు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు, కమిటీ సభ్యులు, కార్యకర్తలు, మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

నాయకునగూడెం శివారులో పేకాట రాయుళ్ళు అరెస్ట్

సత్తుపల్లి అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి)

మంగళవారం సాయంత్రం వేంసూరు మండల పరిధిలోనినాయకనగూడెం గ్రామ శివారులో ఖాళీ ప్రదేశములో కొంతమంది వ్యక్తులు డబ్బులు పందెంగా పెట్టి లోన, బయట పేకాట ఆడుచున్నారని నమ్మదగిన సమాచారం మేరకు వేంసూరు ఎస్సై పి. ప్రదీప్ తన సిబ్బంది వెళ్ళి దాడి చేయగా పేకాట ఆడుచున్న బీరపల్లి కి చెందిన అంగిడి గోపాలస్వామి,జయలక్ష్మి పురం చెందిన తడికమళ్ళ రవి పట్టుబడ్డారు. మరి కొంతమంది పారిపోయినారు. పట్టుబడిన వారి వద్ద నుండి 52 పేక ముక్కలను, 3,200 రూపాయల నగదును, 5 మోటారు సైకిళ్ళు,2 సెల్ ఫోన్ లను స్వాదీన పర్చుకొని కేసు నమోదు చేయనైనది.

కల్లూరులో ఘనంగా మంత్రి పొంగులేటి జన్మదిన వేడుకలు

ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు

కల్లూరు అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి)

రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలు కల్లూరులో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వీకేఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ వేడుకలకు సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన ఆయురారోగ్యాలతో ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు పసుమర్తి చందర్రావు, మాజీ ఏఎంసీ చైర్మన్ నీరజ ప్రభాకర్ చౌదరి, కల్లూరు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆళ్లకుంట నరసింహారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు పొట్రు అర్జునరావు, అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య నాయకులు కాటేపల్లి కిరణ్ కుమార్, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

గంగారంలో ఘనంగా 86వ కొమరం భీం వర్ధంతి

విగ్రహ స్థాపనకు భూమి పూజ నిర్వహణ

గంగారం అక్టోబర్ 28(వుదయం):

గంగారం మండల కేంద్రంలో ఆదివాసీల ఆశాజ్యోతి, హక్కుల నేత కొమరం భీం 86వ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నాడు ఘనంగా నిర్వహించారు. ఆదివాసీల హక్కులకై పోరాడి అమరుడైన కొమరం భీం వర్ధంతిని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ), ఆదివాసీ సర్పంచ్‌లు మరియు ఆదివాసీ ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించారు. భారీ ర్యాలీ,నివాళులు తొ "భీం అమర్ రహే", "ఆదివాసీ హక్కులకై పోరాడాలి" అంటూ నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొమరం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. విగ్రహ స్థాపనకు భూమి పూజా నిర్వహించారు. మండల కేంద్రంలో కొమరం భీం విగ్రహాన్ని ఏర్పాటు చేయడం కోసం నాయకులు, ప్రతినిధులు భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జెజ్జరి రాము, తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు బూర్కా యాదగిరి, సువర్ణ పాక వెంకటరత్నం, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈసం నాగేశ్వరరావు, ఆదివాసీ ఉద్యోగులు ముడిగ రామచందర్, బ్రహ్మయ్య, చుంచ శ్రీను, సారయ్య, మొల్కం లక్ష్మీనర్సు, జెజ్జరి శివ, సర్పంచ్‌లు ఈసం సురేష్, బచ్చల లక్ష్మణరావు, గ్రామ పెద్దలు చింత రవి, బూర్కా శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలతో క్రీడా సందడి

మంత్రి పొంగులేటి జన్మదిన వేడుకల్లో భాగంగా 73వ రాష్ట్రస్థాయి మహిళల కబడ్డీ పోటీలు ప్రారంభం

సత్తుపల్లి, అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి)

కబడ్డీ కూతలు.. క్రీడాకారిణుల ఉత్సాహం.. క్రీడాభిమానుల సందడి.. వెరసి సత్తుపల్లిలో క్రీడా వాతావరణం ఉత్సాహభరితంగా మారింది. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న 73వ రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల కబడ్డీ పోటీలతో పట్టణంలో క్రీడా సందడి నెలకొంది. రాణీ సెలబ్రేషన్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఈ పోటీలను ఘనంగా ప్రారంభించారు. అక్టోబర్ 28 నుంచి 30వ తేదీ వరకు మూడు రోజులపాటు జరగనున్న ఈ పోటీలు మహిళా క్రీడాకారిణుల ప్రతిభకు, పట్టుదలకు, క్రీడాస్ఫూర్తికి వేదికగా నిలవనున్నాయి.

రియల్ ఎస్టేట్ వ్యాపారుల సమస్యలు పరిష్కరించాలి

- రూ.10 వేలు కట్టిన ఎల్ఆర్ఎస్ పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి
- తెలంగాణ రియల్ ఎస్టేట్ వ్యాపార అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పంతంగి వీరస్వామి గౌడ్

సూర్యాపేట, అక్టోబర్ 28 : వుదయం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారుల సమస్యలను పరిష్కరించాలని, పది వేల రూపాయలు కట్టిన ఎల్ఆర్ఎస్ పై స్పష్టత ఇవ్వాలని తెలంగాణ రియల్ ఎస్టేట్ వ్యాపార అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పంతంగి వీరస్వామి గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

పాత వెంచర్ల ప్లాట్ల రిజిస్ట్రేషన్ కొరకు ప్రజలు ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం మీసేవ ద్వారా ఎల్ఆర్ఎస్ కోసం రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుండి పది వేల రూపాయలు కట్టించుకుని నేటికీ దానిపై స్పష్టత ఇవ్వలేదన్నారు. పట్టా పాస్ బుక్ పై ఒకటి రెండు ఎకరాల లోపు ఉన్న భూములను నాలా కన్వర్షన్ మీద ప్లాట్ నెంబర్లు వేసి రిజిస్ట్రేషన్ చేసే విధంగా ప్రభుత్వం నూతన జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. పేదలు తమ కుటుంబ అవసరాల నిమిత్తం, కూతుళ్ల పెళ్లిళ్ల కోసం ఒక్కొక్క రూపాయి వెనకేసుకుని చిన్నపాటి భూములను కొనుగోలు చేశారని, అలాంటి భూములపై కూడా రిజిస్ట్రేషన్ చేయకపోతే పేదలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లాలో 14వ వార్డు కృష్ణా కాలనీలో 20 ఏళ్ల క్రితమే 8 గుంటల స్థలాన్ని రిజిస్ట్రేషన్ ఆఫీస్ కోసం ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని, తెలంగాణ వ్యాప్తంగా ఉన్న 142 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొన్నింటికి మాత్రమే సొంత భవనాలు ఉన్నాయని, మిగతావి అద్దె భవనాల్లో ఉన్నాయని తెలిపారు. అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని కోరారు. ధరణి వెబ్ సైట్‌లో పాత డిజిటల్ సైన్ యాప్ తీసేయడం వల్ల రైతుల పేర్లు ఆన్ లైన్ లో రావడం లేదని, దానిని కూడా పరిష్కరించాలని, ఎల్ఆర్ఎస్ సమస్యను పరిష్కరించి వెంచర్ల ప్లాట్లను నాలా కన్వర్షన్ కింద రిజిస్ట్రేషన్ అయ్యేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరాలోచించి నూతన జీవో విడుదల చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సూర్యాపేట రియల్ ఎస్టేట్ జిల్లా అధ్యక్షుడు జలగం సత్యం గౌడ్, జిల్లా గౌరవ సలహాదారుడు దేవత్ కిషన్ నాయక్, రాష్ట్ర కార్యదర్శి అమరవాది శ్రావణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెన్న శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కోశాధికారి పాల సైదులు, పట్టణ గౌరవ సలహాదారుడు మాదిరెడ్డి గోపాల్ రెడ్డి, జిల్లా కార్యదర్శి అయితగాని మల్లయ్య గౌడ్, వెంకన్న, ఆకుల మారయ్య గౌడ్, రాష్ట్ర కార్యదర్శి ఖమ్మంపాటి అంజయ్య గౌడ్, పట్టణ కార్యదర్శి పట్టేటి కిరణ్, రాపర్తి జానయ్య తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా సాగర్ల శివరావు

చిలుకూరు,అక్టోబర్ 28:(వుదయం)

రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జాయింట్ సెక్రటరీగా చిలుకూరు మండలం అర్లేగూడెం గ్రామ రేషన్ డిలర్ సాగర్ల శివరావు నియమితులయ్యారు. తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు నాయకోటి రాజు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ప్రకటించిన నూతన కార్యవర్గంలో శివరావుకు ఈ బాధ్యతలు అప్పగించారు.జిల్లా రేషన్ డీలర్ల అధ్యక్షుడు కనుమర్లపూడి శ్రీనివాసరావు, కార్యదర్శి ఖాజా మొయినుద్దీన్, కోదాడ ఐఎంజీ ప్రెసిడెంట్ ఆంజనేయులు, మండల రేషన్ డీలర్ల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు, మండల ట్రెజరర్ నాగేశ

మానవ కర్మలను తొలగించేందుకే రుద్ర సహిత కాలభైరవ మహా యజ్ఞం

- డిసెంబర్ 1న 1116 దంపతులచే నిర్వహణ
- బాల మానస మహా విద్యాపీఠం పీఠాధిపతులు భవాని స్వామి

సూర్యాపేట, అక్టోబర్ 28 : వుదయం ప్రతినిధి

హిందూ ధర్మంలో ప్రతి హిందువు సంవత్సరానికి ఒక్కసారైనా యజ్ఞం, వ్రతం నిర్వహించాలని వేదాలు చెబుతున్నాయని, ఏ హోమం, వ్రతాలు చేయలేని భక్తజనులు, పేదల కోసమే ఈ మహా యజ్ఞాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీ బాల మానస మహా విద్యాపీఠం పీఠాధిపతులు శ్రీ శ్రీ లక్ష్మీనారాయణ సద్గురు భవాని స్వామీజీ తెలిపారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని యాద్రంశెట్టి ఉపేందర్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యజ్ఞ యాగాదుల ఖర్చులు రోజురోజుకు పెరుగుతున్నాయని, ఆ ఖర్చులను భరించలేక యజ్ఞాలు కుంటుపడుతున్నాయని అన్నారు. సమాజశ్రేయస్సు కోరి, మానవ కర్మలను తొలగించేందుకు తన గురువుగారు శ్రీ శ్రీ పరమ హంస పరివ్రాజకాచార్యులు శ్రీ సుదర్శన ఆశ్రమ స్వామీజీ ఆశీస్సులతో ఈ యజ్ఞాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గతంలో 2012లో లక్ష్మీనారాయణ యాగం, 2015లో శ్రీ చక్ర మహా యజ్ఞం, 2020లో శ్రీ మానసా దేవి మహా యజ్ఞం, నాలుగవసారి శ్రీ మహా మృత్యుంజయ పశుపతాస్త్ర మహాయాగం, ఐదవసారి 2024లో మహా లలిత యజ్ఞం, ఆరవసారి 2025లో ధన్వంతరి సహిత హనుమాన్ మహా యజ్ఞం, ఏడవసారి 2026లో రాజ శ్యామల మహా యజ్ఞం, ఎనిమిదవసారి 2026లో శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి మహా యాగం నిర్వహించడం జరిగిందన్నారు.

ప్రస్తుతం తొమ్మిదవసారి డిసెంబర్ 1, 2026న సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తిరుమల నగర్ రోడ్ నెంబర్ 24, 100 ఫీట్ల కలెక్టరేట్ రోడ్, అమ్మ గార్డెన్ ఎదురుగా 1116 మంది దంపతులచే శ్రీ రుద్ర సహిత కాలభైరవ మహా యజ్ఞాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు.

ప్రతి పేదవాడికి అందుబాటులో ఉండే విధంగా కేవలం రూ.1516 చెల్లించి హోమంలో పాల్గొనే అవకాశాన్ని తమ ట్రస్టు కల్పిస్తుందన్నారు. ధనవంతులు ఎలాగైనా యజ్ఞాలు చేయగలుగుతారని, పేదవాళ్లు చేయలేరని, అందుకే పేదలకు అందుబాటులో ఉండేలా ఈ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

కార్యక్రమ వివరాలు :

నవంబర్ 30న గణపతి, అమ్మవారి ఆగమనం, గణపతి పూజ, పుణ్యాహవాచనం, మండప స్థాపన, కలశ స్థాపన, పంచగవ్య ప్రాశన, అగ్ని మథనం, సహస్ర మోదక గణపతి హోమం, చండీ హోమం, మంగళహారతి, తీర్థప్రసాద వితరణ, డిసెంబర్ 1న మంగళవారం కాలభైరవ స్వామి ఆవాహనం, విశేష పూజ, కాలభైరవ హోమం, మహా పూర్ణాహుతి, మంగళహారతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ షేక్ జహీర్, నాయకులు సలిగంటి వీరేందర్, యాద్రంశెట్టి ఉపేందర్ తులసి, సంకురిశెట్టి పరమేష్ సబిత, ప్రసాదు, వాసుదేవరావు సరళ, ఆనందరావు అనిత, శ్రీనివాస్ రెడ్డి ఉమా, సంజీవరెడ్డి ఉదయశ్రీ, శ్రీనివాస్ రెడ్డి పద్మ, రాంరెడ్డి రమ, వెంకట్ రెడ్డి కళావతి, శ్రీనివాసరావు శిల్ప, లక్ష్మారెడ్డి సంధ్య, ట్రస్టు సభ్యులు జెట్టి రవికుమార్, రాజిరెడ్డి, శ్రావణ్ కుమార్, క్రాంతికుమార్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు అంతర్రాష్ట్ర దొంగలు అరెస్టు

- వ్యవసాయ విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి తీగలు, ఆయిల్, ఇతర సామగ్రి చోరీ
- రూ.50 లక్షల విలువైన నగదు, కార్లు స్వాధీనం
- తెలుగు రాష్ట్రాల్లో 29 చోరీలు.. నల్గొండ జిల్లాలోనే 18
- కేసు ఛేదించిన పోలీసు బృందానికి ఎస్పీ అభినందనలు

నల్లగొండ, జిల్లాఅక్టోబరు 28: వుదయం ప్రతినిధి

వ్యవసాయ విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి తీగలు, ఆయిల్, ఇతర సామగ్రిని దొంగిలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా ను నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.20 లక్షల నగదు, సుమారు రూ.30 లక్షల విలువైన రెండు కార్లు, రాగి తీగలు, కట్టర్లు, పానాలు, చేతి తొడుగులు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మొత్తం 29 నేరాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. నల్గొండ జిల్లాలోనే 18 చోరీలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. మరో ఐదుగురు పరారీలో ఉన్నట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు.

వాహన తనిఖీలతో వెలుగులోకి..

వేములపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగార్జునసాగర్ ఎడమ కాల్వపై ఉన్న ఎల్-15 ఎత్తిపోతల పథకానికి చెందిన 500 కేవీఏ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్‌లో 300 కిలోల రాగి, 250 లీటర్ల ఆయిల్‌ను ఆగస్టు 22న దొంగిలించారు. దీనిపై నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా జిల్లా ఎస్పీ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సాంకేతిక ఆధారాలతో నిందితుల కదలికలపై నిఘా పెట్టారు.

ఈ క్రమంలో బుధవారం వేములపల్లి గ్రామ శివారులోని సూర్యాపేట క్రాస్‌రోడ్డు వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా కారులో అనుమానాస్పదంగా వెళ్తున్న ముగ్గురిని ఆపి విచారించారు. వారిలో ఒకరు గతంలో ట్రాన్స్‌ఫార్మర్ చోరీ కేసులో నిందితుడైన షేక్ చంద్ పాషాగా గుర్తించారు. కారులో కట్టర్లు, పానాలు, చేతి తొడుగులు ఉండటంతో అనుమానం బలపడింది. వారి సమాచారంతో మిర్యాలగూడలోని చంద్ పాషా ఇంటి వద్ద మరో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. చోరీ చేసిన రాగి సామగ్రిని హైదరాబాద్‌లోని హయత్‌నగర్ ప్రాంతంలో పాతసామగ్రి వ్యాపారికి విక్రయించినట్లు విచారణలో వెల్లడైంది.

రాత్రివేళల్లో చోరీలు

నిందితులు జల్సాలకు అలవాటుపడి, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ముఠాగా ఏర్పడినట్లు పోలీసులు తెలిపారు. గ్రామాలకు దూరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి, రాత్రివేళల్లో కార్లలో అక్కడికి చేరుకునేవారు. కట్టర్లు, పానాల సాయంతో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి రాగి తీగలు, ఆయిల్, అల్యూమినియం వైర్లను దొంగిలించేవారు. వాటిని పాతసామగ్రి వ్యాపారులకు విక్రయించి వచ్చిన డబ్బును పంచుకునేవారు. పోలీసులకు అనుమానం రాకుండా నకిలీ నంబరు ప్లేట్లు వినియోగించినట్లు వెల్లడైంది.

తెలుగు రాష్ట్రాల్లో 29 కేసులు

విచారణలో తెలంగాణలో 25, ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు నేరాలకు పాల్పడినట్లు గుర్తించారు. తెలంగాణలో నల్లగొండ జిల్లాలోని వేములపల్లి, వాడపల్లి, మాడ్గులపల్లి, అడవిదేవులపల్లి, మిర్యాలగూడ, తిరుమలగిరి సాగర్, హాలియా, త్రిపురారం, కనగల్, చింతపల్లి, నేరెడుగొమ్ము, దేవరకొండ తదితర పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. ఇతర ప్రాంతాల్లోనూ పలు కేసుల్లో వీరి ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. ఆంధ్రప్రదేశ్‌లో పల్నాడు, మాచవరం, దాచేపల్లి ప్రాంతాల్లో నాలుగు నేరాలకు పాల్పడినట్లు వెల్లడించారు.

నిందితులు వీరే..

అరెస్టయిన వారిలో షేక్ చంద్ పాషా (26), రామావత్ సూర్య (19), గలబ సాయి కిరణ్ (19), ఇస్లావత్ దేశిరామ్ (24) ఉన్నారు. వీరిలో దేశిరామ్ చోరీ సొత్తును కొనుగోలు చేసే వ్యక్తిగా వ్యవహరించినట్లు పోలీసులు తెలిపారు. సంతోష్, నాన్కు, మోడల్ సాయి, ప్రియా, సునీత అనే మరో ఐదుగురి కోసం గాలిస్తున్నారు.

పోలీసు బృందానికి ఎస్పీ అభినందనలు

మిర్యాలగూడ డీఎస్పీ జి. రవి పర్యవేక్షణలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం. జితేందర్‌రెడ్డి, మిర్యాలగూడ రెండో పట్టణ ఇన్‌స్పెక్టర్ జె. సోమనర్సయ్య, మిర్యాలగూడ రూరల్ సీఐ పి.ఎన్.డి. ప్రసాద్, వేములపల్లి ఎస్ఐ వి. సురేశ్‌రెడ్డి తదితరులు కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించారు. సీసీఎస్ సిబ్బంది, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది కృషిని ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

నషా ముక్త్ ర్యాలీని ప్రారంభించిన అదనపు ఎస్పీ రమేష్

నల్లగొండ జిల్లా అక్టోబర్ 28 వుదయం ప్రతినిధి

నల్గొండ పట్టణ కేంద్రంలో యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా అదనపు ఎస్పీ రమేష్ అన్నారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా నల్లగొండ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. యువత, కళాశాల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం క్లాక్‌టవర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా ఎల్ఈడీ తెర ద్వారా వర్చువల్‌గా పాల్గొని విద్యార్థులు, యువతతో మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ పులిపాటి హేమలత మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసలైతే దేశాభివృద్ధిపై ప్రభావం పడుతుందని అన్నారు. మాదకద్రవ్యాల వల్ల యువత భవిష్యత్తు దెబ్బతినడంతో పాటు కుటుంబాలు కూడా నష్టపోతున్నాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల ప్రవర్తనను గమనిస్తూ, వ్యసనాల లక్షణాలు కనిపిస్తే కౌన్సెలింగ్, వైద్య సహాయం అందించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలు, వాటికి బానిసైన యువత అనుభవాలను వివరించే వీడియోలను ప్రదర్శించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ దేవులపల్లి శ్రీకాంత్, కార్యదర్శి గుంటి రామకృష్ణ, కోశాధికారి కుంభం జ్యోతి రెడ్డి, ఐబీసీ ఛానల్ ఎండీ ఏచూరి శైలజ, పలువురు రెడ్‌క్రాస్ సభ్యులు, సామాజికవేత్తలు, కళాశాలల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు పాల్గొన్నారు.

నూతన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల అధ్యక్షులకు ఘన సన్మానం

మధిర, అక్టోబర్ ,28, వుదయం, ప్రతినిధి:

మండలంలోని ఖమ్మంపాడు గ్రామంలో ఎంఆర్‌పీఎస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) మధిర మండల అధ్యక్షుడు వేల్పుల పవన్ కళ్యాణ్ మాదిగ, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్పీ) మండల అధ్యక్షుడు మేషపోగు ఇర్మియా మాదిగలను ఘనంగా సన్మానించారు. గ్రామ కమిటీ సభ్యులు నూతన అధ్యక్షులకు శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాదిగల హక్కుల సాధనకు, సామాజిక న్యాయం కోసం నిరంతరం కృషి చేస్తూ, ఎంఆర్‌పీఎస్, ఎంఎస్పీ సంఘాల బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. నూతన నాయకత్వం మాదిగల అభ్యున్నతికి, యువతలో చైతన్యం తీసుకురావడానికి కృషి చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు, గ్రామ కమిటీ సభ్యులు,యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తుపాను నేపథ్యంలో పత్తి నిల్వ గోదాముల పరిశీలన

మధిర, అక్టోబర్, 28, వుదయం, ప్రతినిధి:

తుపాను ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని మధిర వ్యవసాయ మార్కెట్ యార్డులో నిల్వ ఉంచిన పత్తి బేళ్ల భద్రతపై మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు ప్రత్యేక దృష్టి సారించారు.బుధవారం మధ్యాహ్నం మార్కెట్ యార్డులో గత సంవత్సరం భారత పత్తి సంస్థ ఆధ్వర్యంలో రైతుల నుంచి కొనుగోలు చేసి, జిన్నింగ్ అనంతరం గోదాముల్లో నిల్వ ఉంచిన పత్తి బేళ్లను సంబంధిత సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. తుపాను కారణంగా గోదాముల్లోకి వర్షపు నీరు చేరకుండా లీకేజీలను తనిఖీ చేశారు. ఎక్కడైనా చిన్నపాటి లీకేజీలు ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే మరమ్మతులు చేపట్టి, పత్తి బేళ్లు తడవకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత కార్యదర్శిని ఆదేశించారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన పత్తి నిల్వలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ పరిశీలనలో మార్కెటింగ్ కార్యదర్శి ఆంజనేయులు, సూపర్‌వైజర్ దినేష్ కుమార్, నిర్మలకుమారి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మధిరలో మంత్రి పొంగులేటి జన్మదిన వేడుకలు

మధిర, అక్టోబర్,28, వుదయం, ప్రతినిధి:

తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని మధిర పట్టణంలోని కేవీఆర్ ఆసుపత్రి ఆవరణలో ప్రముఖ వైద్యులు, ఆసుపత్రి అధినేత, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు డాక్టర్ కోట రాంబాబు ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలు పరస్పరం శుభాకాంక్షలుతెలియజేసుకున్నారు. అనంతరం తలసేమియా బాధిత చిన్నారులకు రక్తం అందించాలనే సంకల్పంతో ఏర్పాటు చేసిన భారీ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించగా, డాక్టర్ కోట రాంబాబు, అయిలూరి వెంకటేశ్వర్ రెడ్డి స్వయంగా రక్తదానం చేసి యువతకు స్ఫూర్తిగా నిలిచారు. ఈ సందర్భంగా డాక్టర్ కోట రాంబాబు మాట్లాడుతూ ప్రజాసేవకు అంకితమైన నాయకుడిగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ సంపూర్ణ ఆయురారోగ్యాలతో ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. రక్తదాన శిబిరంలో స్వచ్ఛందంగా పాల్గొన్న యువకులు, కాంగ్రెస్ నాయకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వర్ రెడ్డి, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, మధిర పట్టణ కాంగ్రెస్ నాయకులు దేవిశెట్టి రంగారావు, ఎర్రుపాలెం మాజీ జెడ్పీటీసీ అంకశాల శ్రీనివాసరావు, మధిర మాజీ ఎంపీపీ ఎర్రగుంట రమేష్, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ శీలం వీరవెంకటరెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచులు, గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ శ్రేణులు, మహిళలు, మంత్రి అభిమానులు పాల్గొన్నారు.

ఎస్ఐపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపించాలి

యువకుడిపై చేయి చేసుకున్నట్లు ఆరోపణలు.. యువజన సంఘాల నాయకుల డిమాండ్

నల్గొండ జిల్లా అక్టోబర్ 28 వుదయం ప్రతినిధి

నల్లగొండ జిల్లా పాలకీడు గ్రామంలో ఈ నెల 21న ఓ యువకుడిపై ఎస్ఐ చేయి చేసుకున్నట్లు వచ్చిన ఆరోపణలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాలని యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఘటనకు సంబంధించిన వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులు చట్టానికి లోబడి విధులు నిర్వహిస్తూ ప్రజల హక్కులను పరిరక్షించాలని నాయకులు పేర్కొన్నారు. యువకుడిపై దాడి జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితుడికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో షేక్ నజీర్, సతీష్, బీసీ నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఉచిత మెగా వైద్య శిబిరం

ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే జారె

దమ్మపేట అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి):

రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణం సమాచార మరియు పౌర సంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం కేంద్రంలోని శ్రీ వినాయక ఫంక్షన్ హాల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు రాష్ట్ర మాజీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ముప్పా విజయబాబు సారథ్యంలో కుమారుడు ధనుష్ ప్రణవ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన ఇండస్ ఇంటర్నేషనల్ స్కూల్ సహకారంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌరవ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ హాజరయ్యారు ఈ సందర్భంగా ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో పాల్గొని కార్యక్రమ నిర్వాహకులను అభినందించారు ప్రజలకు ఆరోగ్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంలో ఇటువంటి శిబిరాలు ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు

ముందుగా మందలపల్లి సాయిబాబా మందిరంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఓ విజయ బాబు అభిమానులు మరియు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొన్నారు ఆ తర్వాత మందలపల్లి సెంటర్‌లో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొని జన్మదిన వేడుకల్లో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమాల్లో మండల ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు చిన్న శెట్టి యుగంధర్, దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి యువజన కాంగ్రెస్ నాయకులు, సాయిల నరసింహారావు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కేవైసీఎస్ చండూరు మండల నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

మండల అధ్యక్షుడిగా అందిరిక రాజశేఖర్ కురుమ

చండూరు,అక్టోబర్ 28 (వుదయం):

కురుమ యువ చైతన్య సమితి (కేవైసీఎస్) చండూరు మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నల్లగొండ జిల్లా అధ్యక్షుడు బండారు శంకర్ కురుమ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ప్రకటించారు.మండల అధ్యక్షుడిగా అందిరిక రాజశేఖర్ కురుమ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆది యాదయ్య కురుమ, ప్రధాన కార్యదర్శిగా బైరుగొండ శ్రీశైలం కురుమ, ఉపాధ్యక్షుడిగా నెట్టు రమేష్ కురుమ, కార్యదర్శిగా బైరుగొండ హనుమంతు కురుమ, ప్రచార కార్యదర్శిగా నెట్టు సురేష్ కురుమ ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా బైరుగొండ నరసింహ కురుమ, బైరుగొండ యాదయ్య కురుమ, ఆది బీరయ్య కురుమ, నెట్టు శ్రీశైలం కురుమ, అందిరిక లింగస్వామి కురుమ, అందిరిక యాదయ్య కురుమ ఎంపికయ్యారు.

ఈ సందర్భంగా జిల్లా నాయకులు మాట్లాడుతూ సూతన కమిటీ కురుమ యువతను సంఘటితం చేస్తూ, సామాజిక వర్గ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించి, రాజకీయంగా ఎదిగేందుకు కేవైసీఎస్ వేదికగా పనిచేయాలని సూచించారు. సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ కురుమ సామాజిక వర్గ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు గొరిగె సత్తయ్య కురుమ, బాలం జంగయ్య కురుమ, జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నం శ్రీకాంత్ కురుమ, జిల్లా ఉపాధ్యక్షుడు దెందే మల్లేష్ కురుమ, జిల్లా కోశాధికారి మందుల అశోక్ కురుమ, మునుగోడు నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్ కురుమ, గట్టుప్పల్ మండల అధ్యక్షుడు కుండే చంద్రయ్య కురుమ, మునుగోడు మండల అధ్యక్షుడు బొడిశ మల్లేష్ కురుమ, వర్కింగ్ ప్రెసిడెంట్ బండారు మహేష్ కురుమ, శ్రీశైలం కురుమ తదితరులు పాల్గొన్నారు.

పిఏసిఎస్ చిలుకూరులో వ్యక్తిగత నిర్ణయాలతో ఉద్యోగాలు

- దరఖాస్తు దారులను పిలవకుండా తమ సొంత నిర్ణయాలతో (చైర్మెన్ & సి ఇ ఓ) నియామకాలు
- ఉద్యోగ నియామకం చైర్మన్ మరియు సంఘం డైరెక్టర్లు చేశారు అంటున్న (సి ఇ ఓ) లక్ష్మీనారాయణ

చిలుకూరు అక్టోబర్ 28:(వుదయం)

మండల కేంద్రంలో గల (పి ఏ సి ఎస్) చిలుకూరు లో ఉద్యోగాలు ఉన్నాయంటూ నిరుద్యోగులు నుండి దరఖాస్తులు తీసుకున్న కమిటీ సుమారుగా 30 దరఖాస్తులు వచ్చినట్లు అంచనా. 26/10/2026రోజున దరఖాస్తు దారులను పిలవకుండా ,ఎటువంటి ఇంటర్వ్యూ లు నిర్వహించకుండా చైర్మెన్ అల్సకాని జనార్దన్ ,సీ ఇ ఓ చిలువేరు లక్ష్మీనారాయణ,మరియు సంఘం డైరెక్టర్లు సమక్షంలో ఒక వుద్యోగానికి ఒక వ్యక్తి నీ విల్లే స్వతహాగా నియమించినట్లు దరఖాస్తుదారులు ఆందోళన. నిర్మాణ పనులు మరియు చేపట్టిన అభివృద్ధి పనులు పై గ్రామ ప్రజలు తీవ్ర అసం తృప్తి వ్యక్తం చేస్తున్నారు. సమయ పాలన పాటించని సిబ్బంది ఈ ఉద్యోగ నియామకం పై ఉన్నత అధికారులు క్షేత్ర స్థాయి లో విచారణ జరిపి నిరుద్యోగులకు సరి అయిన న్యాయం చేయాలని కోరుతూ అలాగే పి ఏ సి ఎస్ వచ్చిన నిధులు ఏవిధంగా అమలు పరిచారు, అభివృద్ధి పనులు , నిర్మాణ పనులపై క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయవలసిందిగా గ్రామ ప్రజలు ఉన్నత అధికారులను కోరుతున్నారు.

కరువు మండలాల ప్రకటన పట్ల సర్పంచ్ హర్షం

అనంతగిరి అక్టోబర్ 28 వుదయం

రాష్ట్రప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించడం పట్ల వాయిల సింగారం గ్రామ సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం తో ప్రక్కన రాష్ట్రాలలో తాగునీటికి, సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సామాన్య ప్రజల బతుకులు, ఆరోగ్యాలు, ఆర్థిక పరిస్థితులు అన్నీ దెబ్బతిన్నయన్నారు ఎప్పుడూ లేనివిధంగా ప్రకృతిలో మార్పులు వచ్చి జనం భయపడుతున్న సమయం లో ప్రభుత్వం సరైన రీతిలో స్పందించి, పారదర్శకంగా కరువు మండలాలు ప్రకటించడం సంతోషమని అన్నారు.గత ఏడాది వర్షాలు సరిగా లేకపోవడం వల్ల మన అనంతగిరి మండలంలో రైతులు తీవ్రంగా నష్టపోయారని. పంటలు ఎండిపోయాయి అని, బోర్లు, బావుల లో భూగర్భ జలాలు తగ్గిపోవడం తో. పశువులకు మేత కూడా దొరకని పరిస్థితి వచ్చింది. కూలీలకు పనులు లేక వలసలు పోతున్న పరిస్థితి నెలకొంది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వం మన మండలాన్ని కరువు జాబితాలో చేర్చడం వల్ల రైతులకు, పేదలకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన అన్నారు.ఈ కరువు ప్రకటనవి తో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, పంట రుణాల మాఫీ, వడ్డీ రాయితీ, ఉపాధి హామీ పనులు ఎక్కువ రోజులు కల్పించడం, తాగునీటి ట్యాంకర్లు, పశువులకు మేత, నీటి సౌకర్యం వంటి ఎన్నో పథకాలు అందుతయని అన్నారు దీనివల్ల రైతులు, కూలీలు, సామాన్య జనానికి కొంత ఊరట లభిస్తదని తెలిపారు.మన అనంతగిరి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

16వ రోజు దీక్షా శిబిరాన్ని సందర్శించి ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకు సంఘీభావం

జనసేన ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడాల శ్రీనివాసరావు

నల్గొండ జిల్లా అక్టోబర్ 28 , వుదయం ప్రతినిధి

నల్గొండ పట్టణ కేంద్రంలో కలెక్టర్

అన్నదాత ఆశలపై తుఫాన్.. ఆవేదనలో రైతులు..!

చిలుకూరు అక్టోబర్ 28:(వుదయం)



సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలో బేతవోలు నారాయణపురం రామాపురం పలు గ్రామాల్లో బుధవారం కురిసిన ఆకల వర్షానికి వరి పంటలు నేలపాలయ్యాయి ఆరుగాలం కష్టపడి సాగుచేసిన పంట చేతికొచ్చే సమయంలో వర్షం దెబ్బతీయడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు,పంట సాగు కోసం పెట్టిన పెట్టుబడులు, ఎరువులు, కూలీల ఖర్చులు పెరిగి ఇప్పటికే ఇబ్బందులు పడుతున్న రైతులకు అకాల వర్షం మరింత నష్టాన్ని మిగిల్చింది. పంట నేలకొరగడంతో దిగుబడిపై ప్రభావం పడుతుందేమోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అప్పులు చేసి సాగు చేసిన తమకు ప్రకృతి వైపరీత్యాలు తీరని నష్టాన్ని కలిగిస్తున్నాయని రైతులు వాపోతున్నారు.నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తగిన పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

జల సంరక్షణపై 9వ తరగతి విద్యార్థులతో జిల్లా వ్యాప్తంగా ప్రాజెక్ట్ వర్క్

యాదాద్రి భువనగిరి జిల్లా, వుదయం ప్రతినిధి

గౌరవ జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి వనరుల సంరక్షణ, వర్షపు నీటి నిల్వ, భూగర్భ జలాల పెంపు, నీటి పొదుపుపై అవగాహన కల్పించేందుకు యాదాద్రి–భువనగిరి జిల్లాలోని ఉన్నత పాఠశాలలు ఉన్న గ్రామాల్లో 9వ తరగతి విద్యార్థులతో బుధవారం, అక్టోబర్ 28న ప్రత్యేక ప్రాజెక్ట్ వర్క్ నిర్వహించారు.

జిల్లాలోని 189 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ ప్రత్యేక అధికారులు ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. విద్యార్థులను బృందాలుగా విభజించి, ప్రతి బృందానికి ఒక ఉపాధ్యాయుడిని తోడుగా నియమించి గ్రామాల్లోని ఇంకుడు గుంతలు, వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలను పరిశీలించేందుకు పంపించారు. ఈ కార్యక్రమానికి గ్రామ కార్యదర్శుల సహకారం కూడా తీసుకున్నారు.

ప్రాజెక్ట్ వర్క్‌లో భాగంగా విద్యార్థులు పరిశీలించిన అంశాలు:

1. ఇంకుడు గుంతల వల్ల కలిగే ప్రయోజనాలు, భూగర్భ జలాల పెంపులో వాటి ప్రాధాన్యం.
2. గ్రామంలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతల సంఖ్య.
3. సక్రమంగా పనిచేస్తున్న ఇంకుడు గుంతలు, మరమ్మతులు అవసరమైన గుంతల వివరాలు.
4. ఇంకుడు గుంతల నిర్వహణ తీరు, వాటి ప్రస్తుత స్థితి.
5. ఇంకుడు గుంతల నిర్వహణ బాధ్యతలు చేపడుతున్న వ్యక్తులు లేదా సంబంధిత సంస్థల వివరాలు.
6. గ్రామంలో నీటి వినియోగం, నీటి వినియోగ విధానాలు.
7. నీటి పొదుపు కోసం గ్రామంలో చేపడుతున్న చర్యలు.
8. గ్రామంలో నీటి లభ్యత, నీటి అవసరాలను తీర్చేందుకు అనుసరిస్తున్న విధానాలు.
9. గ్రామస్థులకు నీటి పొదుపు, విద్యుత్ పొదుపు, నీటి వనరుల సంరక్షణపై అవగాహన కల్పించడం.

విద్యార్థులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన వివరాల ఆధారంగా నివేదికలను తయారు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కేజీబీవీ ప్రత్యేక అధికారులు విద్యార్థులకు అవసరమైన సూచనలు, సలహాలు అందించారు. సెక్టోరియల్ అధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామ కార్యదర్శులు క్షేత్రస్థాయి పరిశీలనకు సహకరించారు. ఈ ప్రాజెక్ట్ వర్క్ ద్వారా విద్యార్థులకు గ్రామస్థాయిలో నీటి సంరక్షణ నిర్మాణాల పనితీరు, వాటి నిర్వహణ, భూగర్భ జలాల పునర్భరణ అవసరంపై ఆచరణాత్మక అవగాహన కలిగింది. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలకు నీటిని పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవశ్యకతను వివరించేలా ప్రోత్సహించారు.

అర్నబ్ తుఫాన్ ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి

- ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లకు మంత్రి పొంగులేటి ఆదేశాలు
- భారీ వర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో జాగ్రత్త చర్యలు చేపట్టండి
- పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచనలు

ఖమ్మం వుదయం బ్యూరో అక్టోబర్ 2 8

బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర తుఫాన్ అర్నబ్ ప్రభావంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచించారు. తుఫాన్ ప్రభావంతో ఈదురుగాలుల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, నష్టం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్‌తో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి.. వాతావరణ పరిస్థితులపై ఆరా తీశారు. రెండు జిల్లాల్లోనూ అప్రమత్తంగా ఉండి, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తుఫాన్ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని, సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ముందస్తు ఏర్పాట్లు చేయాలని, పరిస్థితులకు అనుగుణంగా తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు సూచించారు.

మహిళా భద్రతా విభాగం పనితీరు, భరోసా కేంద్రం నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్

యాదాద్రి భువనగిరి జిల్లా. వుదయం ప్రతినిధి

యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ శ్రీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ మహిళా భద్రతా విభాగం ఏర్పాటు, పనితీరు, నిర్వహణకు సంబంధించిన అంశాలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సమావేశంలో మహిళా భద్రతా విభాగం పనితీరు, భరోసా కేంద్రం నిర్వహణకు అవసరమైన ఆర్థిక వనరులు, కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలు, ఐటీఎస్ఎస్ఓ (ITSSO)లో పెండింగ్‌లో ఉన్న కేసుల సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. మహిళలు, బాలికల భద్రతకు సంబంధించిన ఫిర్యాదులపై సత్వర స్పందన, బాధితులకు అవసరమైన సహాయం అందించడం, భరోసా కేంద్రం సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించడం, ఐటీఎస్ఎస్ఓలో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం వంటి అంశాలపై చర్చించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు ఎస్పీ శ్రీ లక్ష్మీ నారాయణ, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ హనుమంత్ నాయక్, భరోసా ఎస్ఐ ఓ. సంధ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం: డీసీపీ భూక్య రామ్ రెడ్డి

పెద్దపల్లి, (సుల్తానాబాద్) అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి)

విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు చిర స్మ ర ణీయ మ ని పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్ రెడ్డి అన్నారు. పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సుల్తానాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. సుల్తానాబాద్ సర్కిల్ పరిధిలోని సుల్తానాబాద్, జూలపల్లి, ఎలిగేడు, పొత్కపల్లి, కాల్వ శ్రీరాంపూర్ పోలీసుల ఆధ్వర్యంలో సీఐ పొన్న మనేని రంజిత్ రావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం చేపట్టారు. తెలంగాణ చౌరస్తా వద్ద డీసీపీ భూక్య రామ్ రెడ్డి జెండా ఊపి సైకిల్ ర్యాలీని ప్రారంభించారు.

ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. ప్రజలకు సేవలందించే క్రమంలో పోలీసులు వివిధ సందర్భాల్లో ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తెలంగాణ చౌరస్తా నుంచి ప్రారంభమైన సైకిల్ ర్యాలీ తహసీల్దార్ కార్యాలయం, సివిల్ ఆస్పత్రి, శివాలయం, పాత జెండా, పోలీస్ స్టేషన్, రాజీవ్ రహదారి మీదుగా పూసాల ఎక్స్ రోడ్ చేరుకుంది. అక్కడి నుంచి వివేకానంద స్కూల్ వరకు కొనసాగి, తిరిగి తెలంగాణ చౌరస్తాకు చేరుకోవడంతో ర్యాలీ ముగిసింది.

ఈ కార్యక్రమంలో ఎస్సైలు చంద్రకుమార్, మధుకర్, గట్ల సుధాకర్‌తో పాటు సర్కిల్ పరిధిలోని పోలీసు సిబ్బంది, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, సుల్తానాబాద్ మండల పాత్రికేయులు, క్రీడాకారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల కేసుల పరిష్కారంలో నల్లగొండ భేష్

- గతేడాది 45–50 కేసులు.. ఈ ఏడాది ఇప్పటివరకు ఐదు మాత్రమే
- నాలుగు కేసుల పరిష్కారం.. జిల్లా యంత్రాంగంపై హెచ్‌ఆర్‌సీ చైర్‌పర్సన్ ప్రశంసలు
- రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్

నల్గొండ జిల్లా అక్టోబర్ 28 వుదయం ప్రతినిధి

నల్గొండ పట్టణ కేంద్రంలో మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన కేసుల పరిష్కారంలో నల్లగొండ జిల్లా యంత్రాంగం పనితీరు అభినందనీయమని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్‌సీ) చైర్‌పర్సన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ ప్రశంసించారు. గత ఏడాది జిల్లాలో 45 నుంచి 50 వరకు కేసులు నమోదుకాగా.. ఈ ఏడాది ఇప్పటివరకు ఐదు కేసులు మాత్రమే నమోదయ్యాయని కలెక్టర్ బి. చంద్రశేఖర్ వివరించారు. వీటిలో నాలుగు కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని చైర్‌పర్సన్ సూచించారు.

ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ

రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ బుధవారం నల్లగొండలో పర్యటించారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఇతర జిల్లా అధికారులతో సమావేశమై మానవ హక్కుల కేసుల పరిష్కారంపై సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా 17 వేల పెండింగ్ కేసుల్లో 15 వేలకు పైగా పరిష్కరించినట్లు తెలిపారు. విద్య, వైద్యం, భూములు, పోలీసు, రెవెన్యూ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులతో పాటు సీనియర్ సిటిజన్ల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఫీజుల బకాయిల పేరుతో విద్యార్థుల ఒరిజినల్ ధ్రువ పత్రాలను విద్యాసంస్థలు నిలిపివేయకూడదని స్పష్టం చేశారు. విద్యార్థుల సర్టిఫికెట్ల సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం చేయాలని ఆదేశించారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవల పరిశీలన

అనంతరం నల్లగొండ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని సందర్శించిన చైర్‌పర్సన్ అత్యవసర విభాగం, ఐసీయూ, యూడీఐడీ కేంద్రాల్లో అందుతున్న సేవలను పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్య సేవలు, రోగులకు అందుతున్న సౌకర్యాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఆసుపత్రిలో రోజుకు సుమారు 1,200 మంది ఔట్‌పేషెంట్లకు, 700 మంది ఇన్‌పేషెంట్లకు వైద్య సేవలు అందించే సామర్థ్యం ఉందని అధికారులు వివరించారు. నెలకు సుమారు 800 ప్రసవాలు జరుగుతుండగా.. 60 శాతం సాధారణ ప్రసవాలు, 40 శాతం సిజేరియన్లు జరుగుతున్నట్లు తెలిపారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, వైద్య పరంగా అత్యవసరమైన సందర్భాల్లో మాత్రమే సిజేరియన్ శస్త్రచికిత్సలు చేయాలని వైద్యులకు సూచించారు. పేద, మధ్యతరగతి ప్రజలకు విద్య, వైద్యం అందుబాటులో ఉండేలా చూడాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వై. అశోక్‌రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ రాహుల్, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నాగేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రతి అర్హత కలిగిన పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడమే ప్రధాన లక్ష్యం

జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ శ్రీ దేవసేన

ఖమ్మం వు దయం బ్యూరో కూసుమంచి, అక్టోబర్- 28

ప్రతి అర్హత కలిగిన పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడమే ప్రధాన లక్ష్యమని జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎ. శ్రీ దేవసేన తెలిపారు. బుధవారం కూసుమంచి ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎస్ఐఆర్ కార్యక్రమంపై జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎ.శ్రీ దేవసేన, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి ఈఆర్ఓ లతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎ.శ్రీ దేవసేన మాట్లాడుతూ ఎలక్టోరల్ తయారు ఎన్నికల ముఖ్య ఘట్టమని అన్నారు. ఎలక్టోరల్ ప్రక్రియలో స్వీకరించిన ఫారం 6, 6 ఏ, 7, 8 ల పరిష్కార ప్రక్రియలో జిల్లా ఎన్నికల అధికారి, ఈఆర్ఓ ల తనిఖీలు చేయాలన్నారు. ఎన్ఆర్ఐ ల నుండి వచ్చిన దరఖాస్తులు నిబంధనల మేరకు పరిష్కరించాలన్నారు. బూత్ స్థాయి అధికారులతో డోర్ టు డోర్ సర్వే ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలన్నారు. బూత్ స్థాయి అధికారులు క్షేత్ర పరిశీలనలో గుర్తించిన సవరణలు ఎలక్టోరల్ రోల్ చేయాలన్నారు. రోల్ డాటా బేస్ లో మార్క్ష్ ఓటర్ల గుర్తింపు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అత్యధిక చేర్పులు, అత్యధిక తొలగింపులు చేసిన 20 పోలింగ్ కేంద్రాలను ప్రతి నియోజకవర్గంలో పునఃపరిశీలన చేయాలన్నారు. నోటీసుల జారీ ప్రక్రియ సక్రమంగా చేయాలన్నారు. హియరింగ్ ప్రక్రియకు తగిన సమయం ఇవ్వాలన్నారు. ప్రతి దరఖాస్తుకు సంబంధించి రికార్డు భద్రపరచాలన్నారు. సరిహద్దు జిల్లాల పద్ద ద్వంద నమోదులు తనిఖీ చేయాలన్నారు. ఎపిక్ కార్డుల పంపిణీపై దృష్టి పెట్టాలన్నారు. ప్రింట్ అయి వచ్చిన కార్డులను సంబంధిత ఓటర్లకు చేరేలా చూడాలన్నారు. యువ ఓటర్ల నమోదు పట్ల దృష్టి సారించాలన్నారు.ఓటర్ల ఫిర్యాదుల పరిష్కారంపై పర్యవేక్షణ చేయాలన్నారు. ఖచ్చితమైన ఎలక్టోరల్ రోల్ రూపకల్పనకు ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా ఎలక్టోరల్ అబ్జర్వర్ తెలిపారు. సమీక్షలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 5 శాసనసభ నియోజకవర్గాలు ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి, ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో ఉన్నాయని, దీనికి సంబంధించి 29 మంది ఏఈఆర్ఓలు, 88 మంది అదనపు ఏఈఆర్ఓలు, 148 మంది సూపర్‌వైజర్లు, 1,479 మంది బీఎల్ఓలు బాధ్యతలు నిర్వహిస్తున్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం ఓటర్ల సంఖ్య 10,85,927 ఉండగా, జెండర్ రేషియో 1069గా, ఈపీ రేషియో 688గా నమోదైందని, అలాగే ఎపిక్ కవరేజ్ 99.99% పూర్తయిందని వివరించారు. జిల్లాలో 18–19 సంవత్సరాల వయస్సు గల యువ ఓటర్లు 11,596 మంది, 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు 9,111 మంది, 23,588 మంది దివ్యాంగ ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ద్వారా అదనంగా 19 కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో మొత్తం పోలింగ్ కేంద్రాల సంఖ్య 1,479కు చేరిందని తెలిపారు. సమావేశంలో ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీవో ఎస్. శ్రీనివాస్, ఎస్డీసీ సదానందం, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎం.ఏ. రాజు, కూసుమంచి తహసీల్దార్ సైదులు, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ జయచంద్ర, ఎన్నికల డిటి అన్సారీ, నాయబ్ తహశీల్దార్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు

హెచ్‌ఐవీ పరీక్షలు, చికిత్స సేవల బలోపేతానికి శిక్షణ కార్యక్రమం

యాదాద్రి భువనగిరి జిల్లా, అక్టోబర్ 28, 2026:

యాదాద్రి భువనగిరి జిల్లాలో హెచ్‌ఐవీ (HIV) పరీక్షలు, వ్యాధి నిర్ధారణ, చికిత్స సేవలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (PHCs), ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల (AAMs) ద్వారా ప్రజలకు మరింత చేరువ చేసేందుకు చేపట్టిన పైలట్ ప్రాజెక్టులో భాగంగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం రెండో రోజు విజయవంతంగా కొనసాగింది. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు క్షేత్రస్థాయిలోనే హెచ్‌ఐవీ పరీక్షలు, వ్యాధి నిర్ధారణ, చికిత్సకు సంబంధించిన సేవలను సులభంగా అందుబాటులోకి తీసుకురావడం, హెచ్‌ఐవీపై అవగాహన పెంపొందించడం, అవసరమైన వారికి సకాలంలో వైద్య సేవలు అందేలా చూడడం ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి.

95-95-95 లక్ష్యాల సాధనపై ప్రత్యేక దృష్టి

హెచ్‌ఐవీ నియంత్రణలో భాగంగా జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమం నిర్దేశించిన 95-95-95 లక్ష్యాల సాధనకు క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఈ సందర్భంగా వివరించారు.

1. మొదటి 95: హెచ్‌ఐవీతో జీవిస్తున్న వారిలో 95 శాతం మందికి తమ హెచ్‌ఐవీ స్థితి గురించి తెలిసేలా పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం.
2. రెండో 95: హెచ్‌ఐవీ నిర్ధారణ అయిన వారిలో 95 శాతం మందికి యాంటీ రెట్రోవైరల్ థెరపీ (ART) చికిత్స అందేలా చూడడం.
3. మూడో 95: ART చికిత్స పొందుతున్న వారిలో 95 శాతం మందిలో వైరల్ లోడ్‌ను నియంత్రణలోకి తీసుకురావడం.

ఈ లక్ష్యాల సాధనకు PHCలు, AAMలు, ART కేంద్రాలు, ICTCలు, ప్రభుత్వేతర సంస్థలు (NGOs), కమ్యూనిటీ ఆధారిత సంస్థలు (CBOs) పరస్పర సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు.

ఐదు మండలాల వైద్య సిబ్బందికి శిక్షణ

యాదగిరిగుట్ట, మోత్కూరు, వలిగొండ, పోచంపల్లి, బీబీనగర్ మండలాలకు చెందిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల వైద్యులు, ఆరోగ్య సిబ్బంది ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. హెచ్‌ఐవీ పరీక్షలు, అనుమానిత కేసుల గుర్తింపు, నిర్ధారణ అనంతరం చికిత్సా కేంద్రాలకు అనుసంధానం, చికిత్స కొనసాగింపు, రోగుల అనుసరణ (Follow-up) వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

ప్రముఖుల పాల్గొనడం

ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (TG SACS) ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ కె. విద్యాసాగర్ గారు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. మనోహర్ గారు పాల్గొన్నారు. అలాగే, డా. వంశీకృష్ణ, ప్రోగ్రాం అధికారి ఎయిడ్స్ మరియు లెప్రసీ, JHPIEGO సంస్థకు చెందిన శ్రీ ఆంథోనీ రెడ్డి, ప్రివెన్షన్ అడ్వైజర్; డా. శాంతి, ట్రీట్‌మెంట్ అడ్వైజర్; శ్రీ అశోక్, మానిటరింగ్ అండ్ ఎవాల్యుయేషన్ ఆఫీసర్; DAPCU జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ శ్రీ సుధాకర్ పాల్గొన్నారు. ART, ICTC కేంద్రాల సిబ్బంది, PHC వైద్య సిబ్బంది, NGOలు, CBOల ప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

ప్రజలకు మరింత చేరువలో హెచ్‌ఐవీ సేవలు

ఈ పైలట్ ప్రాజెక్టు ద్వారా హెచ్‌ఐవీ పరీక్షలు, చికిత్స సేవలను ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థతో అనుసంధానం చేసి, అవసరమైన వారికి సకాలంలో వైద్య సేవలు అందించడం, చికిత్స మధ్యలో ఆపివేసిన వారిని తిరిగి చికిత్సలోకి తీసుకురావడం, వైరల్ లోడ్ నియంత్రణను మెరుగుపరచడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. జిల్లాలో హెచ్‌ఐవీ నియంత్రణ లక్ష్యాల సాధనకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ, ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాయి.

జెడ్పీహెచ్ఎస్ నిట్టూరు విద్యార్థినులు సీనియర్ కబడ్డీకి ఎంపిక

పెద్దపల్లి, అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి)

73వ సీనియర్స్ కబడ్డీ ఛాంపియన్ షిప్ పోటీలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నిట్టూరు కు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారు. Ch. శ్రీజ, P. శిరిష్మా లు జిల్లా స్థాయిలో జరిగిన సెలక్షన్స్ లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సీనియర్స్ జట్టుకు ఎంపికయ్యారు 28 .10.2026 నుండి 30.10.2026 వీరు ఖమ్మం జిల్లా సంతుపల్లి లో జరగనున్న రాష్ట్ర స్థాయి / పోటీలలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మయ్య సర్ , CRP సుధాకర్ సర్ ,పిఈటి పిట్ట భాస్కర్ ఉపాధ్యాయ బృందం, SMDC చైర్మన్, గ్రామస్తులు విద్యార్థినులను అభినందించారు. వీరు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

మత్తు పదార్థాల విక్రయాలపై అధికారుల నిర్లక్ష్యం!

- గంజాయి మత్తులో యువత.. దాడులు, దొంగతనాలు
- యువత భవిష్యత్తును కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

ముత్తారం అక్టోబర్ 28(వుదయం ప్రతినిధి):

మండలంలో గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం, విక్రయాలను అరికట్టడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ముత్తారం టీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు పోతుపెద్ది కిషన్‌రెడ్డి ఆరోపించారు. మత్తు పదార్థాలకు యువత బానిసలై గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.బుధవారం సింగిల్ విండో మాజీ చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డితో కలిసి కిషన్‌రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని పలు గ్రామాల్లో యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి,మత్తులో ఒకరిపై ఒకరు దాడులకు దిగుతూ వీరంగం సృష్టిస్తున్నారని పేర్కొన్నారు.

గంజాయి విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయని, ఈ వ్యవహారం అధికారుల దృష్టికి వచ్చినప్పటికీ పట్టించుకోవడం లేదని విమర్శించారు.మండలంలో ఇప్పటికే పలు దొంగతనాలు చోటుచేసుకున్నాయని,ఈ విషయాన్ని పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఆశించిన స్పందన కనిపించడం లేదని వారు అన్నారు.ఇటీవల ఓ గ్రామంలో మత్తులో ఉన్న యువకులు పరస్పరం దాడులకు పాల్పడిన ఘటనతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు.ఇలాంటి పరిస్థితులు కొనసాగితే యువత భవిష్యత్తుతో పాటు గ్రామాల్లో ప్రశాంత వాతావరణం దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి గంజాయి వంటి మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగంపై నిఘా పెంచాలని కిషన్‌రెడ్డి, రాజిరెడ్డి కోరారు.యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని మత్తు పదార్థాల అక్రమ విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రూ.30 లక్షలతో రామాలయం నిర్మాణం!

- 51 అడుగుల హనుమాన్ విగ్రహ ఏర్పాటుకు జై హనుమాన్ సేవా ట్రస్ట్ సంకల్పం
- 20 ఏళ్ల పాడుపును ధర్మకార్యానికి అంకితం చేసిన చైర్మన్ చెవుల నరేష్.. భక్తుల సహకారానికి ఆహ్వానం

కల్లూరు,అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి)

రామకార్యంలో భాగస్వాములు కావాలని పిలుపు

హిందూ ధర్మ ప్రచారం, సనాతన సంప్రదాయాల పరిరక్షణే లక్ష్యంగా జై హనుమాన్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో రామాలయ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఖమ్మం నుంచి సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో, ఇల్లందు జాతీయ రహదారి పక్కన సుమారు రూ.30 లక్షల వ్యయంతో ఈ ఆలయాన్ని నిర్మిస్తున్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఆలయాన్ని తీర్చిదిద్దడంతోపాటు, ఆలయ ప్రాంగణంలో 51 అడుగుల ఎత్తైన హనుమాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనీ ట్రస్ట్ కమిటీ సంకల్పించింది.

20 ఏళ్ల పొడుపుతో రామాలయ నిర్మాణం

ఈ పవిత్ర కార

నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

- నిరవధిక సమ్మెకు బిఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతు మరియు సంఘీభావం
- మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మమతా రెడ్డి, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్

పెద్దపల్లి, (రామగుండం) అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి)

నేషనల్ హెల్త్ మిషన్ (NHM) ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధన కోసం చేపట్టిన నిరవధిక సమ్మెకు బిఆర్ఎస్ పార్టీ పూర్తి సంఘీభావం ప్రకటిస్తోందని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మమతా రెడ్డి గారు తెలిపారు. సమ్మె శిబిరాన్ని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ గారితో కలిసి డాక్టర్ మమతా రెడ్డి గారు సందర్శించి ఉద్యోగులకు తమ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మమతా రెడ్డి గారు మాట్లాడుతూ.. "కోవిడ్ కష్టకాలంలో తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజల ప్రాణాలను కాపాడిన NHM ఉద్యోగులు, నేడు తమ భవిష్యత్తు కోసం మరియు ఉద్యోగ భద్రత కోసం రోడ్డెక్కి పోరాడాల్సి రావడం అత్యంత విచారకరం. 'కోవిడ్ సమయంలో ప్రజల ప్రాణాలు కాపాడిన మేము... నేడు మా భవిష్యత్తు కోసం పోరాడుతున్నాం' అని వారు ఆవేదన వ్యక్తం చేయడం ప్రభుత్వానికి కంటికి కనిపించడం లేదా? ఐక్యతే మూలం – హక్కుల సాధనే లక్ష్యంగా పోరాడుతున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను మరియు ఉద్యోగ భద్రతను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలి." ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, NHM JAC ప్రతినిధులు, ఆరోగ్య శాఖ ఉద్యోగులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థుల ఉద్యోగ కలకు ఊపిరి టిఆర్పీ సుమార్ట్

- పార్టీ అనుచరులతో కలిసి విద్యార్థులకు ఐడీ కార్డుల పంపిణీ
- చదువుకు పేదరికం అడ్డుకాకూడదు, యువత భవిష్యత్తే మా లక్ష్యం
- టిఆర్పీ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా

కరీంనగర్ అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి):

కరీంనగర్ జిల్లా కేంద్రంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత కోసం ప్రారంభించిన టిఆర్పీ సుమార్ట్ SI, PC, FBO ఉచిత కోచింగ్ కార్యక్రమంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు బుధవారం పార్టీ నాయకులతో కలిసి రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా ఐడెంటిటి కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అఖిల్ పాషా విద్యార్థులతో మాట్లాడి వారి శిక్షణ వివరాలను తెలుసుకున్నారు. ఉచిత కోచింగ్ అనే గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్న విద్యార్థులందరు క్రమశిక్షణతో చదివి ఉద్యోగులు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ మరియు వారి అధినేత తీన్మార్ మల్లన్న ముఖ్య ఉద్దేశ్యం అని ఉచిత విద్యా వైద్యం సత్వర న్యాయమని అన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ప్రతిభ ఉన్న పేద విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం సరైన కోచింగ్ పొందలేక తమ లక్ష్యాలకు దూరమవుతున్నారని అఖిల్ పాషా పేర్కొన్నారు. అలాంటి విద్యార్థులకు అండగా నిలవాలనే ఉద్దేశంతోనే టిఆర్పీ సుమార్ట్ ద్వారా ఉచిత కోచింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఐడీ కార్డుల పంపిణీతో విద్యార్థుల్లో బాధ్యత, క్రమశిక్షణ మరింత పెరగాలని ఆకాంక్షించారు. ఒక విద్యార్థి ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తే ఆ విద్యార్థి కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపడటమే కాకుండా కుటుంబానికి భరోసా కలుగుతుందని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి నిరుద్యోగ యువతకు విద్య, ఉద్యోగ అవకాశాల విషయంలో తన వంతు సహకారం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా నేను చదువులో ఎదుర్కొన్న కష్టాలు నాకు తెలుసు. అలాంటి పరిస్థితులు మరే విద్యార్థికీ ఎదురు కాకూడదనే ఉద్దేశంతోనే నా వంతు సహాయంగా ఈ ఉచిత కోచింగ్ కార్యక్రమాన్ని చేపట్టాను. పేద విద్యార్థులు కోచింగ్ ఫీజులు చెల్లించలేక తమ లక్ష్యాలను వదులుకోకూడదు. ప్రతిభ, పట్టుదల ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఉద్యోగం సాధించే అవకాశం ఉండాలి అని అఖిల్ పాషా అన్నారు. మీ ఆర్థిక పరిస్థితి మీ భవిష్యత్తును నిర్ణయించదని, మీ పట్టుదల కష్టమే మీ విజయానికి పునాది అని అంటూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని నిరంతరం శ్రమిస్తే విజయం సాధించడం సాధ్యమేనని విద్యార్థులకు అఖిల్ పాషా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సార్ ఐఏఎస్ అకాడమిక్ డైరెక్టర్ కరీమ్ రాజు, టిఆర్పీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, మహిళా అధ్యక్షురాలు రాచురి అరుణ దేవి, రాష్ట్ర యువజన విభాగ సాయక కార్యదర్శి మహబూబ్ అలీ, జిల్లా మైనారిటీ అధ్యక్షులు మొహమ్మద్ వాజిద్, వర్కింగ్ ప్రెసిడెంట్ అర్షత్ బిన్ అలీ, జిల్లా ప్రధాన కార్యదర్శి చిగుర్ల మోహన్, నాయకులు ఎగుర్ల రమేష్, అనిల్, వెంకట్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

1064 టోల్ ఫ్రీ నెంబర్ తో అవినీతికి అడ్డుకట్ట

- అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు
- అక్రమాల నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలి
- అవినీతి నిరోధక వారోత్సవాలు సందర్భంగా ప్రతిజ్ఞ చేయించిన అదనపు కలెక్టర్

పెద్దపల్లి, అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి)

1064 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి ఫిర్యాదు చేయడం ద్వారా ప్రభుత్వ కార్యాలయాలు అవినీతికి అడ్డుకట్ట వేయవచ్చని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని ఆవరణలో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు అవినీతి నిరోధక వారోత్సవాలను పురస్కరించుకొని జిల్లా అధికారులు తహసిల్దారులు సిబ్బందిచే అవినీతి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి శ్రీరాములు మాట్లాడుతూ, ఉద్యోగులు, అధికారులు తమ విధి నిర్వహణలో జాగ్రత్తగా ఉంటూ బాధ్యతతో వ్యవహరించాలని అన్నారు. మనమంతా నిబద్ధతతో పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని సూచించారు. అవినీతి అక్రమాల నిర్మూలనలో అందరూ భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వ కార్యాలయంలో ప్రజలను ఎవరైనా లంచం ఇవ్వమని వేధిస్తే 1064 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, ప్రభుత్వ అధికారులతో పని చేయించుకోవడం ప్రజల హక్కు, ఆ హక్కును లంచం తో కొనవద్దని, ఎట్టి పరిస్థితుల్లో ఎవరికి ఏ పని కోసం ఒక రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదని అదనపు కలెక్టర్ ప్రజలకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ సిబ్బంది, జిల్లా అధికారులు తహసిల్దారులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఖేలో ఇండియా క్యాంప్‌కు కేపీఎస్ విద్యార్థిని అల్లె హేమ ఎంపిక

కొరుట్ల పబ్లిక్ స్కూల్‌కు గర్వకారణం

కొరుట్ల అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి)

కొరుట్ల పబ్లిక్ స్కూల్ విద్యార్థిని అల్లె హేమ జాతీయ స్థాయి ఖేలో ఇండియా ఛాంపియన్ షిప్ క్యాంప్‌కు ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది హైదరాబాద్ లోని సరూర్‌నగర్‌లో 45 రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ స్థాయి శిక్షణ శిబిరానికి హేమ ఎంపికైంది అనంతరం డిసెంబర్ నెలలో వరంగల్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి ఖేలో ఇండియా క్రీడల్లో పాల్గొనేందుకు ఆమెకు అవకాశం లభించనుంది విద్యతో పాటు క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ కొరుట్ల పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరుస్తూ సర్వతోముఖ అభివృద్ధి సాధిస్తున్నారని పాఠశాల యాజమాన్యం పేర్కొంది జిల్లా రాష్ట్ర స్థాయిలను దాటి జాతీయ స్థాయికి చేరుకున్న హేమ సాధించిన ఈ విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తినిస్తుందని తెలిపారు ఈ సందర్భంగా అల్లె హేమను పాఠశాల కరెస్పాండెంట్ గుజ్జేటి వెంకటేష్ ఉపాధ్యాయులు హేమ హేమ పేరెంట్స్ ను అభినందించారు జాతీయ స్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు తెలంగాణ రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

చామనపల్లి గ్రామంలో ఆర్‌అండ్‌ఆర్ సర్వే పక్కాగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు
- నంది మేడారం రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి నిల్వకు అనుగుణంగా చామనపల్లి గ్రామం మొత్తానికి భూసేకరణ
- ప్రతి ఇంటికి ప్రాజెక్టు నంబర్ కేటాయించి, అర్హులకు చట్ట ప్రకారం పరిహారం అందేలా చర్యలు

పెద్దపల్లి, (ధర్మారం) అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి)

చామనపల్లి గ్రామంలో ఆర్ & ఆర్ సర్వే పక్కాగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు అన్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం చామనపల్లి గ్రామంలో జరుగుతున్న ఆర్ అండ్ ఆర్ (పునరావాసం, పునరుద్ధరణ) సర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి శ్రీరాములు మాట్లాడుతూ, నంది మేడారం రిజర్వాయర్‌లో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేసే క్రమంలో చామనపల్లి గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, నిబంధనల్లో సడలింపులు కల్పిస్తూ గ్రామం మొత్తాన్ని భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ కాలనీ పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు గ్రామంలోని ప్రతి ఇంటిని క్షేత్రస్థాయిలో సమగ్రంగా సర్వే చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఇంటికి ఒక ప్రత్యేక ప్రాజెక్టు నంబర్ కేటాయించి, ఇంటిలోని కుటుంబ సభ్యుల వివరాలతో పాటు చెట్లు, మోటార్లు, ఇతర పరికరాలు తదితర ఆస్తుల వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. సేకరించిన వివరాల ఆధారంగా చట్ట ప్రకారం అర్హులైన వారికి ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సర్వే ప్రక్రియను నిబంధనల మేరకు పారదర్శకంగా, పక్కాగా నిర్వహిస్తున్నామని తెలిపారు. సర్వే బృందాలకు గ్రామ ప్రజలు తమ పూర్తి వివరాలను అందించి, సర్వే ప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకు సంపూర్ణ సహకారం అందించాలని అదనపు కలెక్టర్ కోరారు. ఈ పర్యటనలో అదనప కలెక్టర్ వెంట పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి గంగయ్య, ధర్మారం తహసిల్దార్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

వృథా పోతున్న కాళేశ్వరం జలాలను ఎత్తిపోసి ఎండిపోతున్న పంటలను కాపాడాలి

డాక్టర్ దాసరి మమతా రెడ్డి

పెద్దపల్లి, అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి

కాళేశ్వరం జలాలను వినియోగించి ఎండిపోతున్న పంటలను తక్షణమే కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసన సైకిల్ యాత్రకు పెద్దపల్లి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దాసరి మమతా రెడ్డి సంఘీభావం తెలిపారు. పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్ కుమార్, రామగుండానికి చెందిన బొడ్డు రవీందర్ ఆధ్వర్యంలో మేడిగడ్డ నుండి ప్రారంభమైన ఈ యాత్రను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ప్రెస్ నోట్ ముఖ్యాంశాలు:

కాళేశ్వరం నీటిని విడుదల చేయాలి: కన్నెపల్లి పంప్‌హౌస్‌లో సుమారు 2 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. ప్రభుత్వం నీటి లభ్యతపై స్పష్టతనిచ్చి, వెంటనే సాగునీటిని విడుదల చేసి పంటలను కాపాడాలి. కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారి దూరదృష్టి: కేసీఆర్ గారి దూరదృష్టితో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ వ్యవసాయ రంగానికి వరప్రదాయిని. ప్రాజెక్టు నిర్వహణలో రాజకీయాలు పక్కనబెట్టి రైతుల ప్రయోజనాలకే ప్రాధాన్యమివ్వాలి. రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉండాలి: పంటలు ఎండిపోతున్నవేళ రైతులకు ఉచిత విద్యుత్, సాగునీరు అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత. ధాన్యం కొనుగోలు, రైతుబంధు, బోనస్ హామీలను తక్షణమే అమలు చేయాలి. సెల్ఫ్ డిక్లరేషన్ నిబంధనలు ఉపసంహరించాలి: నీటి విడుదల విషయంలో 'సెల్ఫ్ డిక్లరేషన్' పేరుతో బాధ్యతల నుండి తప్పుకోకుండా క్షేత్ర స్థాయిలో పంటల పరిస్థితిని పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలి. ప్రభుత్వానికి కనువిప్పు కలిగించేందుకే యాత్ర: కాళేశ్వరం పరివాహక ప్రాంతాల్లో ప్రతిరోజూ 40 కిలోమీటర్లు సైకిల్‌పై ప్రయాణిస్తూ రైతుల ఆవేదనను ప్రభుత్వానికి తెలియజేస్తున్న నాయకుల కృషి అభినందనీయం.

రైతుల తరపున పోరాటం ఆగదు: "రైతు ఏడ్చిన వ్యవసాయం, రాజ్యం ఎన్నటికీ బాగుపడదు". రైతులకు న్యాయం జరిగేంత వరకు బీఆర్ఎస్ పార్టీ తరపున పోరాటం కొనసాగిస్తాం. ఈ సైకిల్ యాత్ర మరియు కార్యక్రమంలో పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్ కుమార్, కాశీపాక వాసు, సురేష్, పల్లె మధులతో పాటు కౌన్సిలర్ విన్నం సుజాత రవీందర్, మాజీ కౌన్సిలర్ నాంసాని సురేష్ బాబు మరియు బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

పెద్దపల్లిలో బీఆర్ఎస్‌కు షాక్.. కాంగ్రెస్‌లోకి పలువురు నేతలు

అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యం: ప్రభుత్వ విప్ విజయరమణారావు

పెద్దపల్లి, అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి)

అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు. బుధవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి విజయరమణారావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లోకి..

సబ్బితం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చుంచు సదయ్య, మాజీ ఉపసర్పంచ్‌లు మదాసి శ్రీనివాస్, చుంచు చిన్న పెద్దులు, వార్డు సభ్యులు పులిపాక మనోజ రాజయ్య, ఇండ్ల నాగతేజశ్విని, గుమ్మడి రాజేంద్ర ప్రసాద్, ఆకుల సతీష్‌కుమార్, మాజీ వార్డు సభ్యుడు చెప్పాల రాజేశం, కాపు సంఘం అధ్యక్షుడు పేరుక పోచాలు, చుంచు సారయ్య, చుంచు సంపత్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు గ్రామాభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేయాలని విజయరమణారావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సబ్బితం, రంగాపూర్ సర్పంచ్‌లు నూనె సరోజన రమేష్, గంట రమేష్, పలువురు సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, సింగిల్ విండో చైర్మన్ ముత్యాల నరేష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజకీయాలు కాదు ముఖ్యం రైతుల గోస పట్టించుకోండి

- కాళేశ్వరం నీటిని వినియోగించి రైతులను ఆదుకోవాలి
- కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు తెరవాలి.. 400 కి.మీ. సైకిల్ యాత్రతోనైనా స్పందించాలి: మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

మంథని అక్టోబర్ 28 వుదయం ప్రతినిధి





మంథని నియోజక వర్గం కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీలో నీళ్లు ఉన్నప్పటికీ వాటిని రైతులకు, ప్రజలకు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించి, అక్కడి పరిస్థితులను మాజీ సీఎం కేసీఆర్‌కు వివరించాలనే లక్ష్యంతో బొడ్డు రవీందర్, ఉప్పు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన 400 కిలోమీటర్ల మహా సైకిల్ యాత్రను రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, పెద్దపల్లి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పుట్ట మధూకర్ మాట్లాడుతూ.. మేడిగడ్డ నుంచి కొండపోచమ్మసాగర్ వరకు కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శిస్తూ ఎనిమిది మంది యువకులు చేపట్టిన సైకిల్ యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. మేడిగడ్డ వద్ద ఉన్న నీటిని వినియోగించి రైతులకు సాగునీరు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణలో కరువు పరిస్థితులు రాకుండా ఉండాలనే లక్ష్యంతో కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని పేర్కొన్నారు. గోదావరి నీరు వృథాగా సముద్రంలో కలుస్తున్నా, నదీ తీర ప్రాంతాల రైతులకు సాగునీరు అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో మంథని ఎమ్మెల్యే, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చొరవ తీసుకోవాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలని, ముఖ్యమంత్రి, మంత్రులు స్పందించి నీటిని సద్వినియోగం చేయాలని డిమాండ్ చేశారు.

నీటి దిశ మార్చి తెలంగాణ దశ మార్చిన కేసీఆర్: కోరుకంటి చందర్

రామగుండం: గోదావరి జలాలను సద్వినియోగం చేసి తెలంగాణలో సాగునీటి విస్తీర్ణాన్ని పెంచాలనే లక్ష్యంతో కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. ప్రాజెక్టును రాజకీయ కారణాలతో పక్కనపెట్టి, నీటిని ఎత్తిపోసే చర్యలు చేపట్టకపోవడం వల్ల రైతులకు నష్టం జరుగుతోందని ఆయన ఆరోపించారు. కన్నెపల్లి పంపుహౌస్‌ను ప్రారంభించి నీటిని ఎత్తిపోసేలా పలుమార్లు ప్రభుత్వాన్ని కోరినా స్పందన లేదని తెలిపారు. 2025 మార్చిలో 'తెలంగాణ కన్నీటి గోస' పేరుతో 180 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టి పంపుహౌస్‌ను ప్రారంభించాలని కోరిన విషయాన్ని గుర్తుచేశారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో మరోసారి ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు రామగుండం, మంథనికి చెందిన యువకులు సైకిల్ యాత్ర చేపట్టారని పేర్కొన్నారు.

ధర్మపురి లక్ష్మీనర్సింహ స్వామి హుండీ లెక్కింపు..

రూ. 59లక్షల97వేల771 ఆదాయం

ధర్మపురి,అక్టోబర్ 28(వు దయం ప్రతినిధి):

ధర్మపురి క్షేత్రంలోని ప్రసిద్ధ శ్రీ లక్ష్మీ నర్సింహ స్వామి వారి దేవస్థానంలో బుధవారం నిర్వ హించిన హుండీల లెక్కింపులో భారీగా ఆదాయం సమకూరిం ది. 2026 జూన్ 23 నుండి అక్టోబర్ 28 వరకు గల 127 రోజుల కాలానికి సంబంధించి హుండీలను లెక్కించగా మొత్తం రూ. 59లక్షల97వేల771 నగ దు ఆదాయం వచ్చినట్లు ఆల య అధికారులు వెల్ల డించారు.నగదుతో పాటు భక్తులు సమర్పించిన కానుకల్లో 42 గ్రాముల బంగారం,3 కిలోల 400 గ్రాముల వెండి తో పాటు 40 విదేశీ నోట్లు లభించినట్లు తెలిపారు.ఈ కార్యక్ర మంలో కరీంనగర్ దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ నాయిని సుప్రియ, దేవస్థాన ఈఓ ఎస్.శ్రీనివాస్, ఉప ప్రధాన అర్చకులు నేరళ్ల శ్రీనివాసాచార్యులు, సూపరింటెండెంట్ ఎ.శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ వి.తిరుపతి,మాజీ ధర్మకర్త గునిశెట్టి రవీందర్,తిరుమల సేవా గ్రూప్ ఇంచార్జ్ రవీం దర్,వివిధ సేవా గ్రూప్‌ల ప్రతి నిధులు,యూనియన్ బ్యాంక్ మేనేజర్,పోలీస్ సిబ్బందిఅర్చకులు,భక్తులు పాల్గొన్నారు.

పారుపల్లిలో ఘనంగా క్రికెట్ టోర్నమెంట్ ముగింపు

విజేతగా మంథని జట్టు.. రన్నరప్‌గా పారుపల్లి

ముత్తారం అక్టోబర్ 28(వుదయం ప్రతినిధి):

ముత్తారం మండలం పారుపల్లి గ్రామంలో 30 జట్లతో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది. ఫైనల్‌లో పారుపల్లి, మంథని జట్లు హోరాహోరీగా తలపడగా.. మంథని జట్టు విజయం సాధించి విజేతగా నిలిచింది. పారుపల్లి జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేత మంథని జట్టుకు బియ్యని శ్రీవల్లి ఐశ్వర్య రూ.20 వేల నగదుతో పాటు కప్‌ను అందజేశారు. రన్నరప్ పారుపల్లి జట్టుకు సర్పంచ్ చొప్పరి సంపత్ బహుమతిని అందించారు.ఈ సందర్భంగా సర్పంచ్ చొప్పరి సంపత్ మాట్లాడుతూ..యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి టోర్నమెంట్లు దోహదపడతాయని అన్నారు. టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులు చొప్పరి సాయికుమార్,బోడ పవన్, ఏడవేనా కౌశిక్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బోడ శ్యామల బాపు,జిల్లా సెక్రటరీ అంబటి చంద్రమోహిలి, సీనియర్ నాయకులు పీక శంకర్, మినుగు రాజు,యూత్ అధ్యక్షులు శ్రీకాంత్,రమేష్, సమ్మయ్య పాల్గొన్నారు.

నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా పోస్టర్ ఆవిష్కరణ

పెద్దపల్లి, అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి)

నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ఈరోజు పెద్దపల్లిలో మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచార పోస్టర్‌ను తెలంగాణ ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తెలంగాణ ప్రభుత్వ విప్ విజయరమణ రావు, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ హర్ష ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా ప్రోత్సహించడం, ఆరోగ్య కరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయడం వంటి అంశాల ప్రాధాన్యతను వివరించారు.

ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఎర్రబాటి వెంకటేశ్వర్ రావు, వైస్ చైర్మన్ సాదుల వెంకటేశ్వర్లు, స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు కావేటి రాజగోపాల్, జిల్లా కోశాధికారి పాంపాటి శ్రీకాంత్, నిమ్మనపల్లి సర్పంచ్ వేల్పుల రమేష్, పెద్దపల్లి పబ్లిక్ ప్రాసిక్యూటర్ దీవీఎస్ మూర్తి, సంపత్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు. "మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి – ఆరోగ్యకరమైన జీవితాన్ని ఎంచుకోండి. యువతను కాపాడుకుందాం, సమాజాన్ని మత్తు రహితంగా తీర్చిదిద్దుదాం" అనే సందేశంతో నషా ముక్త్ భారత్ అభియాన్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

రక్తదానం చేయండి ప్రాణాలను కాపాడండి

- జిల్లా సుపరేండెంట్ అఫ్ పోలీస్ అశోక్ కుమార్
- రక్తదానం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి
- పోలీస్ అమరవీరుల సంస్మరణ లో భాగంగా రక్తదాన శిబిరం

జగిత్యాల అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి)

పోలీస్ అమరవీరుల సంస్మరణ లో భాగంగా పోలీసు అమరవీరుల త్యాగలను స్మరిస్తూ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ లో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది బ్లడ్ డొనేషన్ క్యాంప్ కు ముఖ్యఅతిథిగా జిల్లా సుపరేండెంట్ అఫ్ పోలీస్ అశోక్ కుమార్ హాజరయ్యారు ఈ సందర్భంగా వివిధ సర్కిళ్ల సిఐ లు ఎస్ఐ పోలీస్ సిబ్బంది యువత స్వచ్ఛంద రక్తదానం చేశారు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల సంస్మరణలో భాగంగా ప్రతీ సంవత్సరం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో

భూభారతి పెండింగ్ దరఖాస్తులు, రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి

- రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్ లోకేష్ కుమార్
- మండలానికి రెండు సర్వే బృందాల కేటాయింపు, వేగంగా రీ-సర్వే పూర్తికి ఆదేశం
- జీఓ 59, 76 పెండింగ్ అంశాలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి
- హైకోర్టు కేసుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచన
- రెవిన్యూ అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రెవిన్యూ శాఖ కార్యదర్శి

పెద్దపల్లి, అక్టోబర్, 28 (వుదయం ప్రతినిధి)

భూభారతి దరఖాస్తులు, రీ-సర్వే వివిధ జీఓలకు సంబంధించిన పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్ లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు.

బుధవారం భూభారతి పెండింగ్ అంశాలు, హైకోర్టు కేసులు, రీ-సర్వే ప్రోగ్రామ్, జీఓ 59, జీఓ 76 పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై హైదరాబాద్ నుంచి రెవిన్యూ శాఖ కార్యదర్శి డీ.ఎస్ లోకేష్ కుమార్ అన్ని జిల్లాల రెవిన్యూ అదనపు కలెక్టర్లతో ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు సంబంధిత అధికారులతో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెవిన్యూ శాఖ కార్యదర్శి డి. ఎస్ లోకేష్ కుమార్ మాట్లాడుతూ, భూభారతికి సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. హైకోర్టు పరిధిలో ఉన్న భూ సంబంధిత కేసుల పరిష్కార ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

రీ-సర్వే ప్రోగ్రామ్‌ను వేగవంతం చేసేందుకు గాను ప్రతి మండలానికి రెండు సర్వే బృందాలను కేటాయించాలని, నిర్దేశిత ప్రణాళిక ప్రకారం రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జీఓ 59, జీఓ 76లకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులు, అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో జీఓ 59, జీఓ 76 కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఒక నిర్దిష్ట కాలమితిలో సమగ్రంగా పరిశీలించి పరిష్కరించాలని స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ,కలెక్టరేట్ పరిపాలనాధికారి బి ప్రకాష్, సెక్షన్ పర్యవేక్షకులు ధీరజ్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలి

కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్ నగర్, వుదయం ప్రతినిధి

మహబూబ్‌నగర్ జిల్లాలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో భాగంగా నిర్వహించనున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, అవసరమైన ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. డిసెంబర్ 11 నుంచి 21 వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లాలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు జరగనున్న నేపథ్యంలో బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దేశంలోని 16 రాష్ట్రాలకు చెందిన కబడ్డీ జట్లు ఈ పోటీల్లో పాల్గొననున్నాయని, సుమారు 300 మంది క్రీడాకారులు జిల్లాకు రానున్నారని తెలిపారు. జాతీయ స్థాయి క్రీడా పోటీల నిర్వహణ జిల్లాకు గర్వకారణమని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోటీలను అత్యుత్తమ ప్రమాణాలతో నిర్వహించాలని సూచించారు. క్రీడాకారులకు అవసరమైన వసతి, భోజనం, రవాణా, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, మరుగుదొడ్లు, వైద్య సేవలు తదితర సౌకర్యాలను ముందుగానే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. క్రీడా ప్రాంగణం, ఇండోర్ స్టేడియం సహా పోటీల నిర్వహణకు గుర్తించిన వేదికలను పరిశీలించి, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ప్రతి వసతి కేంద్రానికి ఒక సమన్వయ అధికారిని, అవసరమైన చోట సీనియర్ అధికారిని నియమించి, ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. వివిధ శాఖలకు అప్పగించిన బాధ్యతలు, చేపట్టాల్సిన పనులు, వాటి అంచనాలు, పూర్తి చేయాల్సిన గడువులను స్పష్టంగా నిర్ధారించాలని తెలిపారు. సంబంధిత అధికారులు వసతి కేంద్రాలు, క్రీడా వేదికలను ముందుగానే సందర్శించి, అవసరమైన ఏర్పాట్లపై సమగ్ర నివేదిక సమర్పించాలని సూచించారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను జిల్లాలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించి, జాతీయ స్థాయిలో మహబూబ్‌నగర్ జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలని కలెక్టర్ అధికారులకు పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో జిల్లా ఎస్.పి డి. జానకి, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, జిల్లా అటవీ అధికారి ఎం. నవీన్ రెడ్డి, జిల్లా క్రీడలు, పర్యాటక శాఖ అధికారి జె. రాజశేఖర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మల్యాల మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించండి : బీజేపీ

మల్యాల మండలం అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి)

ఈరోజు తెలంగాణలో 365 కరువు మండలాలుగా ప్రకటించడంలో రాష్ట్ర ప్రభుత్వం మల్యాల మండలానికి ప్రకటించకపోవడం ఇది బాధాకరం. సాధారణ వర్షపాతం కంటే చొప్పదండి నియోజకవర్గం లో దాదాపు 35% తక్కువ వర్షపాతం నమోదయింది అలాంటిది నియోజకవర్గంలోని మల్యాల మండలం కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ మల్యాల ఎక్స్ రోడ్డు వద్ద భారతీయ జనతా పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ బింగి వేణు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు బింగి వేణు మాట్లాడుతూ..ధర్నాకి రాకుండా బీజేపీ మల్యాల మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం ని అరెస్టు చేయడం అన్యాయం అని , రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఎట్టి పరిస్థితుల్లోనూ ధర్నా చేయాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందని , అందులో భాగంగా మండలంలో ఖరీఫ్ కి సంబంధించిన ధాన్యం దాదాపుగా 2 లక్షల క్వింటాళ్లు రావాల్సి ఉండగా వర్షాభావ పరిస్థితుల వల్ల సాగునీరు లేకపోవడం వల్ల దాదాపుగా సగానికి సగం దిగుబడి రాక రైతులు నష్టపోయే అవకాశం ఉంది కావున ఈ తెలంగాణ ప్రభుత్వం మల్యాల మండలాన్ని కూడా పూర్తి కరువు మండలంగా ప్రకటించినట్లయితే ఎన్ డి ఆర్ ఎఫ్ నిధులను మల్యాల మండల రైతులకి కూడా అందించే అవకాశం ఉంటుంది.అలాగే రాష్ట్ర ప్రభుత్వం కూడా అన్ని కరువు మండలాలకు ప్రత్యేక నిధులను కరువు బత్యం కింద రైతులకు అందించాలని వ్యవసాయ రుణాలను రీ షెడ్యూల్ చేస్తా అన్న ప్రభుత్వాన్ని బదులుగా పూర్తిగా రుణమాఫీ చేయాలని భారతీయ జనతా పార్టీ తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నిరసనలను ధర్నాలను భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు చేయకుండా అంచి వేయాలని చూస్తే ఎక్కడికక్కడ ఆందోళనలు తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పిల్లి రాజశేఖర్ , ఎస్సీ మోర్చా , బీజేవైఎం అధ్యక్షుడు పొనగంటి గౌతం,అధ్యక్షుడు సుంకపాక టైటస్,గుండెటి గంగారం, బండారి రాజు, చిన్న మల్లేశం, జనగాం రాములు, నులుగొండ సురేశ్ , పర్సారములు, సాయి, నీలం రవి, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి

మంత్రి వివేక్ వెంకటస్వామి ని వినతిపత్రాన్ని అందజేసిన జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి)

కోరుట్ల నియోజకవర్గ పరిధిలోని కోరుట్ల మండలం అయిలాపూర్ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణం రానున్న గోదావరి పుష్కరాల కోసం మరిన్ని నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ మంత్రి జి వివేక్ వెంకటస్వామి ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు మర్యాదపూర్వకంగా కలిసి కోరారు బుధవారం రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో మంత్రిని కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేయడంతో పాటు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలనీ కోరగా మంత్రి సానుకూలంగా స్పందించి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి పాఠశాల విద్యా శాఖ సంచాలకులు నవీన్ నికోలస్ ఇతర ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు జువ్వడి కృష్ణారావు విలేకరులకు తెలియజేశారు ఈసందర్భంగా మంత్రి కి కృష్ణారావు కృతజ్ఞతలు తెలిపారు.

పోలీస్, ఇతర శాఖల సమన్వయంతో డ్రగ్స్ నివారణపై పకడ్బందీ చర్యలు

- యువత, విద్యార్థుల ప్రవర్తనను నిరంతరం పర్యవేక్షించాలి
- మత్తు పదార్థాల దుష్పరిణామాలపై విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు
- కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి):

నషా ముక్త్ భారత్ కోసం అందరం కృషి చేద్దామని జీవితాలను చిన్నాభిన్నం చేసే పొగాకు, గుట్కా తదితర మత్తు పదార్థాల అలవాట్లకు ప్రతి ఒక్కరూ దూరం ఉండాలని కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు.ఉస్మానియా యూనివర్సిటీలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ, ఓయూ ఎన్ఎస్ఎస్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన నషాముక్త్ భారత్, నషాముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్-2047 అవగాహన కార్యక్రమానికి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ కార్యక్రమాన్ని అన్ని జిల్లాల్లో వర్చువల్ గా వీక్షించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన వర్చువల్ కార్యక్రమానికి ఎస్ఆర్ఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది హాజరయ్యారు.వర్చువల్ కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత జీవితంతోపాటు కుటుంబానికి, సమాజానికి నష్టం కలిగిస్తుందన్నారు.

మాదకద్రవ్య రహిత సమాజ స్థాపన కోసం ప్రతి పౌరుడు బాధ్యతతో డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాల (డ్రగ్స్) నియంత్రణకు పోలీస్, చైల్డ్ వెల్ఫేర్, విద్యా శాఖ, తదితర శాఖల సమన్వయంతో పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. విద్యార్థులు యువత చాక్లెట్లు, ఇతర తినుబండారాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తప్పనిసరిగా వాటి కవర్లు, ప్యాకెట్లపై ఉన్న అంశాలు చదవాలన్నారు. మత్తు పదార్థాల వినియోగం తో కలిగే దుష్పరిణామాలను తప్పనిసరిగా విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డ్రగ్స్ సరదా కోసం మొదలై.. తరువాత అలవాటుగా మారి జీవితాలను అంధకారంలోకి తీసుకెళ్తుందన్నారు.అనంతరం కలెక్టర్ వివిధ శాఖల అధికారులు, ఇండియన్ రెడ్ క్రాస్ సభ్యులు, విద్యార్థులతో నషా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ శాఖ చైర్మన్ సంగేం లక్ష్మణరావు, మేనేజింగ్ కమిటీ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో 'నషాముక్త్ భారత్' (మాదకద్రవ్య రహిత భారతదేశం) అవగాహన ర్యాలీ

గీతా భవన్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ , ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, డీఎంహెచ్వో రాజ్ గోపాల్ రావు, వివిధ కళాశాలల విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, ఉద్యోగ సంఘాల నాయకులు, రెడ్ క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పంటలు ఎండుతున్నా పట్టించుకోరా? పెద్దపల్లిని కరువు జిల్లాగా ప్రకటించాలి!

- నీళ్లు, కరెంటు లేక ఎండుతున్న పంటలు.. రైతులను ఆదుకోవాలి
- ఎండిన వరి పొలాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

మంథని అక్టోబర్ 28 వుదయం ప్రతినిధి

నీళ్లు, విద్యుత్ కొరతతో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, పెద్దపల్లి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి బాధిత రైతులకు పరిహారం అందించాలని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ డిమాండ్ చేశారు.

బుధవారం మంథని మండలం మైదుపల్లి శివారులో ఎండిపోయిన వరి పొలాన్ని పరిశీలించిన ఆయన, రైతుల సమస్యలపై మీడియాతో మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాలను కరువు జిల్లాలుగా ప్రకటించిన ప్రభుత్వం పెద్దపల్లి జిల్లాను ఎందుకు మినహాయించిందో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమాధానం చెప్పాలని కోరారు.

కరెంటు, సాగునీరు సక్రమంగా అందక పంటలు ఎండిపోతున్నాయని, రైతుల ఆవేదనను ప్రభుత్వం గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. కరువు జిల్లాగా ప్రకటించి ఉంటే పంట నష్టపోయిన రైతులకు ఎంతో కొంత పరిహారం అందేదని పేర్కొన్నారు. రైతుల నష్టాలను గుర్తించకుండా కరువు పరిస్థితులను ఎలా అంచనా వేశారని ప్రశ్నించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ వ్యవసాయ రంగానికి ప్రాధాన్యమిస్తూ రైతులకు నిరంతర విద్యుత్, సాగునీరు అందించారని పుట్ట మధూకర్ అన్నారు. గత పదేళ్లలో ఒక్క గుంట భూమి ఎండిపోయినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ చేశారు. రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. రైతులకు న్యాయం జరిగేలా పెద్దపల్లి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి, పంట నష్టపోయిన ప్రతి రైతును ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు

కరువు మండలాల్లో కథలాపూర్ లేకపోవడం అన్యాయం

రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టిన బిజెపి నేతలు

కోరుట్ల అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి)

భారతీయ జనతా పార్టీ కథలాపూర్ మండల అధ్యక్షులు మల్యాల మారుతి ఆధ్వర్యంలో మహా ధర్నా కార్యక్రమం చేపట్టి రోడ్డుపైన బైఠాయించారు ఈ సందర్భంగా బీజేపి నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం నిన్న ప్రకటించిన కరువు మండలాల జాబితాలో కథలాపూర్ మండలానికి చోటు కల్పించకపోవడం తీవ్ర నిరాశకు గురించేసింది. వర్షభావ పరిస్థితులతో ఇబ్బంది పడుతున్న రైతులకు ప్రభుత్వం అండగా నిలవాల్సిందిపోయి కరువు మండలాల జాబితాలో కథలాపూర్ మండలాన్ని విస్మరించడం అన్యాయం అన్నారు కథలాపూర్ మండలాన్ని కరువు మండలాల జాబితాలో వెంటనే చేర్చాలని అలాగే అర్హులైన రైతులకు సహాయక చర్యలు అందించాలni రైతులకు న్యాయం జరగలేని పక్షంలో బీజేపి ఈ పోరాటాన్ని ఉధృతం చేస్తుందని నాయకులు హేచ్చరించారు ఈ కార్యక్రమం లో భారతీయ జనతా పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

దరఖాస్తులు స్వీకరణ

మహబూబ్ నగర్, వుదయం ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందిన ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ గారి ఆదేశానుసారం తో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి, మహబూబ్‌నగర్ వారు జిల్లా పరిధిలోని ఖాళీగా ఉన్న ఉద్యోగాలు కాంట్రాక్టు పద్ధతిలో 45 పోస్ట్ లకు మార్చి-2027 వరకు నింపుటకు అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించబడింది వారి జాబితాను NIC Website పొందుపరుస్తున్నాము ఈ జాబితా నందు ఎలాంటి అభ్యంతరాలు వున్నచో తేదీ 29.10.2026 to 31.10.2026 వరకు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి, కార్యాలయము మహబూబ్‌నగర్ నందు సమర్పించవలెను. ఈ నోటిఫికేషన్ జాబితాను కు సంబంధించిన సమాచారం పూర్తి వివరాలకు ఈ www.mahabubnagar.telangana.gov.in వెబ్ సైట్ నందు పొందుపర్చనైనది చూచుకొనగలరు.

పేదలకు వరంగా అరుదైన వైద్య సేవలు

- పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన ఘనత.. ఇద్దరు రోగులకు విజయవంతంగా మోకీలు మార్పిడి శస్త్రచికిత్సలు
- ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య సేవలు

పెద్దపల్లి, అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి)

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి మరో అరుదైన ఘనతను సాధించింది. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ పర్యవేక్షణలో ఇద్దరు రోగులకు అత్యాధునిక టోటల్ నీ రీప్లేస్‌మెంట్ (Total Knee Replacement) శస్త్రచికిత్సలను వైద్యుల బృందం విజయవంతంగా నిర్వహించింది. తీవ్రమైన మోకాళ్ల నొప్పులతో నడవడానికి ఇబ్బందులు పడుతున్న ఇద్దరు రోగులకు ప్రభుత్వ ఆసుపత్రిలోని అత్యాధునిక ఆపరేషన్ థియేటర్‌లో ఈ శస్త్రచికిత్సలను నిర్వహించారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో అధిక వ్యయంతో కూడుకున్న ఈ చికిత్సను ప్రభుత్వ ఆసుపత్రిలో కూడా అందించడం పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా మారింది. ఈ శస్త్రచికిత్సల విజయవంతానికి ఆర్థోపెడిక్ నిపుణులు డాక్టర్ కుమార్ బృందం, అనస్థీషియా విభాగానికి చెందిన డాక్టర్ చంద్రశేఖర్ బృందం, ఆపరేషన్ థియేటర్ సిబ్బంది సమన్వయంతో కృషి చేశారు.

సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వ సహకారంతో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన మౌలిక వసతులు, ఆధునిక వైద్య పరికరాలు, నిపుణులైన వైద్యుల సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో అధిక ఖర్చుతో కూడుకున్న అనేక శస్త్రచికిత్సలను ప్రభుత్వ ఆసుపత్రిలో చేస్తున్నాం అని పేర్కొన్నారు. మోకాళ్ల నొప్పులు, కీళ్ల సమస్యలతో బాధపడుతున్న ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుతం శస్త్రచికిత్సలు చేయించుకున్న ఇద్దరు రోగులు వైద్యుల పర్యవేక్షణలో కోలుకుంటున్నారని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించడంలో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి ముందంజలో ఉండటం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మెగా మాక్ ప్రిలిమ్స్ ఎగ్జామ్ – 2026 విజేతలకు నగదు బహుమతుల ప్రదానం

పెద్దపల్లి, అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి)

పోలీసు ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువతను ప్రోత్సహించే లక్ష్యంతో యువశక్తి పెద్దపల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా మాక్ ప్రిలిమ్స్ ఎగ్జామ్ – 2026 విజేతలకు గౌరవ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారి చేతుల మీదుగా నగదు బహుమతులను అందజేశారు.ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు మొదటి బహుమతిగా రూ.10,000, రెండవ బహుమతిగా రూ.5,000, మూడవ బహుమతిగా రూ.2,000 చొప్పున నగదు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గౌరవ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు మాట్లాడుతూ, అభ్యర్థులు మరింత కష్టపడి చదివి, పట్టుదలతో సాధన చేసి తెలంగాణ రాష్ట్ర పోలీసు విభాగంలో ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు ఇలాంటి మాక్ పరీక్షలు ఎంతో ఉపయోగపడతాయని, అభ్యర్థులు తమ సామర్థ్యాన్ని గుర్తించి లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే శ్రీ విజయరమణారావు గారు, రామగుండం ఎమ్మెల్యే శ్రీ మక్కన్ సింగ్ ఠాకూర్ గారు, జిల్లా కలెక్టర్ గారు, జిల్లా మార్కెటింగ్ అధికారి (DMO) శ్రీ ప్రవీణ్ రెడ్డి గారు, యువశక్తి నిర్వాహకుడు, అంతర్జాతీయ పర్వతారోహకుడు శ్రీ లెంకల మహిపాల్ రెడ్డి గారు తదితరులు పాల్గొన్నారు.

యువతలో పోటీ పరీక్షల పట్ల అవగాహన పెంపొందించడం, వారి ప్రతిభను గుర్తించడం, పోలీసు ఉద్యోగాల సాధనకు ప్రోత్సాహం అందించడం లక్ష్యంగా యువశక్తి పెద్దపల్లి చేపట్టిన ఈ కార్యక్రమం అభ్యర్థులకు ప్రేరణనిచ్చింది.

పోక్సో చట్టంపై న్యాయ అవగాహన కార్యక్రమం పోస్టర్ విడుదల

జగిత్యాల అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి)

జగిత్యాల జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డి ఎల్ ఎస్ ఏ) ఆధ్వర్యంలో 28 అక్టోబర్ 2026న జగిత్యాల పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో బాలలపై లైంగిక నేరాల నుంచి రక్షణ కల్పించే పోక్సో చట్టం–2012 (పోక్స్ యాక్ట్) పై న్యాయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సరిత మట్టా హాజరై విద్యార్థినులకు చట్టంపై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా కార్యదర్శి సరిత మట్టా మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన పిల్లలను లైంగిక దాడులు లైంగిక వేధింపులు లైంగిక దోపిడీ నుంచి రక్షించేందుకు పోక్సో చట్టం–2012 రూపొందించబడిందని వివరించారు బాలల హక్కులను పరిరక్షించడం వారిపై జరిగే లైంగిక నేరాలను అరికట్టడం బాధితులకు చట్టపరమైన రక్షణ కల్పించడం ఈ చట్టం ముఖ్య ఉద్దేశమని తెలిపారు విద్యార్థినులు తమ వ్యక్తిగత భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినా లేదా వేధింపులకు పాల్పడినా భయపడకుండా తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పోలీసు అధికారులు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు బాలలపై జరిగే నేరాలను నివారించడంలో తల్లిదండ్రులు ఉపాధ్యాయులు విద్యాసంస్థలు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు అనంతరం పోక్సో చట్టానికి సంబంధించిన అవగాహన పోస్టర్‌ను కార్యదర్శి సరిత మట్టా విడుదల చేశారు బాలల రక్షణ వారి హక్కులు లైంగిక నేరాల నివారణ చట్టపరమైన రక్షణ చర్యలపై విద్యార్థినుల్లో అవగాహన పెంపొందించేందుకు ఈ పోస్టర్ ఉపయోగపడుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కె. చంద్ర మోహన్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సురేష్ న్యాయవాదులు మమత స్వప్న పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు బాలల హక్కుల పరిరక్షణ వారికి చట్టాలపై అవగాహన కల్పించడం సురక్షితమైన వాతావరణాన్ని నిర్మించడం లక్ష్యంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జగిత్యాల ఆధ్వర్యంలో ఇటువంటి న్యాయ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మహిళా సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన సర్పంచ్ వేల్పుల మల్లేశం

రామడుగు, అక్టోబర్ 28 (వు దయం ప్రతినిధి)

కరీంనగర్ జిల్లారామడుగు మండలం కిష్టాపూర్ గ్రామంలో మహిళా సంఘం భవన నిర్మాణానికి భూమి పూజ కిష్టాపూర్ గ్రామ సర్పంచ్ వేల్పుల మల్లేశం, ఆధ్వర్యంలో మహిళా సంఘం భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేసి శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ భవనం నిర్మాణం ద్వారా గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులకు సమావేశాలు నిర్వహించుకోవడానికి, మహిళల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి, స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలను మరింత బలోపేతం చేసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.మహిళలు ఆర్థికంగా ఎదగడంతో పాటు, గ్రామ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని, మహిళా సంఘాల ద్వారా మహిళలకు మరిన్ని అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ భవన నిర్మాణం చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో APM జ్యోతి CC వనిత రాణి మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్మరవేణి తిరుపతి

అక్రమ వడ్డీ దందాపై పోలీసుల దాడులు

- 13 మండలాల్లో 25 బృందాలతో ఆకస్మిక తనిఖీలు..
- 18 కేసులు నమోదు..

ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 28 :

అక్రమ వడ్డీ వ్యాపారులపై ఆదిలాబాద్ జిల్లా పోలీసులు కొరడా ఝుళిపించారు. రైతులు, అమాయక ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని అధిక వడ్డీలు వసూలు చేస్తూ ఇబ్బందులకు గురిచేసే వారిపై కఠిన చర్యలకు ఆదేశించినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ వెల్లడించారు. ఆయన ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా 13 మండలాల్లో 25 పోలీసు బృందాలు ఏకకాలంలో ఆకస్మిక దాడులు నిర్వహించగా, 18 కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా ప్రామిసరీ నోట్లు, స్టాంపు పేపర్లు, బ్యాంకు చెక్కులు, రిజిస్టర్లు, స్థలాలు, ఇళ్లకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

పోలీస్‌స్టేషన్ల వారీగా కేసులు

ఆదిలాబాద్ వన్‌టౌన్‌లో 3, టూటౌన్‌లో 3, మావలలో 4, ఆదిలాబాద్ రూరల్, జైనథ్, బేల, బోథ్, గుడిహత్నూర్, నార్నూర్, నేరడిగొండ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఒక్కొక్కటి, ఉట్నూర్‌లో 2 కేసులు నమోదైనట్లు ఎస్పీ వెల్లడించారు.

కేసులు నమోదైన వారి వివరాలు

వన్‌టౌన్ పరిధిలో ఎస్.కె. సాజిద్ అలియాస్ సాజిత్ గౌడ్, ఎర్రోజు కేశవ్, ఒరగంటి రఘు; టూటౌన్ పరిధిలో టాపిక్ అహ్మద్ అలియాస్ జన్ను, షేక్ అక్బర్; మావలలో దుర్గా శేఖర్ రెడ్డి, దాసరి నరోత్తం, చిట్టి రాజేశ్వర్, షేక్ ఆసిఫ్‌పై కేసులు నమోదైనట్లు తెలిపారు. అదేవిధంగా రూరల్ పరిధిలో అజయ్ కుమార్ గాడ్సే, జైనథ్‌లో ఆత్మకూరు అమరేందర్, బేలలో కార్తీక్, బోథ్‌లో ఈ. రమేష్, ఉట్నూర్‌లో సాయి రెడ్డి, ఇప్ప సంతోష్, నేరడిగొండలో కలాలి వెంకటరమణ, నార్నూర్‌లో ఆరె అశ్విని, గుడిహత్నూర్‌లో కేంద్రీ రాహుల్‌పై కేసులు నమోదైనట్లు వెల్లడించారు.

అక్రమ వడ్డీ వ్యాపారాలపై ఉక్కుపాదం

నమోదైన కేసుల్లో తెలంగాణ ఏరియా మనీ లెండర్స్ చట్టం, 1349లోని సెక్షన్ 3(5)(బి) కింద చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. లైసెన్సులు లేకుండా వడ్డీ వ్యాపారాలు నిర్వహించినా, అధిక వడ్డీల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వ్యాపారాలపై నిఘా కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ఈ-వేస్ట్ మేనేజ్మెంట్ అండ్ వ్యర్థాల విభజన అవగాహన కార్యక్రమం

కోరుట్ల అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి)

కోరుట్ల పట్టణ పిఎంశ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ఎకో క్లబ్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు తడి చెత్త పొడి చెత్త శానిటరీ వేస్ట్ ఈ–వేస్ట్ (ఎలక్ట్రానిక్ వ్యర్థాలు)లను వేరు చేసే విధానంపై శిక్షణ ఇచ్చారు చెత్తను సద్వినియోగం చేసుకోవడానికి ఏర్పాటు చేసిన పచ్చని నీలం పసుపు నలుపు రంగు డబ్బాలలో వ్యర్థాలను వేసి సరియైన పద్ధతిలో డంప్ చేసే విధానాన్ని విద్యార్థులకు ప్రత్యక్షంగా చూపించారు ఈ కార్యక్రమాన్ని ఎకో క్లబ్ కోఆర్డినేటర్ సిహెచ్ లక్ష్మీనారాయణ సైన్స్ ఉపాధ్యాయులు సమన్వయం చేశారు పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు చూపుతున్న చొరవను పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి గంగాధర్ ప్రత్యేకంగా అభినందించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

తలమడుగును కరువు మండలంగా ప్రకటించాలి

బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ డిమాండ్

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 28 :

తీవ్ర వర్షాభావ పరిస్థితులు, పంట దిగుబడులు లేక నష్టపోయిన తలమడుగు మండలాన్ని తక్షణమే కరువు ప్రాంతంగా ప్రకటించాలని బోథ్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ డిమాండ్ చేశారు. జిల్లాలో 20 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించిన ప్రభుత్వం, తీవ్రంగా నష్టపోయిన తలమడుగు మండలాన్ని మినహాయించడం అన్యాయమని పేర్కొన్నారు. బుధవారం మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డితో కలిసి ఆడే గజేందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు జిల్లా కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మండలంలో పంట దిగుబడులు ఆశించిన స్థాయిలో లేక రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రైతుల పరిస్థితిని పరిగణనలోకి తీసుకొని తలమడుగు మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి, బాధిత రైతులకు న్యాయం చేయాలని కోరారు. వినతిపై స్పందించిన కలెక్టర్ రాజర్షి షా.. ఈ అంశంపై ప్రభుత్వానికి నివేదికలు పంపించి, తలమడుగు రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కె. ప్రతాప్, మాజీ జడ్పీటీసీ బి. బాబన్న, మాజీ ఎంపీపీ కె. లక్ష్మి రాజేశ్వర్, నాయకులు ప్రకాష్ రావు, వెంకన్న, రమేష్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, సాంబశివ్, సర్పంచులు నగేష్, వెంకటేష్, మార్కెట్ డైరెక్టర్ పోశెట్టి, యూత్ కాంగ్రెస్ నాయకుడు సాయి కిరణ్, ఎస్సీ సెల్ నాయకుడు రాజేశ్వర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు ఓపెన్ హౌస్

ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బెజ్జూర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ కె. రమేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు పోలీస్ స్టేషన్‌లోని విధులు, పోలీస్ శాఖ పనితీరు, నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు పోలీసులందించే సేవల గురించి ఎస్ఐ కె. రమేష్ వివరించారు. పోలీస్ శాఖలో వినియోగించే వివిధ పరికరాలు, పోలీసుల విధులు, బాధ్యతల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని, చట్టాలను గౌరవిస్తూ క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని గడపాలని సూచించారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు భయపడకుండా పోలీసుల సహాయం తీసుకోవాలని తెలిపారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, సమాజంలో పోలీసుల పాత్రను విద్యార్థులకు తెలియజేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

శిశు మందిర్ విద్యార్థుల సమస్యను సత్వరం పరిష్కరించిన ఎమ్మెల్యే

కోరుట్ల అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి)

కోరుట్ల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కుమార్ మంగళవారం సాయంత్రం శిశు మందిర్ దగ్గరలో గల మాజీ కౌన్సిలర్ అన్వర్ ఫంక్షన్ కి వెళ్లి తిరుగు ప్రయాణంలో అప్పుడే బయటకు వచ్చిన శిశు మందిర్ 10వ తరగతి విద్యార్థులను పలకరించి విద్యా ఆరోగ్యం తో పాటు భవిష్యత్తులో కష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చునని విద్యార్థులకు తెలిపారు విద్యార్థులను ఉద్దేశించి మీకు ఏమైనా సమస్యలు ఉన్నాయని అడగగా విద్యార్థులు రాత్రివేళ ఇంటికి వెళ్లేటప్పుడు దారి పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశంలో చెట్లు పెరగడం వల్ల విసపురుగులు తిరుగుతున్నాయని దానివలన కొద్దిగా ఇబ్బంది ఉందని తెలియజేయడంతో వెంటనే బుధవారం ఉదయం ఆ ఖాళీ ప్రదేశాన్ని శుభ్రం చేయించారు

విద్యార్థుల కోరిక మేరకు వెంటనే స్పందించి సమస్యలు తీర్చినందుకు విద్యార్థులు పాఠశాల యాజమాన్యం శిశుమందిర్ పక్షాన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కి కృతజ్ఞతలు తెలిపారు ఈకార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ వసీం తదితరులు పాల్గొన్నారు

మత్తడి వాగు ప్రాజెక్టు నీటి విడుదల

పాదుపుగా వాడుకోవాలి..

ఎమ్మెల్యే, ఏఎంసీ చైర్మన్ పిలుపు

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 28 :

తాంసి మండలంలోని మత్తడి వాగు ప్రాజెక్టు నుంచి కెనాల్‌కు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన వారు సాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. రైతులు సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని, సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. నీటి విడుదలతో రైతులకు ఊరట లభిస్తుందని, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల సాగులో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజా రెడ్డి, వడ్డడి సర్పంచ్ జయసుధ గంగాధర్, ఆత్మ చైర్మన్ కౌడాల నారాయణ, తాంసి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కౌడాల సంతోష్, ఏఎంసీ సభ్యుడు తాటి అశోక్, అలీమ్, ఖమ్రుద్దీన్, ఇరిగేషన్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కలమడుగులో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

జన్నారం,అక్టోబర్ 28 (వుదయం విలేఖరి)

జన్నారం మండలంలోని కలమడుగు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో బుధవారం రోజున ఖాతాదారులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ కుమార్ వారికి,ఇన్సూరెన్స్, రుణాలు పొందడం, చెల్లించే విధానం, బ్యాంకు ద్వారా ఇస్తున్న సౌకర్యాలను వివరించారు.వ్యక్తిగత ఖాతా వివరాలకు సంబంధించి ఓటిపి అలాగే ఖాతాకు సంబంధించి తదితర విషయాలు చెప్పమని అపరిచితుల నుండి ఫోన్ కాల్స్ వస్తే చెప్పవద్దని అలా చెప్పమని మీకు బ్యాంకు నుండి ఎవరు ఫోన్ చేయరని అన్నారు.అలాంటి కాల్స్ వస్తే వెంటనే అప్రమత్తమై బ్యాంకు అధికారులకు గానీ, స్థానిక పోలీస్ స్టేషన్లో గాని ఫిర్యాదు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొంతల మల్లేష్, లింగన్న, విష్ణుమూర్తి, గౌరయ్య, ఖాతాదారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఎన్నికల సందడి

హెడ్ గర్ల్ హెడ్ బాయ్ ఎన్నికలు

కోరుట్ల అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి)

కోరుట్ల పట్టణంలో పిఎంశ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల కోరుట్ల లో హెడ్బాయ్ హెడ్ గర్ల్ ఎన్నికలు నిర్వహించారు ఇట్టి ఎన్నికలను విద్యార్థులే స్వయంగా నిర్వహించి ఎన్నికల లెక్కింపుల తరువాత హెడ్ గర్ల్ గా అత్యధికంగా ఓట్లు 346 సాధించిన హెచ్ స్వాతి ని హెడ్ భాయిగా ఎం మనీ చరణ్ 204 ఓట్లు పొందినందున ఎన్నికైనట్లు ప్రకటించారు ఎన్నికల నిర్వహణను విద్యార్థులు పరిశీలించి జరుగు విధానాన్ని ఓటు వేయు పద్ధతిని తెలుసుకున్నారు ఈ ఎన్నికల ప్రక్రియ ఉదయం 11 నుండి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించారు విద్యార్థులకు ప్రజాస్వామ్యంలో ఎన్నికలపై అవగాహన కల్పించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వడ్లకొండ గంగాధర్ తెలిపారు ఎన్నికల నిర్వహణ బాధ్యతను సోషల్ స్టడీస్ ఉపాధ్యాయిని రాధిక తో పాటు పాఠశాలలోని ఉపాధ్యాయినీ ఉపాధ్యాయుల సహకారంతో విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు

ఓటు చోరీని అరికట్టాలి.. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

ఎమ్మెల్సీ దండే విఠల్

ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)

ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు రక్షణ, ఓటరు జాబితాల్లో పారదర్శకత సాధించడమే లక్ష్యంగా ఆసిఫాబాద్ డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన ఓటు బచావో దేశ్ బచావో, సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అబ్జర్వర్ మెయ్యప్పన్ , కోఆర్డినేటర్ శ్రవణ్ రావ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆసిఫాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ ఓటరు జాబితాల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు, ఓటు హక్కు పరిరక్షణ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత వంటి అంశాలపై చర్చించారు. ఓటు చోరీ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, ప్రజలకు ఎన్నికల వ్యవస్థపై విశ్వాసం కల్పించాలని, ఈ అంశంపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యతని నాయకులు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షులు విశ్వప్రసాద్ రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అనిల్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్లు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, వివిధ మండలాల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పంట దిగుబడి అంచనా కోసం పంట కోత ప్రయోగం

నాగిరెడ్డిపేట్, అక్టోబర్ 28 (ఉదయం):

వరి పంట దిగుబడిని అంచనా వేసేందుకు పంట కోత ప్రయోగం నిర్వహించినట్లు వ్యవసాయ అధికారి సాయికిరణ్ తెలిపారు. బుధవారం కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట్ మండలం జాప్తి జానకంపల్లి గ్రామంలో నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ (NSO) ఆధ్వర్యంలో ఈ ప్రయోగాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి సాయికిరణ్ మాట్లాడుతూ..గ్రామానికి చెందిన రైతు రవి పొలంలోని సర్వే నంబర్ 41లో 5×5 మీటర్ల విస్తీర్ణంలో ప్రయోగాత్మక ప్లాట్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ ప్లాట్‌లో పంట కోత ప్రయోగం నిర్వహించి వరి దిగుబడిని అంచనా వేస్తారని పేర్కొన్నారు. ప్రయోగం ద్వారా సేకరించిన వివరాలు పంట ఉత్పత్తి, దిగుబడి అంచనాలను రూపొందించడానికి ఉపయోగపడతాయని వివరించారు.ఈ కార్యక్రమంలో NSO డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, కన్సల్టెంట్ జీవరత్నం, SSO, Dy.SO రమేష్, DSO హేమావతి, వ్యవసాయ విస్తరణ అధికారి (AEO) రజిత, గ్రామ సర్పంచ్ అక్కల వర్షిణి పర మేశ్వర్, రైతులు పాల్గొన్నారు.

కొమరం భీం వర్ధంతి కార్యక్రమం విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)

బెజ్జూర్ మండలంలోని ఆదివాసి భవనంలో ఆదివాసి సంఘం అధ్యక్షులు కోరేత తిరుపతి అధ్యక్షతన జరిగిన ఆదివాసి ఆరాధ్యులు కొమరం భీం వర్ధంతి కార్యక్రమం సన్నాహక సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆదివాసి పెద్దలు ఆదివాసి సర్పంచులు,ఆదివాసి ఉద్యోగ ఉపాధ్యాయులు, మహిళా సంఘాలు,ఆదివాసి యువత అందరూ కలిసి రాబోయే సోమవారం నవంబర్ 2న కొమరం భీం వర్ధంతి వారోత్సవాలు నిర్వహించుటకు ఏకగ్రీవంగా తీర్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బెజ్జూరు మండలంలోని అన్ని గ్రామాలనుండి ఆదివాసులు అధిక సంఖ్యలో పాల్గొని కొమురం భీం వారోత్సవాలా కార్యక్రమాన్ని ఘనంగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు . ఈ సమావేశంలో గౌరవ అధ్యక్షులు సిదం సకారం, తొగ్రెమ్ బానయ్య, కుమ్రం హన్మంత్, ఆత్రం బక్కయ్య, ఏనుక శంకర్, తలండి తిరుపతి, తలండి రాములు,ఆత్రం సాయి, బండి రాజారామ్ తదితరులు పాల్గొన్నారు.

కొండపల్లిలో 1000 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

ఒకరిపై కేసు నమోదు.. 5 లీటర్ల గుడుంబా స్వాధీనం

ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)

అక్రమంగా గుడుంబా తయారీ, విక్రయాల నియంత్రణలో భాగంగా పోలీసులు నిర్వహించిన కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమంలో 1000 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, 5 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన పెంచికల్‌పేట్ మండలం కొండపల్లి గ్రామంలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్సై అనిల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో నిర్వహించిన కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమంలో భాగంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా గుడుంబా తయారీకి సిద్ధంగా ఉంచిన 1000 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేయడంతోపాటు, 5 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు.

రైతు గర్జన సభను విజయవంతం చేయాలి

బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పిలుపు

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 28 :

ఆదిలాబాద్ జిల్లాలో రైతులకు భరోసా కల్పించేందుకు నవంబర్ 1న పట్టణంలోని డైట్ మైదానంలో నిర్వహించే రైతు గర్జన సభకు రైతులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పిలుపునిచ్చారు. రైతు గర్జన సభ పోస్టర్‌ను మాజీ మంత్రి జోగు రామన్న, మాజీ విప్ బాల్క సుమన్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం సభా ప్రాంగణాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. రైతుల ఆత్మహత్యలతో బాధిత కుటుంబాలకు భరోసా కల్పించేందుకు కేటీఆర్ సభకు హాజరై, ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలను పరామర్శించనున్నట్లు అనిల్ జాదవ్ తెలిపారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతోపాటు, వారికి అండగా నిలవడమే రైతు గర్జన సభ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై సభలో చర్చించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని రైతులు, పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని అనిల్ జాదవ్ కోరారు.

లాండా సాంగి, అర్లి–బి గ్రామాలకు 33 కేవీ సబ్‌స్టేషన్

నరేష్ జాదవ్, సంజీవరెడ్డికి రైతుల కృతజ్ఞతలు

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 28 :

ఆదిలాబాద్ రూరల్ మండల పరిధిలోని లాండా సాంగి, అర్లి–బి గ్రామాల రైతుల దశాబ్దాల విద్యుత్ కష్టాలకు తెరపడనుంది. ఈ రెండు గ్రామాల వ్యవసాయ విద్యుత్ సమస్యల పరిష్కారానికి లాండా సాంగి వద్ద నూతన 33 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు కావడంతో రైతులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. సబ్‌స్టేషన్ మంజూరుకు కృషి చేసిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో బంగారిగూడ సబ్‌స్టేషన్‌పై ఆధారపడటం వల్ల వ్యవసాయ విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఎదుర్కొనేవారమని లాండా సాంగి, అర్లి–బి గ్రామాల రైతులు తెలిపారు. విద్యుత్ సమస్యల కారణంగా వ్యవసాయ పనులకు ఆటంకాలు ఎదురయ్యేవని పేర్కొన్నారు. తమ ఇబ్బందులను నరేష్ జాదవ్, సంజీవరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, వారు స్పందించి సబ్‌స్టేషన్ మంజూరు కోసం కృషి చేశారని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ.. లాండా సాంగి వద్ద 33 కేవీ సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే రెండు గ్రామాల రైతులకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు.

రైతుల సమస్యను పరిష్కరించేందుకు చొరవ తీసుకున్న నరేష్ జాదవ్, సంజీవరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సబ్‌స్టేషన్ మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు కూడా గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట యాదవ్, ఉపాధ్యక్షుడు నల్లగంటి గణేష్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొమ్మకంటి రమేష్, అర్లి–బి మాజీ సర్పంచ్ వినోద్, బడాల రమేష్, తుడం భూమన్న, కొమర పెంటన్న, మండల ప్రధాన కార్యదర్శి రామాసం విట్టల్, బుద్దె సుదర్శన్, లాండా సాంగి ఉపసర్పంచ్ గొర్ల పోచన్న, గోప వెంకటేష్, దండు మధుకర్, సాత్నాల మండల అధ్యక్షుడు కినక బాపురావు, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి ఇమ్రాన్ బేగ్, రైతులు, గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర సమాచార కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల /అక్టోబర్ 28(వుదయం ప్రతినిధి)

ఉమ్మడి జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సింగరేణి అతిథి గృహానికి విచ్చేసిన రాష్ట్ర సమాచార కమిషనర్ డా. జి. చంద్రశేఖర్ రెడ్డి ను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ.భాస్కర్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, సింగరేణి సంస్థ శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ లతో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

రిమ్స్ వైద్యులకు ఎమ్మెల్యే పాయల్ శంకర్ హెచ్చరిక

సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవు!

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 28 :

ఆదిలాబాద్ రిమ్స్‌లో వైద్యులు సమయపాలన పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలకు సిఫార్సు చేస్తామని ఎమ్మెల్యే పాయల్ శంకర్ హెచ్చరించారు. వైద్యులు సమయానికి విధులకు హాజరుకాకుండా, పచ్చిన తర్వాత కొద్దిసేపటికే వెళ్లిపోతున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో బుధవారం ఎమ్మెల్యే రిమ్స్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా రిమ్స్ డైరెక్టర్ ఛాంబర్‌లో వైద్యుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి, వారి రాకపోకల సమయాలపై ఆరా తీశారు. అనంతరం బయోమెట్రిక్ హాజరు వివరాలను తెలుసుకున్నారు. గైనకాలజీ వార్డు, ఓపీ విభాగాలను సందర్శించి వైద్యులతో మాట్లాడారు. ఆస్పత్రికి వస్తున్న రోగుల సంఖ్య, వారికి అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. వైద్యులు దేవుడితో సమానమని, వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాలో మానవతా దృక్పథంతో సేవలందించాలని సూచించారు. నెల రోజుల క్రితం నిర్వహించిన సమావేశంలో వైద్యులకు పలు సూచనలు చేసినప్పటికీ ఆశించిన మార్పు రాలేదన్నారు. గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల తర్వాత అత్యధికంగా రోగుల తాకిడి ఉండే ఆస్పత్రుల్లో రిమ్స్ ఒకటని పేర్కొన్నారు. కొందరు వైద్యులు విధులకు సక్రమంగా హాజరుకాకపోవడంతో రోగులకు వైద్య సేవలు అందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. వేతనాలు సరిపోవడం లేదని వైద్యులు తన దృష్టికి తీసుకురావడంతో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ప్రత్యేక జీవో తీసుకువచ్చినట్లు తెలిపారు. జీవో తీసుకొచ్చినా పరిస్థితిలో మార్పు లేకప

అక్రమ వడ్డీ దందాపై పోలీసుల దాడులు

- 13 మండలాల్లో 25 బృందాలతో ఆకస్మిక తనిఖీలు..
- 18 కేసులు నమోదు..

ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 28 :

అక్రమ వడ్డీ వ్యాపారులపై ఆదిలాబాద్ జిల్లా పోలీసులు కొరడా ఝుళిపించారు. రైతులు, అమాయక ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని అధిక వడ్డీలు వసూలు చేస్తూ ఇబ్బందులకు గురిచేసే వారిపై కఠిన చర్యలకు ఆదేశించినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ వెల్లడించారు. ఆయన ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా 13 మండలాల్లో 25 పోలీసు బృందాలు ఏకకాలంలో ఆకస్మిక దాడులు నిర్వహించగా, 18 కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా ప్రామిసరీ నోట్లు, స్టాంపు పేపర్లు, బ్యాంకు చెక్కులు, రిజిస్టర్లు, స్థలాలు, ఇళ్లకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

పోలీస్‌స్టేషన్ల వారీగా కేసులు

ఆదిలాబాద్ పన్‌టౌన్‌లో 3, టూటౌన్‌లో 3, మావలలో 4, ఆదిలాబాద్ రూరల్, జైనథ్, బేల, బోథ్, గుడిహత్నూర్, నార్నూర్, నేరడిగొండ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఒక్కొక్కటి, ఉట్నూర్‌లో 2 కేసులు నమోదైనట్లు ఎస్పీ వెల్లడించారు.

కేసులు నమోదైన వారి వివరాలు

పన్‌టౌన్ పరిధిలో ఎస్.కె. సాజిద్ అలియాస్ సాజిత్ గౌడ్, ఎర్రోజు కేశవ్, ఒరగంటి రఘు; టూటౌన్ పరిధిలో టాపిక్ అహ్మద్ అలియాస్ జన్ను, షేక్ అక్బర్; మావలలో దుర్గా శేఖర్ రెడ్డి, దాసరి నరోత్తం, చిట్టి రాజేశ్వర్, షేక్ ఆసిఫ్‌పై కేసులు నమోదైనట్లు తెలిపారు. అదేవిధంగా రూరల్ పరిధిలో అజయ్ కుమార్ గాడ్సే, జైనథ్‌లో ఆత్మకూరు అమరేందర్, బేలలో కార్తీక్, బోథ్‌లో ఈ. రమేష్, ఉట్నూర్‌లో సాయి రెడ్డి, ఇప్ప సంతోష్, నేరడిగొండలో కలాలి వెంకటరమణ, నార్నూర్‌లో ఆరె అశ్విని, గుడిహత్నూర్‌లో కేంద్రీ రాహుల్‌పై కేసులు నమోదైనట్లు వెల్లడించారు.

అక్రమ వడ్డీ వ్యాపారాలపై ఉక్కుపాదం

నమోదైన కేసుల్లో తెలంగాణ ఏరియా మనీ లెండర్స్ చట్టం, 1349లోని సెక్షన్ 3(5)(బి) కింద చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. లైసెన్సులు లేకుండా వడ్డీ వ్యాపారాలు నిర్వహించినా, అధిక వడ్డీల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వ్యాపారాలపై నిఘా కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ఈ-వేస్ట్ మేనేజ్మెంట్ అండ్ వ్యర్థాల విభజన అవగాహన కార్యక్రమం

కోరుట్ల అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి)

కోరుట్ల పట్టణ పిఎంశ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ఎకో క్లబ్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు తడి చెత్త పొడి చెత్త శానిటరీ వేస్ట్ ఈ–వేస్ట్ (ఎలక్ట్రానిక్ వ్యర్థాలు)లను వేరు చేసే విధానంపై శిక్షణ ఇచ్చారు చెత్తను సద్వినియోగం చేసుకోవడానికి ఏర్పాటు చేసిన పచ్చని నీలం పసుపు నలుపు రంగు డబ్బాలలో వ్యర్థాలను వేసి సరియైన పద్ధతిలో డంప్ చేసే విధానాన్ని విద్యార్థులకు ప్రత్యక్షంగా చూపించారు ఈ కార్యక్రమాన్ని ఎకో క్లబ్ కోఆర్డినేటర్ సిహెచ్ లక్ష్మీనారాయణ సైన్స్ ఉపాధ్యాయులు సమన్వయం చేశారు పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు చూపుతున్న చొరవను పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి గంగాధర్ ప్రత్యేకంగా అభినందించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

తలమడుగును కరువు మండలంగా ప్రకటించాలి

బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ డిమాండ్

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 28 :

తీవ్ర వర్షాభావ పరిస్థితులు, పంట దిగుబడులు లేక నష్టపోయిన తలమడుగు మండలాన్ని తక్షణమే కరువు ప్రాంతంగా ప్రకటించాలని బోథ్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ డిమాండ్ చేశారు. జిల్లాలో 20 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించిన ప్రభుత్వం, తీవ్రంగా నష్టపోయిన తలమడుగు మండలాన్ని మినహాయించడం అన్యాయమని పేర్కొన్నారు. బుధవారం మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డితో కలిసి ఆడే గజేందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు జిల్లా కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మండలంలో పంట దిగుబడులు ఆశించిన స్థాయిలో లేక రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రైతుల పరిస్థితిని పరిగణనలోకి తీసుకొని తలమడుగు మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి, బాధిత రైతులకు న్యాయం చేయాలని కోరారు. వినతిపై స్పందించిన కలెక్టర్ రాజర్షి షా.. ఈ అంశంపై ప్రభుత్వానికి నివేదికలు పంపించి, తలమడుగు రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కె. ప్రతాప్, మాజీ జడ్పీటీసీ బి. బాబన్న, మాజీ ఎంపీపీ కె. లక్ష్మి రాజేశ్వర్, నాయకులు ప్రకాష్ రావు, వెంకన్న, రమేష్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, సాంబశివ్, సర్పంచులు నగేష్, వెంకటేష్, మార్కెట్ డైరెక్టర్ పోశెట్టి, యూత్ కాంగ్రెస్ నాయకుడు సాయి కిరణ్, ఎస్సీ సెల్ నాయకుడు రాజేశ్వర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మత్తడి వాగు ప్రాజెక్టు నీటి విడుదల

పాడుపుగా వాడుకోవాలి..

ఎమ్మెల్యే, ఏఎంసీ చైర్మన్ పిలుపు

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 28 :

తాంసి మండలంలోని మత్తడి వాగు ప్రాజెక్టు నుంచి కెనాల్‌కు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన వారు సాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. రైతులు సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని, సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. నీటి విడుదలతో రైతులకు ఊరట లభిస్తుందని, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల సాగులో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజా రెడ్డి, వడ్డడి సర్పంచ్ జయసుధ గంగాధర్, ఆత్మ చైర్మన్ కౌడాల నారాయణ, తాంసి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కౌడాల సంతోష్, ఏఎంసీ సభ్యుడు తాటి అశోక్, అలీమ్, ఖయ్యూద్దీన్, ఇరిగేషన్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఓటు చోరీని అరికట్టాలి.. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

ఎమ్మెల్సీ దండే విఠల్

ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)

ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు రక్షణ, ఓటరు జాబితాల్లో పారదర్శకత సాధించడమే లక్ష్యంగా ఆసిఫాబాద్ డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన ఓటు బచావో దేశ్ బచావో, సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అబ్జర్వర్ మెయ్యప్పన్ , కోఆర్డినేటర్ శ్రవణ్ రావ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆసిఫాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ ఓటరు జాబితాల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు, ఓటు హక్కు పరిరక్షణ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత వంటి అంశాలపై చర్చించారు. ఓటు చోరీ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, ప్రజలకు ఎన్నికల వ్యవస్థపై విశ్వాసం కల్పించాలని, ఈ అంశంపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యతని నాయకులు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షులు విశ్వప్రసాద్ రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అనిల్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్లు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, వివిధ మండలాల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొమరం భీం వర్ధంతి కార్యక్రమం విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)

బెజ్జూర్ మండలంలోని ఆదివాసి భవనంలో ఆదివాసి సంఘం అధ్యక్షులు కోరేత తిరుపతి అధ్యక్షతన జరిగిన ఆదివాసి ఆరాధ్యులు కొమరం భీం వర్ధంతి కార్యక్రమం సన్నాహక సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆదివాసి పెద్దలు ఆదివాసి సర్పంచులు,ఆదివాసి ఉద్యోగ ఉపాధ్యాయులు, మహిళా సంఘాలు,ఆదివాసి యువత అందరూ కలిసి రాబోయే సోమవారం నవంబర్ 2న కొమరం భీం వర్ధంతి వారోత్సవాలు నిర్వహించుటకు ఏకగ్రీవంగా తీర్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బెజ్జూరు మండలంలోని అన్ని గ్రామాలనుండి ఆదివాసులు అధిక సంఖ్యలో పాల్గొని కొమురం భీం వారోత్సవాలా కార్యక్రమాన్ని ఘనంగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు . ఈ సమావేశంలో గౌరవ అధ్యక్షులు సిడం సకారం, తొర్రెమ్ భానయ్య, కుమ్రం హన్మంత్, ఆత్రం బక్కయ్య, ఏనుక శంకర్, తలండి తిరుపతి, తలండి రాములు,ఆత్రం సాయి, బండి రాజారామ్ తదితరులు పాల్గొన్నారు.

లాండా సాంగి, అర్లి–బి గ్రామాలకు 33 కేవీ సబ్‌స్టేషన్

నరేష్ జాదవ్, సంజీవరెడ్డికి రైతుల కృతజ్ఞతలు

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 28 :

ఆదిలాబాద్ రూరల్ మండల పరిధిలోని లాండా సాంగి, అర్లి–బి గ్రామాల రైతుల దశాబ్దాల విద్యుత్ కష్టాలకు తెరపడనుంది. ఈ రెండు గ్రామాల వ్యవసాయ విద్యుత్ సమస్యల పరిష్కారానికి లాండా సాంగి వద్ద నూతన 33 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు కావడంతో రైతులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. సబ్‌స్టేషన్ మంజూరుకు కృషి చేసిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో బంగారిగూడ సబ్‌స్టేషన్‌పై ఆధారపడటం వల్ల వ్యవసాయ విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఎదుర్కొనేవారమని లాండా సాంగి, అర్లి–బి గ్రామాల రైతులు తెలిపారు. విద్యుత్ సమస్యల కారణంగా వ్యవసాయ పనులకు ఆటంకాలు ఎదురయ్యేవని పేర్కొన్నారు. తమ ఇబ్బందులను నరేష్ జాదవ్, సంజీవరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, వారు స్పందించి సబ్‌స్టేషన్ మంజూరు కోసం కృషి చేశారని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ.. లాండా సాంగి వద్ద 33 కేవీ సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే రెండు గ్రామాల రైతులకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు.

రైతుల సమస్యను పరిష్కరించేందుకు చొరవ తీసుకున్న నరేష్ జాదవ్, సంజీవరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సబ్‌స్టేషన్ మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు కూడా గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట యాదవ్, ఉపాధ్యక్షుడు నల్లగంటి గణేష్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొమ్మకంటి రమేష్, అర్లి–బి మాజీ సర్పంచ్ వినోద్, బడాల రమేష్, తుడం భూమన్న, కొమర పెంటన్న, మండల ప్రధాన కార్యదర్శి రామాసం విట్టల్, బుద్దె సుదర్శన్, లాండా సాంగి ఉపసర్పంచ్ గొర్ల పోచన్న, గోప వెంకటేష్, దండు మధుకర్, సాంత్నాల మండల అధ్యక్షుడు కినక బాపురావు, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి ఇమ్రాన్ బేగ్, రైతులు, గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు ఓపెన్ హౌస్

ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బెజ్జూర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ కె. రమేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు పోలీస్ స్టేషన్‌లోని విధులు, పోలీస్ శాఖ పనితీరు, నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు పోలీసులందించే సేవల గురించి ఎస్ఐ కె. రమేష్ వివరించారు. పోలీస్ శాఖలో వినియోగించే వివిధ పరికరాలు, పోలీసుల విధులు, బాధ్యతల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని, చట్టాలను గౌరవిస్తూ క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని గడపాలని సూచించారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు భయపడకుండా పోలీసుల సహాయం తీసుకోవాలని తెలిపారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, సమాజంలో పోలీసుల పాత్రను విద్యార్థులకు తెలియజేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

కలమడుగులో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

జన్నారం,అక్టోబర్ 28 (వుదయం విలేఖరి)

జన్నారం మండలంలోని కలమడుగు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో బుధవారం రోజున ఖాతాదారులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ కుమార్ వారికి,ఇన్సూరెన్స్, రుణాలు పొందడం, చెల్లించే విధానం, బ్యాంకు ద్వారా ఇస్తున్న సౌకర్యాలను వివరించారు.వ్యక్తిగత ఖాతా వివరాలకు సంబంధించి ఓటిపి అలాగే ఖాతాకు సంబంధించి తదితర విషయాలు చెప్పమని అపరిచితుల నుండి ఫోన్ కాల్స్ వస్తే చెప్పవద్దని అలా చెప్పమని మీకు బ్యాంకు నుండి ఎవరు ఫోన్ చేయరని అన్నారు.అలాంటి కాల్స్ వస్తే వెంటనే అప్రమత్తమై బ్యాంకు అధికారులకు గానీ, స్థానిక పోలీస్ స్టేషన్లో గాని ఫిర్యాదు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొంతల మల్లేష్, లింగన్న, విష్ణుమూర్తి, గౌరయ్య, ఖాతాదారులు పాల్గొన్నారు.

కొండపల్లిలో 1000 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

ఒకరిపై కేసు నమోదు.. 5 లీటర్ల గుడుంబా స్వాధీనం

ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)

అక్రమంగా గుడుంబా తయారీ, విక్రయాల నియంత్రణలో భాగంగా పోలీసులు నిర్వహించిన కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమంలో 1000 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, 5 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన పెంచికల్‌పేట్ మండలం కొండపల్లి గ్రామంలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్సై అనిల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో నిర్వహించిన కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమంలో భాగంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా గుడుంబా తయారీకి సిద్ధంగా ఉంచిన 1000 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేయడంతోపాటు, 5 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు.

రాష్ట్ర సమాచార కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల /అక్టోబర్ 28(వుదయం ప్రతినిధి)

ఉమ్మడి జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సింగరేణి అతిథి గృహానికి విచ్చేసిన రాష్ట్ర సమాచార కమిషనర్ డా. జి. చంద్రశేఖర్ రెడ్డి ను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ.భాస్కర్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, సింగరేణి సంస్థ శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ లతో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

శిశు మందిర్ విద్యార్థుల సమస్యను సత్వరం పరిష్కరించిన ఎమ్మెల్యే

కోరుట్ల అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి)

కోరుట్ల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కుమార్ మంగళవారం సాయంత్రం శిశు మందిర్ దగ్గరలో గల మాజీ కౌన్సిలర్ అన్వర్ ఫంక్షన్ కి వెళ్లి తిరుగు ప్రయాణంలో అప్పుడే బయటకు వచ్చిన శిశు మందిర్ 10వ తరగతి విద్యార్థులను పలకరించి విద్యా ఆరోగ్యం తో పాటు భవిష్యత్తులో కష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చునని విద్యార్థులకు తెలిపారు విద్యార్థులను ఉద్దేశించి మీకు ఏమైనా సమస్యలు ఉన్నాయని అడగగా విద్యార్థులు రాత్రివేళ ఇంటికి వెళ్లేటప్పుడు దారి పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశంలో చెట్లు పెరగడం వల్ల విసుపురుగులు తిరుగుతున్నాయని దానివలన కొద్దిగా ఇబ్బంది ఉందని తెలియజేయడంతో వెంటనే బుధవారం ఉదయం ఆ ఖాళీ ప్రదేశాన్ని శుభ్రం చేయించారు

విద్యార్థుల కోరిక మేరకు వెంటనే స్పందించి సమస్యలు తీర్చినందుకు విద్యార్థులు పాఠశాల యాజమాన్యం శిశుమందిర్ పక్షాన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కి కృతజ్ఞతలు తెలిపారు ఈకార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ వసీం తదితరులు పాల్గొన్నారు

ప్రభుత్వ పాఠశాలలో ఎన్నికల సందడి

హెడ్ గర్ల్ హెడ్ బాయ్ ఎన్నికలు

కోరుట్ల అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి)

కోరుట్ల పట్టణంలో పిఎంశ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల కోరుట్ల లో హెడ్డాయ్ హెడ్ గర్ల్ ఎన్నికలు నిర్వహించారు ఇట్టి ఎన్నికలను విద్యార్థులే స్వయంగా నిర్వహించి ఎన్నికల లెక్కింపుల తరువాత హెడ్ గర్ల్ గా అత్యధికంగా ఓట్లు 346 సాధించిన హెచ్ స్వాతి ని హెడ్ భాయిగా ఎం మనీ చరణ్ 204 ఓట్లు పొందినందున ఎన్నికైనట్లు ప్రకటించారు ఎన్నికల నిర్వహణను విద్యార్థులు పరిశీలించి జరుగు విధానాన్ని ఓటు వేయు పద్ధతిని తెలుసుకున్నారు ఈ ఎన్నికల ప్రక్రియ ఉదయం 11 నుండి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించారు విద్యార్థులకు ప్రజాస్వామ్యంలో ఎన్నికలపై అవగాహన కల్పించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వడ్లకొండ గంగాధర్ తెలిపారు ఎన్నికల నిర్వహణ బాధ్యతను సోషల్ స్టడీస్ ఉపాధ్యాయిని రాధిక తో పాటు పాఠశాలలోని ఉపాధ్యాయినీ ఉపాధ్యాయుల సహకారంతో విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు

పంట దిగుబడి అంచనా కోసం పంట కోత ప్రయోగం

నాగిరెడ్డిపేట్, అక్టోబర్ 28 (ఉదయం):

వరి పంట దిగుబడిని అంచనా వేసేందుకు పంట కోత ప్రయోగం నిర్వహించినట్లు వ్యవసాయ అధికారి సాయికిరణ్ తెలిపారు. బుధవారం కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట్ మండలం జాప్తి జానకంపల్లి గ్రామంలో నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ (NSO) ఆధ్వర్యంలో ఈ ప్రయోగాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి సాయికిరణ్ మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన రైతు రవి పొలంలోని సర్వే నంబర్ 41లో 5×5 మీటర్ల విస్తీర్ణంలో ప్రయోగాత్మక ప్లాట్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ ప్లాట్‌లో పంట కోత ప్రయోగం నిర్వహించి వరి దిగుబడిని అంచనా వేస్తారని పేర్కొన్నారు. ప్రయోగం ద్వారా సేకరించిన వివరాలు పంట ఉత్పత్తి, దిగుబడి అంచనాలను రూపొందించడానికి ఉపయోగపడతాయని వివరించారు.ఈ కార్యక్రమంలో NSO డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, కన్సల్టెంట్ జీవరత్నం, SSO, Dy.SO రమేష్, DSO హేమావతి, వ్యవసాయ విస్తరణ అధికారి (AEO) రజిత, గ్రామ సర్పంచ్ అక్కల వర్షిణి పరమేశ్వర్, రైతులు పాల్గొన్నారు.

రైతు గర్జన సభను విజయవంతం చేయాలి

బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పిలుపు

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 28 :

ఆదిలాబాద్ జిల్లాలో రైతులకు భరోసా కల్పించేందుకు నవంబర్ 1న పట్టణంలోని డైట్ మైదానంలో నిర్వహించే రైతు గర్జన సభకు రైతులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పిలుపునిచ్చారు. రైతు గర్జన సభ పోస్టర్‌ను మాజీ మంత్రి జోగు రామన్న, మాజీ విప్ బాల్క సుమన్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం సభా ప్రాంగణాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. రైతుల ఆత్మహత్యలతో బాధిత కుటుంబాలకు భరోసా కల్పించేందుకు కేటీఆర్ సభకు హాజరై, ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలను పరామర్శించనున్నట్లు అనిల్ జాదవ్ తెలిపారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతోపాటు, వారికి అండగా నిలవడమే రైతు గర్జన సభ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై సభలో చర్చించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని రైతులు, పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని అనిల్ జాదవ్ కోరారు.

రిమ్స్ వైద్యులకు ఎమ్మెల్యే పాయల్ శంకర్ హెచ్చరిక

సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవు!

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 28 :



ఆదిలాబాద్ రిమ్స్‌లో వైద్యులు సమయపాలన పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలకు సిఫార్సు చేస్తామని ఎమ్మెల్యే పాయల్ శంకర్ హెచ్చరించారు. వైద్యులు సమయానికి విధులకు హాజరుకాకుండా, వచ్చిన తర్వాత కొద్దిసేపటికే వెళ్లిపోతున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో బుధవారం ఎమ్మెల్యే రిమ్స్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా రిమ్స్ డైరెక్టర్ ఛాంబర్‌లో వైద్యుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి, వారి రాకపోకల సమయాలపై ఆరా తీశారు. అనంతరం బయోమెట్రిక్ హాజరు వివరాలను తెలుసుకున్నారు. గైనకాలజీ వార్డు, ఓపీ విభాగాలను సందర్శించి వైద్యులతో మాట్లాడారు. ఆస్పత్రికి వస్తున్న రోగుల సంఖ్య, వారికి అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. వైద్యులు దేవుడితో సమానమని, వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాలో మానవతా దృక్పథంతో సేవలందించాలని సూచించారు. నెల రోజుల క్రితం నిర్వహించిన సమావేశంలో వైద్యులకు పలు సూచనలు చేసినప్పటికీ ఆశించిన మార్పు రాలేదన్నారు. గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల తర్వాత అత్యధికంగా రోగుల తాకిడి ఉండే ఆస్పత్రుల్లో రిమ్స్ ఒకటని పేర్కొన్నారు. కొందరు వైద్యులు విధులకు సక్రమంగా హాజరుకాకపోవడంతో రోగులకు వైద్య సేవలు అందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. వేతనాలు సరిపోవడం లేదని వైద్యులు తన దృష్టికి తీసుకురావడంతో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ప్రత్యేక జీవో తీసుకువచ్చినట

సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- వ్యక్తిగత బ్యాంకు వివరాలను ఎవరికీ వెల్లడించవద్దు
- ప్రభుత్వ వైద్య కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం
- 'ఆగండి.. ఆలోచించండి.. నిర్ధారించుకోండి' నినాదంతో విద్యార్థులకు అవగాహన
- సైబర్ నేరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్, అవగాహన పోస్టర్ల ప్రదర్శన
- సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేయాలి

కామారెడ్డి, అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి):-

జాతీయ సైబర్ భద్రత అవగాహన మాసోత్సవం – అక్టోబర్ 2026లో భాగంగా బుధవారం కామారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో జిల్లా పోలీస్ శాఖ, జిల్లా సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (D4C) ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 'PAUSE FOR SAFETY – Pause. Think. Verify.' (ఆగండి.. ఆలోచించండి.. నిర్ధారించుకోండి) అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కామారెడ్డి డివిజన్ డీఎస్పీ మధుసూధన్, కామారెడ్డి రూరల్ సీఐ శ్రీధర్, సైబర్ క్రైమ్ ఎస్ఐ నరేశ్, దేవుని పల్లి ఎస్ఐ రంజిత్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కామారెడ్డి డీఎస్పీ మధుసూధన్ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో సైబర్ నేరగాళ్లు కొత్తకొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, ముఖ్యంగా పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో మోసాలు, నకిలీ ఉద్యోగాల పేరుతో మోసాలు, రుణ యాప్‌ల ద్వారా వేధింపులు, ఇతరుల పేరుతో నటిస్తూ చేసే మోసాలు, ఆన్‌లైన్ షాపింగ్ మోసాలు, ఫోన్ కాల్స్, సందేశాల ద్వారా జరిగే మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కృత్రిమ మేధస్సు (AI)తో రూపొందించే డీప్‌ఫేక్ వీడియోలు, నకిలీ ఆడియోల ద్వారా జరిగే సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ సూచించారు. ఇలాంటి వీడియోలు, ఆడియోలను నమ్మే ముందు నిజానిజాలు నిర్ధారించుకోవాలని, గుర్తు తెలియని వ్యక్తులకు డబ్బులు పంపవద్దని తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపే లింకులను తెరవకూడదని, ఓటీపీ, పిన్, సీవీవీ, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లను ఎవరికీ వెల్లడించకూడదని తెలిపారు. తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని చెప్పే సందేశాలను నమ్మవద్దని, ఆన్‌లైన్ లావాదేవీల సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సైబర్ నేరాల నివారణలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని, తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ (PPT) ద్వారా వివిధ రకాల సైబర్ నేరాలు, నేరగాళ్లు అనుసరించే విధానాలు, మోసాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం సైబర్ నేరాల నివారణకు సంబంధించిన అవగాహన పోస్టర్లను ప్రదర్శించి, వాటి ద్వారా విద్యార్థులకు మరింత స్పష్టంగా వివరించారు. సైబర్ భద్రతా నియమాలను పాటిస్తూ ఆన్‌లైన్‌లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సైబర్ మోసానికి గురైనప్పుడు ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని తెలిపారు. సత్వరంగా ఫిర్యాదు చేయడం ద్వారా మోసపోయిన డబ్బును నిలిపివేసే అవకాశాలు మెరుగుపడతాయని వివరించారు. అనంతరం విద్యార్థులతో సైబర్ నేరాల నివారణకు సంబంధించిన ప్రతిజ్ఞ చేయించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండటంతో పాటు, ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, సైబర్ క్రైమ్ సిబ్బంది పాల్గొనగా, సుమారు 300 మంది విద్యార్థులు సైబర్ నేరాల నివారణపై అవగాహన పొందారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

అధ్యక్షుడు పి. రాములు నాయక్

నిజాంసాగర్ అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి) :

ఉమ్మడి నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాల ప్రింట్ మీడియా నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నిజాంసాగర్ మండల కేంద్రంలోని మండల శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన సమావేశంలో ప్రింట్ మీడియా జర్నలిస్టులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. నూతన అధ్యక్షుడిగా పి. రాములు నాయక్ (ఆంధ్రప్రభ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా సీహెచ్. బాల్‌రాజ్ (సాక్షి), మహమ్మద్ జునేద్ (దిశ), ప్రధాన కార్యదర్శిగా రెడ్డి శెట్టి భాస్కర్ (నమస్తే తెలంగాణ), కోశాధికారిగా పి. నవీన్ కుమార్ (నవతెలంగాణ) ఎన్నికయ్యారు. సలహాదారులుగా శ్యామ్ (మన తెలంగాణ), హుల్లాజీ (తెలంగాణ కిరీటం), గౌస్ (సూర్య)లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు పి. రాములు నాయక్ మాట్లాడుతూ.. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని తెలిపారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయులు కీలక పాత్ర పోషిస్తున్నారని, జర్నలిస్టుల ఐక్యతతో సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు గుర్రపు వెంకటేశం, కాశి, రహీం, రాజేందర్ రెడ్డి, చైతన్య, గుంటి దశరథ్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం

ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)

బెజ్జూరు పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో వాహనదారులకు మోటార్ వెహికల్స్ యాక్ట్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎస్సై రమేష్ తెలిపారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా బెజ్జూరు పోలీస్ స్టేషన్ ఎస్సై కె. రమేష్ సలుగుపల్లి ఎక్స్ రోడ్డు వద్ద వాహనదారులకు మోటార్ వెహికల్స్ యాక్ట్ మరియు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై కె. రమేష్ మాట్లాడుతూ, ఇటీవలి కాలంలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో వాటిని నివారించేందుకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, అతివేగంగా వాహనాలు నడపకూడదని, రహదారులపై మలుపుల వద్ద అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అలాగే రాత్రి సమయాల్లో వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా లైట్లు వినియోగించాలని, వాహనదారులు తమ భద్రతతో పాటు ఇతరుల ప్రాణాల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకోవాలని

సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించకుండా బాధ్యతాయుతంగా వాహనాలు నడిపినప్పుడే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేయాలని ఈ సందర్భంగా ఎస్సై కె. రమేష్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బెజ్జూర్ ఎస్. ఐ రమేష్ మరియు కానిస్టేబుల్ సంజీవ్ లు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన మంత్రి వివేక్ వెంకటస్వామి

సీనియర్ పాత్రికేయుడి అంత్యక్రియలకు ఆర్థిక సాయం...

మంచిర్యాల /రామకృష్ణాపూర్/అక్టోబర్ 28(వుదయం ప్రతినిధి)

రామకృష్ణాపూర్ పట్టణంలోని తిలక్ నగర్ ఏరియాకు చెందిన తేజ న్యూస్, సాక్షి ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేసిన సీనియర్ పాత్రికేయుడు పులిపాక శ్రీనివాస్ అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మోడ్నాల శ్రీనివాస్ అన్నారు. శ్రీనివాస్‌కు తల్లిదండ్రులు, భార్యాపిల్లలు ఎవరూ లేకపోవడంతో దహన సంస్కారాలు నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని మోడ్నాల శ్రీనివాస్ స్థానిక ఎమ్మెల్యే, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి దహన సంస్కారాలకు అవసర మైన పూర్తి ఖర్చును కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి

అబ్దుల్ అజీజ్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య,మాజీ ఎంపీటీసీ పుల్లూరి కల్యాణ్, గురజాల రవీందర్ రావు, కాంగ్రెస్ నాయకులు లాడెన్, సురేష్, పోషయ్య, స్థానికులు పెద్దపల్లి ఉప్పలయ్య, తిరుపతి, శ్రీనివాస్, కొమురయ్య, ఎల్లసాని శ్రీనివాస్‌తో పాటు పలువురు మీడియా మిత్రులు పాల్గొన్నారు.

అనారోగ్య సమస్యలతో యువకుడి ఆత్మహత్య

చికిత్స పొందుతూ మృతి

లక్షెట్టిపేట, అక్టోబర్ 28 (వుదయం న్యూస్) :

అనారోగ్య సమస్యలతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్సై గోపతి సురేష్ బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. జెండా వెంకటాపూర్ గ్రామానికి చెందిన తిప్పని శేఖర్ (28) గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎల క్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. గత కొంతకాలంగా కిడ్నీ సమస్యతో పాటు ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ మందులు వాడుతున్నప్పటికీ ఆరోగ్య సమస్యలు వెంటాడుతుండటంతో మనస్తాపానికి గురయ్యాడు.ఈ క్రమంలో ఈ నెల 23న రాత్రి కుటుంబ సభ్యులందరూ నిద్రిస్తున్న సమయంలో పంటలకు వినియోగించే పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తీసుకెళ్లగా, అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు.మృతుడి తల్లి తిప్పని వజ్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సునీత కుటుంబానికి న్యాయం చేయాలి

కలెక్టర్ రాజర్షి షాకు దుర్గం శేఖర్ వినతి

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 28 :

ఆదిలాబాద్ రిమ్స్‌లో మృతి చెందిన గర్భిణి బోర్కర్ సునీత, ఆమె కడుపులోని కవల శిశువుల మృతిపై బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్ దుర్గం శేఖర్ కోరారు. బాధిత కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టర్ రాజర్షి షాకు వినతిపత్రం అందజేశారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి వైద్యుల నిర్లక్ష్యం ఉన్నట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు దుర్గం శేఖర్ తెలిపారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం, ఇంటి నిర్మాణం, కుమార్తె విద్యా ఖర్చులు భరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కామారెడ్డి బాలసదనం నుంచి చిన్నారిని దత్తత తీసుకున్న మదనపల్లె దంపతులు

కామారెడ్డి, అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి):-

కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆధ్వర్యంలో కామారెడ్డి బాలసదనంలో ఉన్న ఒక చిన్నారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన దంపతులకు బుధవారం నిబంధనల ప్రకారం దత్తతకు అందజేశారు. చిన్నారులకు ప్రేమ పూర్వకమైన కుటుంబ వాతావరణాన్ని కల్పించి, వారి సమగ్ర అభివృద్ధికి తోడ్పడాలనే లక్ష్యంతో ప్రభుత్వం దత్తత ప్రక్రియను అమలు చేస్తోంది. సంబంధిత చట్టాలు, నిబంధనలకు అనుగుణంగా దత్తత ప్రక్రియను పూర్తి చేసి చిన్నారిని దత్తత తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు మాట్లాడుతూ, దత్తత తీసుకున్న చిన్నారులకు కుటుంబ ప్రేమ, ఆప్యాయత, రక్షణతో పాటు మెరుగైన విద్య, ఆరోగ్య సంరక్షణ అందించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. చిన్నారి సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని దత్తత తల్లిదండ్రులకు తెలిపారు. దత్తత తీసుకున్న దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి వెంకటేష్, సూపర్‌డెంట్ అరుణ్ భాస్కర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదంలో వృద్ధుడు మృతి

నిజాంసాగర్, అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి):

మహ్మద్నగర్ మండలంలోని బుర్గుల్ గ్రామ శివారులో జాతీయ రహదారిపై మెదక్, –బోధన్ ప్రధాన రహదారిపై లింగంపేట మండలం ముంబాజీపేట గ్రామానికి చెందిన వడ్ల రాములు మృతి చెందినట్లు నిజాంసాగర్ ఎస్ఐ శివకుమార్ తెలిపారు. బుర్గుల్ గ్రామ శివారులో మంగళవారం రాత్రి సుమారు 8:30 గంటల సమయంలెఓ వడ్ల రాములు తనకు తాను రహదారిపై పడడంతో తలకు తీవ్రంగా గాయాలయ్యాయని దీంతో గ్రామస్థులు అంబులెన్స్ కు సమాచారం అందించి నిజాంసాగర్ పోలీసుల సహాయంతో చికిత్స నిమిత్తం బాన్సువాడ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. చికిత్స పొందుతున్న రాములు బుధవారం మృతి చెందగా మృతుని భార్య బాలమణి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన పీఏసీఎస్ అధ్యక్షురాలు వినోద

నిజాంసాగర్, అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి):

రైతులు కష్టపడి పండించిన పరి ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని మల్లూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) అధ్యక్షురాలు భుజంగారి వినోద వెంకటరామిరెడ్డి సూచించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. బుధవారం నిజాంసాగర్ మండలంలోని మల్లూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని వడ్డేపల్లి, జక్కాపూర్, మల్లూరు తండా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినోద రైతులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు ప్రభుత్వం మద్దతు ధర అందించేందుకు కృషి చేస్తోందన్నారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి నిబంధనల ప్రకారం విక్రయించాలని సూచించారు.

ప్రైవేటు వ్యాపారులు, దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని విక్రయిస్తే మద్దతు ధర పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులు పంట సాగు కోసం పెట్టిన పెట్టుబడులకు తగిన ప్రతిఫలం లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని పేర్కొన్నారు.

ఎలాంటి ఇబ్బందులు కలగకుండా

కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సంబంధిత అధికారులు, కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతులకు అందుబాటులో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, ధాన్యం విక్రయించే సమయంలో వారికి అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. రైతులు అధికారుల సూచనలు పాటిస్తూ కొనుగోలు ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రజా పండరి, సర్పంచులు బొజ్జ అంజయ్య, కేతావత్ నారాయణ, సాతేలి పోచయ్య, ఉపసర్పంచ్ పొట్టోల్ల పోచయ్య, డైరెక్టర్లు మీనా సింగ్, గుల సాయిరాం, బుడిమి మైసయ్య, ఎముల సాయిలు, అంజయ్య, సీఈఓ సాయిలు, మాజీ సర్పంచ్ గడీల విట్టల్ రెడ్డి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై కలెక్టర్ అధ్యక్షతన డీఆర్ఎస్‌సీ సమావేశం

కామారెడ్డి, అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి):-

జిల్లా రోడ్డు భద్రతా కమిటీ (డీఆర్ఎస్‌సీ) సమావేశం బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, జిల్లా అటవీ అధికారి (డీఎఫ్ఓ)తో పాటు సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణ, రహదారులపై ఆక్రమణల తొలగింపు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఎన్‌హెచ్– 44, ఎన్‌హెచ్–161 జాతీయ రహదారుల వెంట ఉన్న అక్రమ ధాబాలు, ఇతర ఆక్రమణలను గుర్తించి తొలగించాలని సమావేశంలో నిర్ణయించారు. సరైన అప్రోచ్ రోడ్డు సదుపాయం లేని ధాబాలకు కొత్తగా ఎలాంటి అనుమతులు మంజూరు చేయరాదని స్పష్టం చేశారు. రహదారులపై వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా, ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రహదారుల వెంట ఉన్న ఆక్రమణలను తొలగించే కార్యక్రమంలో పోలీసు శాఖ పూర్తి సహకారం అందిస్తుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఆక్రమణల తొలగింపు సమయంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

ప్రమాద బాధితులకు సహాయం చేస్తే రూ.25 వేల ప్రోత్సాహకం:–

రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులను ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడేందుకు సహకరించే వారికి రహవీర్ (Rah–Veer) పథకం కింద రూ.25,000 ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్నట్లు జిల్లా రవాణా అధికారి (డీటీఓ) సమావేశంలో వివరించారు. ప్రమాద బాధితులకు సకాలంలో వైద్య సహాయం అందించడంలో ప్రజలు ముందుకు రావాలని సూచించారు. ఆటోల్లో అనుమతించిన పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకునే వాహనాలపై కేసులు నమోదు చేస్తున్నట్లు డీటీఓ తెలిపారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని నిబంధనలను ఉల్లంఘించే వాహనాలపై తనిఖీలు, చర్యలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

వరి పంట దిగుబడి అంచనా కోసం పంట కోత ప్రయోగం నిర్వహణ

- పంట దిగుబడి వివరాల సేకరణకు పంట కోత ప్రయోగాలు కీలకం
- వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి

కామారెడ్డి, అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి):-

నాగిరెడ్డిపేట మండలం జాప్తి జానకంపల్లి గ్రామంలో జాతీయ గణాంక సంస్థ ఆధ్వర్యంలో వరి పంట దిగుబడిని అంచనా వేసేందుకు పంట కోత ప్రయోగాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన రైతు గోపాల్ వ్యవసాయ క్షేత్రంలోని సర్వే నంబర్ 41లో 5×5 మీటర్ల విస్తీర్ణంలో ప్లాట్‌ను ఎంపిక చేసి, వరి పంట దిగుబడిని అంచనా వేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి మాట్లాడుతూ, పంటల దిగుబడిని శాస్త్రీయ పద్ధతిలో అంచనా వేయడానికి పంట కోత ప్రయోగాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ ప్రయోగాల ద్వారా సేకరించిన వివరాలు పంటల ఉత్పత్తి అంచనాలకు, వ్యవసాయ ప్రణాళికల రూపకల్పనకు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ గణాంక సంస్థ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస రావు, కన్సల్టెంట్ జీవరత్నం, ఎస్ఎస్ఓ రాకేష్, డిప్యూటీ ఎస్ఓ రమేష్, డీఎస్ఓ హేమావతి, వ్యవసాయ అధికారి సాయికిరణ్, ఏఈఓ రజిత, గ్రామ సర్పంచ్ వర్షిణి, ఉప సర్పంచ్ బాలరాజు, గ్రామ పంచాయతీ అధికారి రాజు, రైతులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి

చెన్నూర్ రూరల్ సీఐ ఆర్ కృష్ణ

కోటపల్లి మండలం వుదయం

కోటపల్లి మండలం పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని చెన్నూరు రూరల్ సర్కిల్ పోలీసుల ఆధ్వర్యంలో ఈనెల 30న నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరం, ఉచిత కంటి పరీక్షల వాల్ పోస్టర్‌ను బుధవారం ఘనంగా ఆవిష్కరించారు. చెన్నూరు రూరల్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.కృష్ణ, కోటపల్లి ఎస్సై రాజశేఖర్ స్థానిక సర్పంచులు, ఇతర నాయకులతో కలిసి పాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా చెన్నూర్ రూరల్ సీఐ ఆర్ కృష్ణ మాట్లాడుతూ.. సమాజ రక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమన్నారు. వారి స్మృత్యర్థం అక్టోబర్ 30 ఉదయం 9 గంటల నుంచి చెన్నూరు రూరల్ సర్కిల్ కార్యాలయం, కోటపల్లి పోలీస్ స్టేషన్ వేదికగా మెగా రక్తదాన శిబిరంతో పాటు ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంటి సమస్యలతో బాధపడేవారు ఈ ఉచిత శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అలాగే యువత, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారికి ప్రాణదాతలు గా నిలవాలని అన్నారు ఈకార్యక్రంలో గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు...

మద్యానికి బానిసై వ్యక్తి మృతి

లక్షెట్టిపేట, అక్టోబర్ 28 (వుదయం న్యూస్):

మద్యానికి బానిసైన ఓ వ్యక్తి మృతి చెందాడని ఎస్సై గోపతి సురేష్ బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాలకు చెందిన కన్నం రాజ్ కుమార్ (42) అనే వ్యక్తి మంగళవారం రాత్రి అతిగా మద్యం సేవించాడు. అనంతరం పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న వైన్ షాప్ షట్టర్ సమీపంలో కూర్చుని కిందపడిపోయాడు.దీనిని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని చూడగా, రాజ్ కుమార్ తలకు గాయమై మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. మృతుడి భార్య రమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అంగన్వాడి దరఖాస్తుదారుల ధ్రువపత్రాల పరిశీలన

సిడిపిఓ హేమలత

ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్ ల, ఆయా ల పోస్టుల కోసం దరఖాస్తులు చేసుకున్న వారి ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పరిశీలన నిర్వహించనున్నట్లు సిడిపిఓ హేమలత ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అంగన్వాడి టీచర్ పోస్టులు 153 ఉండగా 2384 దరఖాస్తులు వచ్చాయని, అంగన్వాడి హెల్పర్ 280 పోస్టులకు గాను 1470 మంది ప్రాజెక్టుల వారీగా దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టుల కోసం సంబంధిత టిడిపిఓ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకున్న వారి సర్టిఫికెట్ వెరిఫికేషన్ నవంబర్ 4వ తేదీ నుండి 7 వ తేదీ వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుందని తెలిపారు.నవంబర్ 4,5 తేదీలలో ఆసిఫాబాద్, బెజ్జూర్, సిర్పూర్, కౌటాల ఉంటుందని, 6,7 తేదీలలో చింతలమానపల్లి, పెంచికల్‌పేట్, రెబ్బెన, తిర్యాని ఉంటుందని ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు ఆన్ లైన్ దరఖాస్తు తో పాటు జతచేసిన అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు మరియు రెండు సెంట్లు జిరాక్స్ గజిటేడ్ అదికారి తో అటేస్టెడ్ చేయించుకోని తీసుకుని రావాలని అన్నారు.

కల్లెడ పిఏసిఎస్ చైర్మెన్ పిన్నింటి అనిల్ రావును పరామర్శించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

పర్వతగిరి, అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి):

ఇటీవల అనారోగ్య సమస్యతో ఆసుపత్రిలో చికిత్స పొంది, ప్రస్తుతం ఇంటికి తిరిగి వచ్చి విశ్రాంతి తీసుకుంటున్న కల్లెడ పీఏసీఎస్ చైర్మన్ పిన్నింటి అనిల్ రావును వర్ధ

85 ఏళ్ల వృద్ధుడికి లాప్రోస్కోపిక్ శస్త్రచికిత్స విజయవంతం

- **మలక్‌పేట యశోద ఆసుపత్రి వైద్యుల ఘనత.. పిత్తాశయంలో 22 మి.మీ. రాయి తొలగింపు**

కోదాడ: అక్టోబర్ 28 (వుదయం)

మలక్‌పేట యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు 85 ఏళ్ల వృద్ధుడికి లాప్రోస్కోపిక్ పద్ధతిలో పిత్తాశయ శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. చిలుకూరుకు చెందిన పి. పుల్లయ్య కొంతకాలంగా జ్వరం, చలి, కడుపునొప్పితో బాధపడుతుండగా, సమగ్ర వైద్య పరీక్షల ద్వారా ఆయన సమస్యను గుర్తించి చికిత్స అందించారు.

కోదాడలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ గుత్తా శశిధర్‌రెడ్డి పర్యవేక్షణలో, కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ వెంకటేశ్ శ్రీపతి ఆధ్వర్యంలో నిర్వహించిన శస్త్రచికిత్స వివరాలను వెల్లడించారు.

పరీక్షల్లో 22 మి.మీ. రాయి గుర్తింపు

మధుమేహం, రక్తపోటుతో బాధపడుతున్న పుల్లయ్య పలు ఆసుపత్రులను సంప్రదించినప్పటికీ సమస్యకు స్పష్టమైన కారణం తెలియలేదని వైద్యులు తెలిపారు. అనంతరం యశోద ఆసుపత్రిలో నిర్వహించిన ప్రత్యేక పరీక్షల్లో పిత్తాశయంలో 22 మిల్లీమీటర్ల రాయి ఉన్నట్లు గుర్తించారు. రోగి వయస్సు, ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని అవసరమైన పరీక్షల అనంతరం శస్త్రచికిత్స చేపట్టారు.వైద్యుల సమన్వయంతో విజయవంతమైన చికిత్స

వృద్ధాప్యంలో శస్త్రచికిత్స సవాలుతో కూడుకున్నప్పటికీ, వైద్య బృందం సమన్వయంతో లాప్రోస్కోపిక్ కొలిసిస్టెక్టమీ ద్వారా పిత్తాశయాన్ని విజయవంతంగా తొలగించారు. ప్రస్తుతం పుల్లయ్య ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు.ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ, పలు ఆసుపత్రులను సంప్రదించినా తన సమస్యకు పరిష్కారం లభించలేదని, యశోద ఆసుపత్రి వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స చేసి ఉపశమనం కలిగించారని తెలిపారు. వైద్యులు తనకు పునర్జన్మ ప్రసాదించారని భావోద్వేగంగా పేర్కొన్నారు.జ్వరం, చలి, కడుపునొప్పి వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు. ఈ సమావేశంలో కోదాడకు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ వాసు కిరణ్‌రెడ్డి, పుల్లయ్య కుటుంబ సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రముఖ కాంట్రాక్టర్ ఘట్టు కృష్ణమూర్తి నివాసంలో

రాయచూరు మాజీ ఎమ్మెల్యే ముచ్చట: ఘన సన్మానం, ఆత్మీయ విందు!

గద్వాల, అక్టోబరు 28 (వుదయం బ్యూరో)

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని నూతన హౌసింగ్ బోర్డు కాలనీ మంగళవారం ఒక ప్రముఖ రాజకీయ, సామాజిక శ్రేణుల ఆత్మీయ సమ్మేళనానికి వేదికైంది. ప్రముఖ 'ఏ1' కాంట్రాక్టర్ ఘట్టు కృష్ణమూర్తి నూతన నివాసానికి కర్ణాటకలోని రాయచూరు మాజీ శాసన సభ్యులు ప్రత్యేకంగా విచ్చేశారు.

గతంలో నిర్వహించిన గృహప్రవేశ మహోత్సవానికి అనివార్య కారణాల వల్ల హాజరుకాలేకపోవడంతో, గద్వాల పర్యటన సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన ప్రత్యేకంగా కృష్ణమూర్తి నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఘట్టు కృష్ణమూర్తి సోదరులు ఆయనకు శాలువా కప్పి, ఘనంగా సన్మానించి ఆత్మీయ స్వాగతం పలికారు. తమ ఆహ్వానాన్ని గౌరవించి, ప్రత్యేకంగా విచ్చేసి విందులో పాల్గొనడం పట్ల ఘట్టు కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ ధనలక్ష్మి కృష్ణమూర్తి హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో టాగూర్ విద్యాసంస్థల అసోసియేషన్ అధ్యక్షుడు బెట్టప్ప, గుంజి మర్చంట్స్ కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోవింద్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, శివన్న తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

వడ్డే బీమప్పకు లయన్స్ క్లబ్ అధ్యక్షులు చేయూత

నారాయణపేట అక్టోబర్ 28(వుదయం ప్రతినిధి)

అనారోగ్యంతో బాధపడుతున్న వడ్డే భీమప్పకు నారాయణపేట లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ రవికుమార్ గౌడ్ చేయూతనిచ్చారు.శేర్న పల్లి గ్రామానికి చెందిన వడ్డే భీమప్ప అనారోగ్యంతో బాధ పడుతున్న విషయం తెలుసుకున్న లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట 320 ఏ అధ్యక్షులు లయన్ రవికుమార్ గౌడ్ మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి వారికి నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, కుటుంబానికి అండగా నిలిచారు.

కష్టాల్లో ఉన్నవారికి ఆపన్నహస్తం అందిస్తూ, నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న లయన్ రవికుమార్ గౌడ్ సేవాభావం అభినందనీయమని పలువురు ప్రశంసించారు. శేర్నపల్లి గ్రామానికే కాకుండా చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు సైతం ఎల్లవేళలా అండగా నిలుస్తూ, మానవత్వమే మతంగా, సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న వారి సేవలు ఎంతో స్ఫూర్తిదాయకమని గ్రామ ప్రజలు కొనియాడారు.ఈ మంచి కార్యానికి వడ్డే భీమప్ప కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

లయన్ రవికుమార్ గౌడ్ కి హృదయపూర్వక అభినందనలు...

ఆ భగవంతుని ఆశీస్సులతో లయన్ రవికుమార్ గౌడ్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లుతూ, మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని మనస్ఫూర్తిగా గ్రామస్తులు కోరారు.

సైబర్ కేటుగాళ్ల దుర్మార్గం.. మాజీ సర్పంచ్ భర్త ఫోన్ హ్యాక్!

- **మహానంద్ రెడ్డి నంబర్‌తో భారీ మోసాలకు తెర..**
- **ఆ లింక్ క్లిక్ చేశారో.. మీ అంతు చూసినట్లే!**
- **కొండాపురంలో కలకలం.. ప్రజలకు ప్రాణసంకటంగా సైబర్ ఉచ్చు**

గద్వాల, అక్టోబర్ 28 (వుదయం బ్యూరో)

సామాన్యుల నుంచి ప్రజాప్రతినిధుల వరకు ఎవరినీ వదిలిపెట్టని సైబర్ దొంగలు.. ఇప్పుడు ఏకంగా కొండాపురం మాజీ సర్పంచ్ భర్త మహానంద్ రెడ్డి ఫోన్‌ను టార్గెట్ చేసి హ్యాక్ చేశారు. ఆయన నంబర్‌ను తమ ఆధీనంలోకి తీసుకున్న ఆ కేటుగాళ్లు.. ఇప్పుడు గ్రామంలోని ప్రజల నెత్తురు తాగేందుకు సరికొత్త కుట్రకు తెరలేపారు. ఆయన ఫోన్ నుంచి వస్తున్న మాయ మాటల లింకులను నమ్మి మోసపోతే.. మీ కష్టార్జితం గాలికలవడం ఖాయమని తీవ్ర హెచ్చరికలు వెలువడుతు న్నాయి. ఒక్క క్లిక్‌తో సర్వనాశనం.. అప్రమత్తం కాకపోతే అంతే! మహానంద్ రెడ్డి పేరుతో, ఆయన నంబర్ నుంచి వస్తున్న ఆ అజ్ఞాత లింక్‌లు అచ్చం ప్రాణాంతక విషంలాంటివి. "పరిచయస్తుడే కదా, మాజీ సర్పంచ్ భర్తే కదా" అనే కనీస ఆలోచనతో ఆ లింక్‌లపై ఒక్కసారి వేలితో నొక్కారో.. మీ ఫోన్‌లోని వ్యక్తిగత సమాచారమంతా సైబర్ మూకల చేతుల్లోకి వెళ్లిపోతుంది.అంతేకాదు, మీ బ్యాంకు ఖాతాల్లో ఉన్న ఒక్క రూపాయి కూడా మిగలకుండా క్షణాల్లో ఖాళీ చేసే

ప్రమాదం ముంచుకొచ్చింది. ఇప్పుడు మీరు చేయాల్సింది ఇదే: ఆ లింక్‌లను ముట్టుకోవద్దు: మహానంద్ రెడ్డి పేరుతో లేదా ఆయన నంబర్ నుంచి ఏ లంకె, ఏ సందేశం వచ్చినా సరే.. పొరపాటున కూడా వాటి జోలికి పోవద్దు. డబ్బులడిగితే నమ్మకండి: "అత్యవసరంగా డబ్బులు కావాలి, పంపండి" అని ఆయన పేరుతో ఏవైనా మెసేజ్‌లు వస్తే ఒక్క క్షణం ఆగి, నేరుగా ఆయనకు ఫోన్ చేసి నిజం తెలుసుకోండి. లేదంటే నిండా మునిగిపోతారు. ఇతరులకు పంపకండి: ఆ ప్రమాదకరమైన లింకులను ఏ వాట్సాప్ గ్రూపులకు, బంధువులకు ఫార్వర్డ్ చేసి వారిని కూడా ప్రమాదంలోకి నెట్టకండి. భద్రత మీ చేతుల్లోనే: ఈ సమాచారాన్ని వెంటనే నలుగురికీ తెలిపి, అందరినీ అప్రమత్తం చేయండి. ఒక చిన్న అజాగ్రత్త.. మీ జీవితాంతం దాచుకున్న డబ్బును, మీ పరువును క్షణాల్లో బూడిద చేస్తుంది. సైబర్ మాయగాళ్ల ఉచ్చులో పడి నిండా మునిగిపోకండి.. అత్యంత అప్రమత్తంగా ఉండండి!"

దళిత ఉపసర్పంచ్‌పై సర్పంచ్ కుమారుడి వేధింపులు!

- **కోహీర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు**

కోహీర్, అక్టోబరు 28 (వుదయం ప్రతినిధి):

సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం సజ్జాపూర్ గ్రామ పంచాయతీలో దళిత ఉపసర్పంచ్ మైసయ్యపై వేధింపులు జరుగుతున్నాయనే ఆరోపణలు వెలువేతుతున్నాయి . గ్రామ సర్పంచ్ కే. పద్మావతి కుమారుడు ప్రసాద్‌రెడ్డి తనను అవమానిస్తూ, ఉపసర్పంచ్ పదవికి రాజీనామా చేయాలని ఒత్తిడి చేస్తున్నాడని మైసయ్య ఆరోపించారు. ఈ వ్యవహారంపై బాధితుడికి న్యాయం చేయాలని, సంబంధిత వ్యక్తిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని దళిత నాయకులు డిమాండ్ చేశారు.

బుధవారం సజ్జాపూర్ గ్రామ పంచాయతీ వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఉపసర్పంచ్ మైసయ్య, ఈ ఆరోపణలను వెల్లడించారు. గత కొన్ని రోజులుగా ప్రసాద్‌రెడ్డి తనను బహిరంగంగా దూషిస్తూ, తీవ్రంగా అవమానిస్తున్నాడని మైసయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఉపసర్పంచ్ పదవికి వెంటనే రాజీనామా చేయాలని బెదిరిస్తున్నాడని ఆరోపించారు.

వాట్సాప్, ఇతర సామాజిక మాధ్యమాల గ్రూపుల్లో తనను కించపరిచేలా పోస్టులు పెడుతున్నారని, గ్రామసభలకు సంబంధించిన వ్యవహారాల్లో తనకున్న హక్కులను అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ పరిణామాలతో తాను, తన కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నామని తెలిపారు. తన భార్యాపిల్లలు భయాందోళనల మధ్య జీవిస్తున్నారని, తనకు న్యాయం చేయడంతో పాటు రక్షణ కల్పించాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా మైసయ్య, ఆయన తల్లి శ్యామలమ్మ తమ ఆవేదనను వ్యక్తం చేశారు.దళిత ప్రజాప్రతినిధిపై వేధింపులు జరుగుతున్నాయనే ఆరోపణలను కోహీర్ మున్సిపల్ కౌన్సిలర్ సంపత్‌కుమార్ తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన దళిత ఉపసర్పంచ్‌ను కులం పేరుతో దూషిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వారు ఆరోపించారు. ఈ ఘటనపై పోలీసులు తక్షణమే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.విచారణలో ఆరోపణలు నిజమని తేలితే ప్రసాద్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితుడికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ), డీఎల్‌పీఓ, రాష్ట్ర ఎస్సీ కమిషన్, మానవ హక్కుల కమిషన్ తక్షణమే స్పందించాలని సంపత్‌కుమార్ కోరారు. నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితుడికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోకపోతే దళిత సంఘాలు, మేధావులు, ప్రజా సంఘాలతో కలిసి ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ ఘటనపై దళిత నాయకులు మూర్జల్, అలెగ్జాండర్, గాబ్రియేల్, రవికిరణ్, మున్నా, వినోద్, అవినాష్, శివకుమార్, సురేష్, మోజస్, మోహన్‌దాస్, కృష్ణ, పద్మారావు తదితరులు బాధితుడికి మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా కోహీర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై పోలీసులు విచారణ జరిపి బాధితుడికి న్యాయం చేయాలని వారు కోరారు.

కోహెడను వెంటనే కరువు మండలంగా ప్రకటించాలి

- **రైతాంగాన్ని ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వేంకటేశం**

కోహెడ అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి):

కరువు పరిస్థితులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతాంగాన్ని ఆదుకునేందుకు కోహెడ మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వేంకటేశం డిమాండ్ చేశారు. రైతుల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.కోహెడ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని కోరుతూ బీజేపీ కోహెడ మండల శాఖ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు జాలిగం రమేష్ నేతృత్వంలో బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఖమ్మం వేంకటేశం మాట్లాడుతూ.. కరువు పరిస్థితులతో

రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం వారికి అండగా నిలవడంలో విఫలమవుతోందని ఆరోపించారు. రైతుల కష్టాలు ప్రభుత్వానికి కనిపించడం లేదా? కోహెడ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడంలో ఎందుకు జాప్యం చేస్తోందని ప్రశ్నించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కోహెడ మండలంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతారా? లేక సవతి తల్లి ప్రేమ చూపుతున్నారా? అని నిలదీశారు. రైతుల సమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే కోహెడ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, అర్హులైన రైతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం, ఇతర సహాయక చర్యలు అందించాలని డిమాండ్ చేశారు. రైతాంగానికి న్యాయం జరిగే వరకు బీజేపీ ప్రజల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు అవసరమైన సహాయ చర్యలు చేపట్టాలని, కరువు ప్రభావిత రైతులను ఆదుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సర్పంచులు మ్యాకాల స్వర్ణలత సురేందర్ రెడ్డి, పకీడే సంపత్, కాతాం ఆమూల్య రాజశేఖర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు మ్యాకాల రజినీకాంత్ రెడ్డి, పిల్లి నర్సయ్య, మండల ప్రధాన కార్యదర్శి ఖమ్మం సతీష్, ఉపాధ్యక్షుడు సామల గిరిధర్, కార్యదర్శి దానవేని రాజయ్య, కోశాధికారి బండ సుమన్ యాదవ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కంది సత్యనారాయణ రెడ్డి, వివిధ మోర్చాల మండల అధ్యక్షులు నాగు అజయ్, అన్నాడి లక్ష్మారెడ్డి, బండ జగన్ యాదవ్, పొన్నాల శంకర్ తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడు మొక్క వెంకన్నకు పందిరి నాగిరెడ్డి పరామర్శ

కోదాడ అక్టోబర్ 28(వుదయం)

మోతె మండలం ఉర్లుగొండ గ్రామ సర్పంచ్ మొక్క వెంకన్న మంగళవారం సాయంత్రం బరాకత్‌గూడెం వద్ద రోడ్డు ప్రమాదానికి గురై ఎడమ కాలు విరగడంతో, కోదాడలోని సురేష్ ఆర్థోపెడిక్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న కోదాడ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పందిరి నాగిరెడ్డి, ఎంఎస్ విద్యాసంస్థల సీఈవో ఎస్.ఎస్. రావు బాధితుడిని పరామర్శించారు. ఈ సందర్భంగా వైద్యుడితో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

పసిపాపల కడుపు కొడితే ఖబర్దార్!

- **అంగన్వాడీ కేంద్రాన్ని చుట్టుముట్టిన సర్పంచ్, ప్రజాప్రతినిధులు**
- **ఆహార నాణ్యతపై ఉరకలేసిన ఆగ్రహం.. రికార్డులు జల్లెడ!**

గట్టు అక్టోబర్ 28 (వుదయం బ్యూరో)

అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంక్షేమాన్ని గాలికి వదిలేస్తే సహించేది లేదంటూ గ్రామ ప్రజాప్రతినిధులు శరఘాతం లాంటి హెచ్చరికలు జారీ చేశారు.గట్టు మండల కేంద్రంలో గల ఒకటో నంబర్ అంగన్వాడీ కేంద్రంపై సర్పంచ్ ఎం. నాగరాజు, మాజీ సర్పంచ్ యు. ధనలక్ష్మి మెరుపుదాడి తరహాలో తనిఖీలు నిర్వహించారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందుతుందో లేదో రికార్డులతో సహా సరిచూశారు. గుడ్లు, కూరగాయల నాణ్యతను రచ్చకీడ్చి ప్రశ్నించారు. పిల్లల ఎత్తు, బరువుల్లో పురోగతి లేకపోవడంపై సిబ్బందిని నిలదీశారు. చిన్నారుల ఆరోగ్యం, పోషకాహార పంపిణీలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సైతం క్షమించేది లేదని స్పష్టం చేశారు. స్థానిక సర్పంచ్ చూపిన ఈ కఠిన వైఖరితో మండలవ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ నిర్వాహకుల్లో వణుకు మొదలైంది.

విద్యార్థుల భద్రతలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు!

అయిజలో ప్రైవేట్ పాఠశాలల్లో డీఈఓ ఆకస్మిక తనిఖీలు
ఇరుకైన తరగతి గదులు.. భద్రతా లోపాలు.. ఆటస్థలాలు కరువు

అయిజ, అక్టోబర్ 28 వుదయం ప్రతినిధి

ప్రైవేట్ పాఠశాలలు విద్యాశాఖ నిబంధనలకు అనుగుణంగా విద్యాసంస్థలను నిర్వహించాలని, విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి హెచ్చరించారు. బుధవారం అయిజ మండలంలోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, న్యూ గీతాంజలి పాఠశాలలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య పాఠశాలలో ఇరుకైన తరగతి గదులు, గాలి, వెలుతురు సరిగా లేకపోవడం, తగిన భద్రతా ఏర్పాట్లు, ఆటస్థలం లేకపోవడాన్ని గుర్తించారు. విద్యార్థులను సరైన రక్షణ ఏర్పాట్లు లేకుండా ఇసుకలో కూర్చోబెట్టడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

న్యూ గీతాంజలి పాఠశాలలోనూ ఇరుకైన తరగతి గదులు, గాలి ప్రసరణ లోపం, భద్రతా ఏర్పాట్లు లేకపోవడం, ఆటస్థలం లేకపోవడాన్ని గుర్తించారు.ఓ ఉపాధ్యాయుడు విద్యార్థులను కొడుతున్నట్లు, ఇన్వర్టర్ బ్యాటరీల పక్కనే విద్యార్థులు ఎలాంటి జాగ్రత్తలు లేకుండా కూర్చుంటున్నట్లు పరిశీలించారు. ఈ పరిస్థితులు విద్యార్థుల భద్రతకు ముప్పుగా మారే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. రెండు పాఠశాలల్లో ఫీజుల వివరాలను ప్రదర్శించినప్పటికీ, విద్యార్థులకు అవసరమైన కనీస మౌలిక వసతులు, భద్రతా సదుపాయాల కల్పనలో లోపాలు ఉన్నట్లు డీఈఓ గుర్తించారు. ఫీజుల వివరాలు ప్రదర్శించడంతోనే బాధ్యత ముగియదని, విద్యార్థులకు సురక్షితమైన వాతావరణం, మెరుగైన సౌకర్యాలు కల్పించడం పాఠశాలల యాజమాన్యాల బాధ్యత అని స్పష్టం చేశారు. నిబంధనలను పాటిస్తూ, విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని పాఠశాలల యాజమాన్యాలను హెచ్చరించారు. ఈ మేరకు విద్యార్థుల భద్రత, విద్యా ప్రమాణాల విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదని డీఈఓ విజయలక్ష్మి స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ, కనీస మౌలిక వసతులు కల్పించకుండా పాఠశాలలను నిర్వహించే యాజమాన్యాలపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తుతో పాటు వారి ప్రాణ భద్రతను పణంగా పెట్టి పాఠశాలలను నిర్వహిస్తే ఉపేక్షించేది లేదని, అన్ని ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలు పాటించేలా తనిఖీలు కొనసాగిస్తామని ఆమె స్పష్టం చేశారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించడం అభినందనీయం

ఆసరా 8వ జాతీయ సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల, అక్టోబర్ 28 వుదయం బ్యూరో

వినియోగదారుల హక్కుల పరిరక్షణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ఆసరా సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ, సామాజిక బాధ్యత, ప్రజల్లో చైతన్యం కల్పించడమే లక్ష్యంగా AASRAA (Advocates Association for Social Responsibility and Awareness) ఆధ్వర్యంలో నవంబర్ 27, 28 తేదీల్లో గోవాలో నిర్వహించనున్న 8వ జాతీయ సదస్సు పోస్టర్‌ను బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ జాతీయ

సదస్సులో వినియోగదారుల హక్కులు, న్యాయ పరిరక్షణ, ప్రజల్లో అవగాహన పెంపొందించడం, వినియోగదారుల సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం ఆసరా సంస్థ దేశవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు మధ్యవర్తిత్వం ద్వారా వివాదాల పరిష్కారానికి, బాధితులకు న్యాయం అందించేందుకు కృషి చేస్తోందని నిర్వాహకులు తెలిపారు. ప్రజలు కొనుగోలు చేసే ప్రతి వస్తువుకు తప్పనిసరిగా బిల్లు తీసుకోవడం, ప్యాకేజీపై ముద్రించిన గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్‌పీ)ని పరిశీలించడం, నాణ్యతలో లోపాలు లేదా ఇతర మోసాలు జరిగినప్పుడు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడం వంటి అంశాలపై అవగాహన పెంపొందించడం సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. వినియోగదారులు తమ హక్కులపై అవగాహన పెంచుకొని, మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా నిర్వాహకులు సూచించారు.

ఈ కార్యక్రమంలో ఆసరా జిల్లా అధ్యక్షుడు రంగు భరత్, ఉపాధ్యక్షుడు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

భూంపురం పాఠశాలల్లో డీఈఓ ఆకస్మిక తనిఖీ

- **విద్యా ప్రమాణాల మెరుగుదల, పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు సూచనలు**

అయిజ అక్టోబర్ 28 వుదయం ప్రతినిధి

గద్వాల జిల్లా విద్యాశాఖ అధికారి కె. విజయలక్ష్మి అయిజ మండలంలోని భూంపురం జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలలను సందర్శించి విద్యా ప్రమాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (FLN), AXL కార్యక్రమాల అమలు తీరు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, పదో తరగతి విద్యార్థుల ప్రగతి, పాఠశాల నిర్వహణను

క్షుణ్ణంగా సమీక్షించారు. పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సొంత నిధులతో పాఠశాల అభివృద్ధికి చేస్తున్న కృషిపై డీఈఓ సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న జెడ్పీహెచ్ఎస్ భూంపురం ప్రధానోపాధ్యాయుడు (ఎఫ్ఏసీ) ఎం. భీమేశ్వర్ రెడ్డిని అభినందించారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించి, విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళికతో బోధన సాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భూంపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. సుజాత పాల్గొన్నారు.

సురక్షిత్ బచ్పన్ అభియాన్‌లో భాగంగా బాలల భద్రతపై

న్యాయ అవగాహన కార్యక్రమాలు

సంగారెడ్డి వుదయం :
సురక్షిత్ బచ్పన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సంగారెడ్డి కార్యదర్శి శ్రీమతి బి. సౌజన్య గారు ఈరోజు ముత్తంగి మరియు ఇంద్రేశంలోని మహాత్మా జ్యోతిబా ఫూలే గురుకుల పాఠశాలల్లో న్యాయ అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు బాలల హక్కులు, భద్రత, రక్షణ మరియు బాలలపై జరిగే నేరాల నివారణపై అవగాహన కల్పించారు. ప్రతి బాలుడు, బాలిక సురక్షితమైన వాతావరణంలో విద్యను అభ్యసిస్తూ, గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి హక్కు కలిగి ఉన్నారని శ్రీమతి బి. సౌజన్య గారు తెలిపారు.ఈ సందర్భంగా గుడ్ టచ్ - బ్యాడ్ టచ్, బాలలపై లైంగిక వేధింపుల నివారణ, వ్యక్తిగత భద్రత, ఆన్‌లైన్ భద్రత మరియు బాలల హక్కులకు సంబంధించిన చట్టాల గురించి వివరించారు.ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినప్పుడు లేదా అసురక్షిత పరిస్థితులు ఎదురైనప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న అడ్వకేట్ మాణిక్ యాదవ్ పటాన్‌చెరు సబ్‌ఇన్‌స్పెక్టర్ శ్రీమతి సునీత గారు మరియు పాఠశాల ప్రిన్సిపాల్ బాలల రక్షణ, భద్రత మరియు సంక్షేమానికి సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించడంలో పాల్గొన్నారు. బాలలపై జరిగే హింస, వేధింపులు మరియు ఇతర నేరాలను నివారించడంలో న్యాయ వ్యవస్థ, పోలీసు శాఖ, విద్యాసంస్థలు మరియు తల్లిదండ్రుల సమన్వయం ఎంతో ముఖ్యమని వివరించారు.అవసరమైన బాలలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందించే ఉచిత న్యాయ సహాయం మరియు న్యాయపరమైన మార్గదర్శకత్వం గురించి కూడా తెలియజేశారు. విద్యార్థులు తమ హక్కులను తెలుసుకొని, ఏదైనా సమస్య ఎదురైనప్పుడు సరైన సహాయం పొందేందుకు ముందుకు రావాలని సూచించారు.బాలలకు సురక్షితమైన విద్యా వాతావరణాన్ని కల్పించడం, వారి హక్కులను పరిరక్షించడం మరియు ప్రతి బాలుడికి భద్రతతో కూడిన బాల్యాన్ని అందించడం ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఏడవ నిజాం నిర్మించిన గంగ కత్వ కాలువ ఆధునీకరణ కు

37 కోట్ల నిధులు తీసుకువచ్చిన జగ్గారెడ్డి, నిర్మల

- **నవంబర్ నెలలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహా, వివేక్ ల చేతుల మీదుగా పనులకు శంకుస్థాపన**
- **2028 జూన్ నెలలో సీఎం రేవంత్ రెడ్డి తో ప్రారంభం**
- **నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహా, వివేక్ లకు కృతజ్ఞతలు**
- **పనులు పూర్తయితే 11 గ్రామాల్లోని 3,300 ఎకరాల ఆయకట్టుకు ప్రయోజనం**
- **రైతుల అవసరాలే లక్ష్యంగా త్వరితగతిన పనులు చేపట్టాలి**
- **గంగ కత్వ కాలువను పరిశీలించి డైవ్ చేసి ఈత కొట్టిన జగ్గారెడ్డి**

సంగారెడ్డి జిల్లాప్రతినిధి, వుదయం
గంగకత్వ ప్రాజెక్టు, కాలువ ఆధునీకరణకు రూ.37 కోట్లు మంజూరయిన నేపథ్యం లో జగ్గారెడ్డి గంగ కత్వ ప్రాజెక్ట్ ను పరిశీలించారు. సదాశివపేట మండలం సూరారం గ్రామంలోని గంగ కత్వ ప్రాజెక్టును పరిశీలించిన ఆయన, సాగునీటి శాఖ అధికారులు, ఆయకట్టు గ్రామాల రైతులు, స్థానిక నాయకులతో సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. గంగకత్వ కాలువ పరిధిలోని 11 గ్రామాల్లో 3,300 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. సదాశివపేట మండలంలో సుమారు 16 కిలోమీటర్ల మేర విస్తరించిన కాలువకు 28 చెరువులు అనుసంధానమై ఉన్నాయని చెప్పారు. కాలువను ఆధునీకరించి, చివరి ఆయకట్టు వరకు నీరందించడమే లక్ష్యమని పేర్కొన్నారు.
ఆధునీకరణ నిధుల కోసం రెండేళ్ల క్రితం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరానని, అధికారులతో పలుమార్లు సమీక్షలు నిర్వహించానని తెలిపారు. రూ.37 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తాను ఎమ్మెల్యేగా లేకపోయినా రైతుల ప్రయోజనాల కోసం నిధులు తీసుకువచ్చానన్నారు. ఏడో నిజాం కాలంలో నిర్మించిన కాలువను తిరిగి ఆధునీకరించే అవకాశం రావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పనులు చేపట్టాలని, కాంట్రాక్టర్ల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వొద్దని అధికారులకు సూచించారు

లీకేజీల నివారణకు చర్యలు

కాలువ లైనింగ్, దెబ్బతిన్న భాగాల మరమ్మతులు, పక్కలకు సీసీ లైనింగ్, తూముల పునరుద్ధరణ, వంతెనల వెడల్పు పెంపు తదితర పనులపై సమీక్షించారు. కాలువ పొడవునా తనిఖీలకు ఉపయోగపడే దారిని పునరుద్ధరించాలని సూచించారు. కాలువ నీరు చెరువులకు సక్రమంగా చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వర్షాకాలంలో కాలువలు తెగిపోతున్నాయని చందాపూర్ గ్రామస్థులు తెలిపారు. మిలిగిరిపేట పరిధిలో వాగుల్లో పూడిక తొలగించాలని కోరారు. కాలువలు సరిగా లేక నీరు గ్రామంలోకి

వస్తోందని పొట్పల్లి వాసులు వివరించారు. ప్రాజెక్టు చివరన ఉన్న తమ గ్రామానికి నీరందడం లేదని యెన్కేపల్లి రైతులు తెలిపారు. ప్రధాన కాలువ తూము వద్ద లీకేజీలతో నీరు వృథా అవుతోందని చెప్పారు. ఆత్మకూరు పరిధిలో లీకేజీలను అరికట్టి చెరువులకు నీరు మళ్లించాలని, అంకెన్‌పల్లిలో కాలువ ఆకృతి సవరణ, గట్ల బలోపేతం పనులు చేపట్టాలని స్థానికులు కోరారు. సమస్యలను పరిశీలించి అవసరమైన పనులకు అంచనాలు రూపొందించాలని జగ్గారెడ్డి అధికారులకు సూచించారు.
వాగుపై ఏడు చెక్‌డ్యామ్‌లకు ప్రతిపాదనలు
గంగకత్వ ఆధునీకరణకు అదనంగా వాగుపై ఏడు చోట్ల చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయని జగ్గారెడ్డి తెలిపారు. వికారాబాద్ జిల్లా మర్పల్లి ప్రాంతం నుంచి గంగకత్వకు వచ్చే వాగును అభివృద్ధి చేస్తే నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వాగు, ప్రాజెక్టులో పూడిక తొలగింపునకు ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. ప్రాజెక్టులో ఆరు నుంచి ఏడు అడుగుల మేర పూడిక తొలగించే అవకాశం ఉందని అధికారులు తెలపగా, సాంకేతికంగా ఎంతవరకు సాధ్యమో పరిశీలించాలని కోరారు.

కొల్కూరు-నిజాంపూర్ మధ్య మంజీరా బ్యాక్‌వాటర్‌తో పంటలు మునుగుతున్నాయని రైతులు తెలిపారు. అక్కడ చెక్‌డ్యామ్ నిర్మించాలని కోరగా, సాధ్యాసాధ్యాలను పరిశీలించి అంచనాలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.
2028 నాటికి పనుల పూర్తికి ప్రణాళిక దీపావళి తర్వాత శంకుస్థాపన జరిగేలా చూస్తామని జగ్గారెడ్డి తెలిపారు. డిసెంబర్‌లోపు టెండర్ల ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్లు చెప్పారు. 2028 నాటికి పనులు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని, పనులు పూర్తయ్యాక ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించేందుకు కృషి చేస్తానన్నారు. డిసెంబర్‌లో మరోసారి ప్రాజెక్టును సందర్శించి పనుల పురోగతిని సమీక్షిస్తానని తెలిపారు.

నిధులు, పనుల మంజూరు కోసం కృషి చేయడమే తన బాధ్యతని, శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలను అధికారులు ప్రోటోకాల్ ప్రకారం నిర్వహిస్తారని పేర్కొన్నారు. చిన్నప్పటి నుంచి ఈ వాగుతో తనకు అనుబంధం ఉందని, తన భార్య స్వగ్రామం తాటిపల్లి కావడంతో తరచూ ఇక్కడికి వచ్చేవాడినని గుర్తుచేసుకున్నారు. పర్యటన సందర్భంగా గంగకత్వ కాలువలో జగ్గారెడ్డి ఈత కొట్టారు.

బాలల రక్షణకు పోక్సో చట్టంపై అవగాహన

- **గద్వాల్‌లో మూడు పాఠశాలల్లో 'సురక్షిత్ బచ్పన్ అభియాన్' కార్యక్రమాలు**
- **చట్టాన్ని తెలుసుకోండి – బాల్యాన్ని రక్షించండి**

గద్వాల అక్టోబర్ 28
వుదయం కరస్పాండెంట్
బాలలపై లైంగిక నేరాల నివారణ, హక్కుల పరిరక్షణ, సైబర్ భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు జోగులాంబ గద్వాల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం గద్వాల్ పట్టణంలోని విశ్వభారతి హైస్కూల్, లోపాముద్ర అగస్త్య హైస్కూల్, ఎస్.ఆర్. విద్యానికేతన్ పాఠశాలల్లో 'సురక్షిత్ బచ్పన్ అభియాన్' కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోక్సో చట్టం-2012, బాలల హక్కులు, చట్టపరమైన రక్షణ, సైబర్ నేరాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. నిష్కా పాత్రుడు మాట్లాడుతూ, ప్రతి చిన్నారికి భయంలేని, సురక్షితమైన బాల్యాన్ని అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. బాలలపై లైంగిక వేధింపులు, ఇతర నేరాల నుంచి రక్షణ కల్పించేందుకు పోక్సో చట్టం అమల్లో ఉందని

వివరించారు. పిల్లలు ఎలాంటి అనుచిత ప్రవర్తన లేదా వేధింపులకు గురైనా భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా విశ్వసనీయ పెద్దలకు తెలియజేయాలని సూచించారు. లోపాముద్ర అగస్త్య హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో న్యాయ సహాయ రక్షణ న్యాయవాది బి. శ్రీనివాసులు మాట్లాడుతూ, అర్హులైన వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని తెలిపారు. బాలల హక్కులకు భంగం కలిగినప్పుడు చట్టపరమైన సహాయం పొందవచ్చని వివరించారు. డీసీపీఓ నరసింహులు బాలల రక్షణకు సంబంధించిన అంశాలను వివరించి, పిల్లల సమస్యలను గుర్తించినప్పుడు సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఎస్.ఆర్. విద్యానికేతన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సైబర్ వారియర్స్ సభ్యులు రమేష్ ఆచారి, రియాజ్ విద్యార్థులకు ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాల సురక్షిత వినియోగంపై అవగాహన కల్పించారు. అపరిచితుల నుంచి వచ్చే అనుమానాస్పద సందేశాలు, లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారం, ఫొటోలు, పాస్‌వర్డ్‌లను ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. చైల్డ్‌లైన్ సభ్యురాలు పద్మ బాలల రక్షణ వ్యవస్థలు, ఆపదలో ఉన్న పిల్లలకు అందించే సహాయంపై వివరించగా, భరోసా బృందం సభ్యురాలు శిరీష బాధిత పిల్లలకు అందించే రక్షణ, మద్దతు సేవల ప్రాధాన్యతను వివరించారు. విశ్వభారతి హైస్కూల్ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ త్యాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ చంద్రకళ, లోపాముద్ర అగస్త్య హైస్కూల్‌లో ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, ఎస్.ఆర్. విద్యానికేతన్‌లో ప్రిన్సిపాల్ సునీతతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. బాలలపై నేరాలను అరికట్టాలంటే చట్టాలపై అవగాహనతో పాటు వాటి అమలుపై అప్రమత్తత అవసరం. వేధింపులపై మౌనం కాకుండా ధైర్యంగా ఫిర్యాదు చేయడం, బాధితులకు అండగా నిలవడం ద్వారా ప్రతి చిన్నారికి సురక్షితమైన బాల్యాన్ని అందించవచ్చని ఈ కార్యక్రమాల ద్వారా సందేశమిచ్చారు.

సాగు భూమిని కాపాడుకోవాలి..

- **సేంద్రియ వ్యవసాయం వైపు అడుగులు వేయాలి**
- **రైతులకు సహాయ వ్యవసాయ సంచాలకులు శివనాగిరెడ్డి సూచన**

అయిజ అక్టోబర్ 28
వుదయం ప్రతినిధి
సాగు భూమి సారాన్ని కాపాడుకుంటూ భవిష్యత్ తరాలకు సారవంతమైన నేలను అందించేందుకు రైతులు సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలని అలంపూర్ సహాయ వ్యవసాయ సంచాలకులు జి. శివనాగిరెడ్డి సూచించారు. బుధవారం చిన్న తాండ్రపాడు గ్రామంలో నిర్వహించిన 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. రసాయన ఎరువుల వినియోగాన్ని క్రమంగా తగ్గించి, నేల సారాన్ని పరిరక్షించే పద్ధతులను అవలంబించాలని రైతులకు సూచించారు. వానాకాలం పంటల అనంతరం మిగిలే పంట అవశేషాలను నేలలో కలియదున్నాలని లేదా పశువుల మేతగా వినియోగించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ వాటిని తగలబెట్టరాదని స్పష్టం చేశారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల నేలలోని సారవంతమైన పదార్థాలు దెబ్బతినే ప్రమాదం ఉందని వివరించారు. అనంతరం నౌరోజీ క్యాంపు గ్రామంలో వరి పంటకు సంబంధించి క్షేత్ర పాఠశాల కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి పంటలో కనిపించే వివిధ తెగుళ్లు, పురుగుల లక్షణాలు, వాటి నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. పంటలను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ, అవసరమైన సమయంలో తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో అయిజ మండల వ్యవసాయ అధికారి కె. జనార్దన్, చిన్న తాండ్రపాడు క్లస్టర్ వ్యవసాయ విస్తరణాధికారులు విజయకుమార్, వేణు సోంపురం, వ్యవసాయ విస్తరణాధికారి నవీన్‌కుమార్, గ్రామ రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.
నేల ఆరోగ్యమే వ్యవసాయానికి పునాది. రసాయనాల వినియోగాన్ని తగ్గించి, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించడం ద్వారా భూమి సారాన్ని కాపాడుకోవడంతోపాటు భవిష్యత్ వ్యవసాయానికి భరోసా కల్పించాలని అధికారులు పిలుపునిచ్చారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు

భారీ అవగాహన ర్యాలీ

- **నషా ముక్త్ భారత్' నినాదంతో విద్యార్థుల ప్రతిజ్ఞ**

గద్వాల, అక్టోబర్ 28
వుదయం కరస్పాండెంట్
యువతను మాదకద్రవ్యాల వ్యసనాల నుంచి కాపాడుతూ, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గద్వాల పట్టణంలో బుధవారం 'నషా ముక్త్ భారత్' అవగాహన ర్యాలీ నిర్వహించారు. వివిధ జూనియర్ కళాశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొని మాదకద్రవ్యాల నిర్మూలనకు నినాదాలు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సూచనల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని కృష్ణవేణి చౌరస్తా వద్ద జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ అయ్యపు రెడ్డి, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యుడు రమేష్ పర్యవేక్షణలో ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే మంచి అలవాట్లు పెంపొందించుకోవాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు. వ్యసనాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. కృష్ణవేణి చౌరస్తా నుంచి ప్రారంభమైన ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, రాజీవ్ మార్గ్ మీదుగా పాత బస్టాండ్ సమీపంలోని కూడలి వరకు సాగింది. అనంతరం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి సునంద, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి హృదయరాజు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. క్రమశిక్షణతో జీవిస్తూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి లక్ష్యసాధనకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. అనంతరం రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ అయ్యపు రెడ్డి విద్యార్థులతో మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ తహేర్, ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ కృష్ణయ్య, తైక్వాండో కరాటే మాస్టర్ శ్రీహరి, మహేష్ నాయుడు, నరసింహయ్య శెట్టి, రాజశేఖర్, శ్రీకృష్ణ, రెడ్ క్రాస్ కార్యనిర్వాహక సభ్యులు, సంక్షేమ శాఖ సిబ్బంది, కళాశాలల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.వ్యసనాలకు దూరంగా ఉండటమే యువత ఉజ్వల భవిష్యత్తుకు పునాది. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు సమష్టిగా బాధ్యత తీసుకోవాలని ఈ ర్యాలీ సందేశమిచ్చింది.

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేలా గ్రామీణ పనులపై ప్రత్యేక దృష్టి

- **గ్రామీణ ఉపాధి, నీటి భద్రత, పశుసంపద సంరక్షణకు ప్రాధాన్యత**
- **వీబీ–జీ రామ్ జీ పనుల అమలులో సర్పంచులు కీలకం**
- **నిర్మాణంలో ఉన్న గ్రామీణ భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలి – మంత్రి సీతక్క**

గద్వాల, అక్టోబర్ 28
వుదయం బ్యూరో
ఎల్‌నినో ప్రభావంతో గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధికి ఇబ్బందులు తలెత్తకుండా, ఉపాధి కల్పన, నీటి భద్రత, పశుసంపద సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ వీబీ–జీ రామ్ జీ పనులను ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అధికారులను ఆదేశించారు.
బుధవారం హైదరాబాద్ నుంచి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి జిల్లాస్థాయి, మండలస్థాయి అధికారులు, ఐటీడీఏ పీఓలు, ఎంపీడీవోలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించి ఆర్థికంగా అండగా నిలవడంతోపాటు, నీటి వనరులను పరిరక్షించే పనులను వేగవంతం చేయాలని సూచించారు. గ్రామాల్లో కూలీలను సమీకరించి పనులు సక్రమంగా జరిగేలా సర్పంచులు కీలక పాత్ర పోషించాలని తెలిపారు.



మేట్‌లను గుర్తించి అవసరమైన శిక్షణ అందించడం ద్వారా పనుల నిర్వహణలో వారిని సమర్థవంతంగా భాగస్వాములను చేయాలన్నారు.
నీటి వనరుల పరిరక్షణకు ప్రాధాన్యత
ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని చెరువులు, కాలువల్లో పూడిక తొలగింపు పనులు చేపట్టి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని మంత్రి సూచించారు. ఇందుకోసం నీటిపారుదల శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి గ్రామానికి ఊటకుంట, ప్రతి పంటకు నీటి కుంట నిర్మించే దిశగా చర్యలు చేపట్టి వర్షపు నీటిని నిల్వ చేయడంతోపాటు భూగర్భ జలాలను పెంపొందించాలని ఆదేశించారు.

పశుసంపద సంరక్షణకు ముందస్తు చర్యలు
ఎండల ప్రభావంతో పశువులకు నీరు, పశుగ్రాసం కొరత ఏర్పడకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని మంత్రి తెలిపారు. గ్రామాల్లో పశువుల కోసం నీటి తొట్టెలు ఏర్పాటు చేసి నిరంతరం నీటి లభ్యత ఉండేలా చూడాలన్నారు. వీబీ–జీ రామ్ జీ పథకం కింద పశుగ్రాస సాగును ప్రోత్సహిస్తూ ఎకరాకు రూ.14 వేల ఆర్థిక సహాయం అందించే అంశంపై

రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.
భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి
జిల్లాలో నిర్మాణంలో ఉన్న గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ, విలేజ్ ఆర్గనైజేషన్ భవనాల పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. వీబీ–జీ రామ్ జీ పథకం కింద చేపట్టే పనులను స్పష్టమైన ప్రణాళికతో, పూర్తి పారదర్శకతతో అమలు చేయాలని స్పష్టం చేశారు.
అనంతరం గ్రామాల్లో వీబీ–జీ రామ్ జీ పథకం కింద ఉత్తమ పనులు చేపట్టి విజయవంతంగా అమలు చేస్తున్న సర్పంచులు, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులతో మాట్లాడి వారి కృషిని మంత్రి అభినందించారు.
ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి పనులను నిర్దేశిత లక్ష్యాల మేరకు ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. నిర్మాణంలో ఉన్న భవనాల పనులను వేగవంతం చేసి నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ముషాయిదా బేగం, డీపీఓ శ్రీకాంత్, వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్, మిషన్ భగీరథ ఈఈలు శ్రీధర్‌రెడ్డి, పరమేశ్వరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

టీకాలకు దూరమైన గర్భిణులు, చిన్నారులను గుర్తించి వ్యాక్సినేషన్ చేయించాలి

- **మిషన్ ఇంద్రధనుష్ అమలుపై డీఐఓ డాక్టర్ అస్గర్ అలీ ఆకస్మిక తనిఖీలు**

ధరూర్ అక్టోబర్ 28
వుదయం కరస్పాండెంట్
అర్హులైన గర్భిణులు, చిన్నారులందరికీ నిర్దిష్ట షెడ్యూల్ ప్రకారం టీకాలు అందించాలని జిల్లా టీకాల అధికారి (డీఐఓ) డాక్టర్ అస్గర్ అలీ వైద్య సిబ్బందికి సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ సంధ్యా కిరణ్మయి ఆదేశాల మేరకు ధరూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)తో పాటు ధరూర్, మన్నాపూర్ సబ్ సెంటర్లను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమం అమలు తీరును, టీకాల కార్యక్రమాల పురోగతిని, చిన్నారులకు అందిస్తున్న వ్యాక్సినేషన్ సేవలను పరిశీలించారు. టీకాల రికార్డులు, సంబంధిత రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఇప్పటి వరకు టీకాలు తీసుకోని, మధ్యలో టీకాలు ఆపేసిన గర్భిణులు, చిన్నారులను గుర్తించి వారికి తప్పనిసరిగా టీకాలు అందించాలని ఆదేశించారు.మిషన్ ఇంద్రధనుష్ లక్ష్యాలను సమర్థవంతంగా సాధించేందుకు వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, అర్హులైన లబ్ధిదారులెవరూ టీకాలకు దూరం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ తనిఖీల్లో డీపీఎల్ఎం నరేంద్రబాబు, ఇన్‌చార్జి జిల్లా మీడియా విస్తరణ అధికారి హీర్యానాయక్, పీహెచ్ఎన్ తిర్మలరాణి పాల్గొన్నారు.

ధార్మిక చింతనతోనే ప్రశాంత జీవనం..

- **బసవ కళ్యాణ్ పీఠాధిపతి మాధవానంద సరస్వతి.....**

(వూదయం) పెద్దశంకరంపేట ప్రతినిధి అక్టోబర్ 28.
ధార్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని బసవకల్యాణ్ పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి అన్నారు. మండలంలోని కొప్పోల్ ఉమా సంగమేశ్వర స్వామి ఆలయంలో సహజానంద సరస్వతి స్వామి 16వ వార్షిక ఆరాధన సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని భక్తులకు ప్రవచించారు. తరచూ ఆలయాలను సందర్శిస్తూ ధార్మిక భావనలు పెంపొందించుకోవాలని,

సర్వప్రాణుల పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నాచారం పీఠాధిపతి మధుసూదనానంద సరస్వతి స్వామి, వేద పండితుడు నరహరి శర్మ, అర్చక సంఘం ఉపాధ్యక్షులు గుడి చంద్రశేఖర్, రాఘవేంద్ర చారి, వేద పండితులు, ఆలయ పూజారి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

యాలాల అక్టోబర్ 28
వుదయం ప్రతినిధి:-
యాలాల మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం షాదీ ముబారక్ కళ్యాణ లక్ష్మి చెక్కులను తాండూరు ఎమ్మెల్యే మన రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ నిరుపేద యువతి వివాహాలకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకం ఎంతగానో ఉపయోగపడుతున్నారు. అరులైన లబ్ధిదారులకు చెక్కులు పంపించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ గాయత్రి, ఎంపీడీవో శ్రీనిజ, వికారాబాద్ జిల్లా మత్స్య సహకార సంఘం చైర్మన్ శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహిపాల్ యాదవ్, పిఏసిఎస్ చైర్మన్ అనిల్ కుమార్ గుప్తా,
తాండూర్ డివిజన్ సర్ కన్వీనర్ కర్ణం పురుషోత్తం రావు, మాజీ మండల అధ్యక్షులు భీమప్ప, కాంగ్రెస్ నాయకులు హనుమంతు ముదిరాజ్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు

వుదయం

రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలి

- ధాన్యం కొనుగోళ్లలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్యే చింత ప్రభాకర్
- రైతులకు మద్దతు ధర, సకాలంలో చెల్లింపులు అందించాలి

కొండాపూర్ వుదయం

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేసి, వారికి న్యాయంగా దక్కాల్సిన మద్దతు ధర అందించాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అధికారులను కోరారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరగకుండా, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు.

సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలోని మల్కాపూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం మారేపల్లి-తాగర్‌పల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూడా ప్రారంభించారు. తరువాత సంగారెడ్డి మండలం హనుమాన్ నగర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ధాన్యం సేకరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు.

రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు రోజుల తరబడి వేచి ఉండే పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం, తేమ శాతం నిర్ధారణ, గన్నీ సంచుల సరఫరా, ధాన్యం రవాణా, టార్పాలిన్ల వంటి అవసరమైన సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

సన్నవడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించిన మేరకు రైతులకు ఆ ప్రయోజనం అందించాలని చింత ప్రభాకర్ డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించడం వారి హక్కు అని, కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన నగదును రైతుల ఖాతాల్లో సకాలంలో జమ చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.రైతులు దళారుల బారిన పడకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ, రైతులకు అన్యాయం జరగకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

సంగారెడ్డిలో బీజేపీ మేధావుల సమావేశం

దేశాభివృద్ధిలో మేధావుల పాత్ర కీలకం

సంగారెడ్డి వుదయం :

పట్టణంలోని కుందనం బ్యాంకెట్ హాల్‌లో బీజేపీ సంగారెడ్డి అసెంబ్లీ మేధావుల సమావేశం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి నరేన్ దేశ్ పాండే ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, దేశ అభివృద్ధి, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, సమాజంలో మేధావుల పాత్ర వంటి అంశాలపై చర్చించారు. దేశాభివృద్ధిలో భాగస్వాములు కావడంతో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో మేధావులు కీలక పాత్ర పోషించాలని సమావేశంలో ప్రాధాన్యతనిచ్చారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి సంగప్ప, కొవ్వూరు సంగమేశ్వర్, ఓదెల మాణిక్ రావు, కసిని వాసు, దోమల విజయ్ కుమార్‌తో పాటు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, వివిధ మోర్చాల నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్ నినో ప్రభావంతో నీటి ఎద్దడి ముప్పు పొదుపే ప్రధానం : ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట, అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి) :

ఎల్ నినో ప్రభావం కారణంగా ఈ ఏడాది ఎండలు ముందుగానే తీవ్రం కావడం, వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం ఉందని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. బుధవారం అచ్చంపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎల్ నినో కారణంగా రానున్న రోజుల్లో తాగునీటి ఎద్దడి పెరిగే అవకాశం ఉందని, ప్రజలు తాగునీటిని, సాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడాలని సూచించారు.

ప్రతి చుక్క నీటిని ఒడిసి పట్టుకోవాలన్నారు.ఎండల తీవ్రత పెరిగితే విద్యుత్ డిమాండ్ కూడా పెరుగుతుందని, అనవసరంగా లైట్లు,మోటార్లు వేయకుండా విద్యుత్ ను ఆదా చేయాలని కోరారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.మిషన్ భగీరథ పైప్ లైన్లు,బోర్లు,హ్యాండ్ పంపులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి మరమ్మతులు చేయాలని, వేసవి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. వేసవిలో నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాలని, ప్రతి గ్రామంలో నీటి సరఫరాను పర్యవేక్షించాలని ఎంపీడీఓ, ఆర్ డబ్ల్యూఎస్ అధికారులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని సర్పంచులకు కోరారు.

ఈ సమావేశంలో ఆర్ డబ్ల్యూఎస్ డీఈ హేమలత, పంచాయతీరాజ్ డీఈ చంద్రకళ, ఎంపీడీఓ అవిందర్ రావు, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎల్ నినో ఎఫెక్ట్ రైతులకు అధికారుల కీలక సూచనలు వరి వద్దు, కూరగాయలే ముద్దు

అచ్చంపేట, అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి) :

నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలో ఎల్ నినో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాలు అడుగంటుతున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు కీలక సూచనలు చేశారు. వరి, మొక్కజొన్న లాంటి ఎక్కువ నీరు తాగే పంటలకు బదులు తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని పిలుపునిచ్చారు.

బుధవారం అచ్చంపేట మండల కేంద్రంలోని సమావేశ మందిరంలో తెలంగాణ వ్యవసాయ శాఖ Recognition of Prior Learning and Training (RPL) కార్యక్రమంలో భాగంగా రైతు అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం కారణంగా వ్యవసాయం కుంటుపడిందని, వర్షపు నీటిపై ఆధారపడి పంటలు వేస్తే నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వాడుకుంటూ లాభసాటి వ్యవసాయం చేయాలని, ప్రతి చుక్క నీటిని ఒడిసి పట్టుకోవాలని సూచించారు. రైతులు ఇప్పటికిప్పుడు వరి, మొక్కజొన్న లాంటి అధిక నీటి వినియోగ పంటలు వేయకుండా వాటి స్థానంలో కూరగాయలు, పప్పు దినుసులు, తక్కువ నీటితో పండే పంటల వైపు మొగ్గు చూపాలని కోరారు.

ప్రత్యామ్నాయ పంటలకు ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని, విత్తనాలు, ఎరువులు, సాంకేతిక పరిజ్ఞానంపై ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఏడీఏ (ఆర్) అచ్చంపేట జి.చంద్రశేఖర్, ఎంవీఓ కృష్ణయ్య, నర్సయ్య నాయక్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసాచారి, ఏఈఓ ప్రేమ్, బీటీఎం సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో రైతులు హాజరై సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

ప్రభుత్వ ధాన్యం దుర్వినియోగం ఆరోపణలపై ఈ డి కి ఫిర్యాదు

- ప్రభుత్వ ధాన్యం దుర్వినియోగం ఆరోపణలపై ఈ డి కి ఫిర్యాదు
- రూ3.64 కోట్ల విలువైన ధాన్యం కొరతపై సమగ్ర విచారణ జరపాలి
- టీ ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్

దామరగిద్ద అక్టోబర్ 28(వుదయం ప్రతినిధి)

నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలంలోని మల్లికార్జున రైస్ మిల్‌కు సంబంధించిన ప్రభుత్వ ధాన్యం నిల్వలలో భారీ కొరత ఏర్పడినట్లు ఎఫ్ ఐ ఆర్ లో పేర్కొన్న అంశాలపై సమగ్ర విచారణ జరపాలని కోరుతూ తెలంగాణ రక్షణ సేన నారాయణపేట జిల్లా అధ్యక్షుడు, సామాజిక కార్యకర్త గవినోళ్ల శ్రీనివాస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ హైదరాబాద్ జోనల్ కార్యాలయ జాయింట్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.దామరగిద్ద పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 149/2026తో 15 అక్టోబర్ 2026న నమోదైన ఎఫ్ ఐ ఆర్ వివరాల ప్రకారం, రబీ 2022-23 సీజన్‌కు సంబంధించిన ప్రభుత్వ ధాన్యంలో 957.760 మెట్రిక్ టన్నుల కొరత, అంటే 23,944 బస్తాలకు సమానమైన ధాన్యం లెక్కల్లో వ్యత్యాసం ఉన్నట్లు పేర్కొన్నారని శ్రీనివాస్ తెలిపారు. ఈ వ్యవహారంలో సుమారు రూ.3,64,84,564 మేర ఆర్థిక నష్టం జరిగినట్లు ఎఫ్ ఐ ఆర్ లో ప్రస్తావించారని పేర్కొన్నారు. ఈ ఆరోపణల వెనుక ఉన్న వాస్తవాలను వెలికితీసేందుకు సంబంధిత ధాన్యం నిల్వల రికార్డులు, తనిఖీ నివేదికలు, బ్యాంకు లావాదేవీలు, ఆస్తుల కొనుగోళ్లు, రిజిస్ట్రేషన్ పత్రాలను చట్టప్రకారం పరిశీలించాలని ఈ డి ని కోరినట్లు ఆయన తెలిపారు.ఆరోపణలతో సంబంధం ఉన్న నిధులను ఉపయోగించి కుటుంబ సభ్యులు లేదా ఇతర వ్యక్తుల పేర్లపై ఆస్తులు కొనుగోలు చేశారా, నిధులు బదిలీ చేశారా అనే అంశాలను కూడా ఆధారాల మేరకు విచారించాలని ఫిర్యాదులో కోరినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ధాన్యం దుర్వినియోగం ద్వారా నేరపూరిత ఆదాయం సమకూరినట్లు, మనీలాండరింగ్‌కు సంబంధించిన చట్టపరమైన అంశాలు వర్తిస్తున్నట్లు ఆధారాలు లభిస్తే, చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ ఆస్తులు, ప్రజాధనాన్ని కాపాడటం అధికారుల బాధ్యత

ప్రభుత్వ ధాన్యం రైతుల కష్టానికి, ప్రజాధనానికి సంబంధించిన ఆస్తి అని, ఇలాంటి వ్యవహారాల్లో పారదర్శకమైన విచారణ జరగాలని గవినోళ్ల శ్రీనివాస్ అన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై కుటుంబ సంబంధాల ఆధారంగా కాకుండా, లభించే ఆధారాలు మరియు వర్తించే చట్టాల ప్రకారమే చర్యలు తీసుకోవాలని కోరారు .ఈ ఫిర్యాదుపై సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించి, తమ పరిధిలో విచారణ చేపట్టాలని లేదా అవసరమైతే సంబంధిత అధికార సంస్థకు పంపించాలని విజ్ఞప్తి చేసినట్లు ఆయన తెలిపారు.

ఈ ఫిర్యాదుపై సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించి, తమ పరిధిలో విచారణ చేపట్టాలని లేదా అవసరమైతే సంబంధిత అధికార సంస్థకు పంపించాలని విజ్ఞప్తి చేసినట్లు ఆయన తెలిపారు.

అర్జునుడి పక్షి కన్నులా... మీ లక్ష్యం 'పోలీస్ ఉద్యోగమేకావాలి!

- పోటీ పరీక్షల ఉచిత మెటీరియల్ పంపిణీలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి
- 'ఇది ఉచితం కాదు... మీ ఫీజు నేనే కడుతున్నా..
- అభ్యర్థులకు తాండూరు ఎమ్మెల్యే దిశానిర్దేశం

తాండూరు అక్టోబర్ 28 ఉదయం ప్రతినిధి

"రాబోయే ఎస్ఐ,కానిస్టేబుల్ పరీక్షల వరకు మీకు ఉద్యోగం తప్ప మరేదీ కనిపించకూడదు. మహాభారతంలో అర్జునుడికి పక్షి కన్ను మాత్రమే కనిపెట్టినట్లు... మీ లక్ష్యం అంత స్పష్టంగా ఉండాలి" అని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అభ్యర్థులకు పిలుపునిచ్చారు. బుధవారం తాండూరు పట్టణంలోని విలేమున్ హైస్కూల్‌లో 'బిఎమ్ఆర్ ఫౌండేషన్' అధ్వర్యంలో ఉచితంగా శిక్షణ పొందుతున్న 300 మంది నిరుద్యోగ అభ్యర్థులకు తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారితో కలసి అయన పోటీ పరీక్షల ఉచిత స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. నిరుపేద యువతకు ఉచిత శిక్షణతో పాటు మెటీరియల్ అందిస్తూ, గతంలో జాబ్ మేళాల ద్వారా ఉపాధి కల్పించిన బిఎమ్ఆర్ ఫౌండేషన్ సేవా దృక్పథాన్ని, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి కృషిని ప్రత్యేకంగా కొనియాడారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సమాజానికి,జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.సమయం బంగారం కంటే విలువైంది - ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి.అనంతరం తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అభ్యర్థులను ఉద్దేశించి ఎంతో స్ఫూర్తిదాయకంగా మాట్లాడారు. వారి ప్రసంగంలోని ముఖ్యమైన అంశాలు: * 'ఉచితం' అనుకోకండి - పట్టుదలతో చదవండి: "దీన్ని ఉచిత కోచింగ్ అని పిలవడం మానేయండి. ఉచితం అనగానే నిర్లక్ష్యం వస్తుంది. పేద విద్యార్థులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో మీరు కట్టాల్సిన ఫీజును నేనే చెల్లిస్తున్నాను. కాబట్టి సొంత డబ్బులు కట్టి చదువుతున్నామనే తీవ్రమైన పట్టుదలతో శ్రమించి ఉద్యోగం సాధించాలి. ఖరీదైన పుస్తకాలు, పెద్ద కోచింగ్ సెంటర్లు లేకపోయినా మీలోని పట్టుదలే మీ భవిష్యత్తును నిర్ణయిస్తుంది." * ఆరు నెలలు సోషల్ మీడియాకు దూరం: "ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు కచ్చితంగా తరగతులకు హాజరు కావాలి. రీల్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌ల కోసం సమయం వృథా చేయకుండా కొన్ని నెలల పాటు ఫోన్లు పక్కన పెట్టండి. ఈ 6 నెలలు కష్టపడితే మీ జీవితం బాగుపడుతుంది, మీ తల్లిదండ్రులు సమాజంలో తలెత్తుకుని తిరుగుతారు. సిల్లీ కారణాలతో దుమ్మా కొడితే శిక్షణ నుంచి తొలగించి వేరే వాళ్లకు అవకాశం ఇస్తాం." * గ్రౌండ్ శిక్షణ, ఫైనల్ ఎగ్జామ్ దాకా బిఎమ్ఆర్ అండ: "ఇప్పటికే 9 వారాలుగా వీక్లీ గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తున్నాం. మాక్ టెస్టుల్లో మార్కులు తగ్గితే నిరాశపడకుండా లోపాలు దిద్దుకోండి. నవంబర్ 29 (ఎస్ఐ), డిసెంబర్ 20 (కానిస్టేబుల్) తొలి పరీక్షల్లో క్వాలిపై అయిన అభ్యర్థులకు పీటీల ద్వారా మైదానంలో ఫిజికల్ టెస్ట్ (PT) శిక్షణ ఇప్పిస్తాం. ఆ తర్వాత జరిగే ఫైనల్ పరీక్షకు కూడా పూర్తి ఉచిత కోచింగ్ అందిస్తాం." * 2018 నాటి అనుభవం - స్ఫూర్తిగా నిలవాలి: "2018లో పరిగిలో 1,500 మందికి ఉచిత కోచింగ్ ఇస్తే ఎంతోమంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి స్థిర పడ్డారు. యూనిఫాం ధరించడం ఒక గౌరవం, బాధ్యత. రేపు మీరు కొలువు సాధించాక, మీలాగే కష్టపడే మరొక విద్యార్థికి స్ఫూర్తిగా నిలవాలి" అని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలోవికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ,వికారాబాద్ జిల్లా ఎస్పీస్నేహ మెహ్రా, వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధారాసింగ్,మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాలెద్ది మున్సిపల్ కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు

'జయమ్ము నిశ్చయమ్మురా' సీజన్2లో సందడి చేసిన ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్.. ఆకట్టుకుంటోన్న ప్రోమో

జీ5 తెలుగులో విలక్షణ నటుడు జగపతిబాబు హోస్ట్‌గా వ్యవహరిస్తున్న సెలబ్రిటీ టాక్ షో 'జయమ్ము నిశ్చయమ్మురా' సీజన్ 2కు అమేజింగ్ రెస్పాన్స్ వస్తోంది. ఈ సీజన్‌లో తొలి ఎపిసోడ్ సాయి పల్లవితో ప్రారంభమైన సంగతి తెలిసిందే. తర్వాత త్రివిక్రమ్ శ్రీనివాస్, థమన్ కాంబోలో సెకండ్ ఎపిసోడ్ వచ్చింది. ఇందులో నటుడు సునీల్ స్పెషల్ గెస్ట్‌గా కనిపించి అలరించారు. ఇప్పుడు మూడో ఎపిసోడ్‌లో ఆంధ్ర ప్రదేశ్ ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక అతిథిగా పాల్గొనడం ఆసక్తిక రంగా మారింది. దీనికి సంబంధించిన ప్రోమోవిడుదలైంది.. చూస్తుంటే ఇంటర్వ్యూ చాలా ఫన్నీగా కనిపిస్తోంది. నారా లోకేశ్ పలు ఆసక్తికరమైన విషయాలను షేర్ చేసుకున్నారు..ఇంటర్వ్యూలో భాగంగా స్కూల్ రోజుల్లో తాను చేసిన అల్లరి పనులను నారా లోకేశ్ సరదాగా గుర్తుచేసుకున్నారు. టీచర్ల నుంచి ఎక్కువ పనిష్మెంట్లు అందుకున్నది తానేనని నవ్వుతూ చెప్పారు. దీంతో నిజంగానే అంత అల్లరి చేసేవారా? అని జగపతిబాబు ప్రశ్నించగా.. తన మామయ్య నందమూరి బాలకృష్ణతో పోటీ పడాల్సి వచ్చేదని లోకేశ్ చమత్కరించారు.పెళ్లి సమయంలో ఆసక్తికర ఘటనను గుర్తుచేసుకున్న లోకేశ్!తన పెళ్లి సమయంలో జరిగిన ఓ సరదా సంఘటనను నారా లోకేశ్ గుర్తుచేసుకున్నారు. ఓ రోజు తనను 'అల్లుడుగారు' అని పిలవడంతో.. ఏదో ఫిట్టింగ్ పెట్టడానికి ప్లాన్ చేస్తున్నారేమోనని వెంటనే అనుకున్నానని సరదాగా చెప్పారు.

బాలయ్యకు కూడా ఒకరంటే భయమే నా?సినిమాల్లో తన పవర్‌ఫుల్ పర్ఫార్మెన్స్‌తో, మాస్ ఇమేజ్‌తో ప్రేక్షకులను ఆకట్టుకునే నందమూరి బాలకృష్ణ గురించి నారా లోకేశ్ ఆసక్తికరమైన విషయం చెప్పారు. బాలయ్య తన జీవితంలో ఒకే ఒక్క వ్యక్తికి భయపడతారని చెబుతూ, ఈ విషయాన్ని సరదాగా ప్రస్తావించారు.

జిల్లాలోని పిల్లలమర్రి, కోయిల్‌సాగర్ తదితర పర్యాటక ప్రాంతాలలో పర్యాటక అభివృద్ధి పనులు

వేగవంత చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు.

మహబూబ్‌నగర్

జిల్లా లో మయూరి పార్క్,ఇతర పర్యాటక ప్రాంతాలనుఅభివృద్ధి చేసేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక ప్రకారం రూపొందించి, అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల మర్రి లో, కోయిల్ సాగర్ లో పర్యాటక అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్షించారు.

పిల్లలమర్రి ప్రాంతంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, జంతు ప్రదర్శనశాల, చేపల ఆక్వేరియం నిర్వహణ, సైన్స్ మ్యూజియం ఏర్పాటు, ఇతర పర్యాటక సౌకర్యాల మెరుగుదలపై సమీక్షించారు. పిల్లలమర్రిలో ఏర్పాటుచేయనున్న జంతు ప్రదర్శనశాల అభివృద్ధికి, అందుకు అవసరమైన సాంకేతిక అంశాలపై నిపుణులను సంప్రదించి ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ఆక్వేరియంలోని చేపలకు అవసరమైన ఆక్సిజన్ సరఫరా, నీటి నిర్వహణ, చేపల సంరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అలాగే పిల్లలమర్రి పర్యాటక ప్రాంత ప్రవేశ ద్వారం వద్ద ఆర్చ్ నిర్మాణానికి సంబంధించిన అంచనాలను వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా రూపొందించి, అవసరమైన వివరాలతో సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. మయూరి పార్కులో ఐకేపీ మహిళా శక్తి క్యాంటీన్ నిర్వహణకు సంబంధించి డీఆర్‌డీఓ ద్వారా ప్రతిపాదనలు పంపించాలని కలెక్టర్ ఆదేశించారు. మయూరి పార్కుతో పాటు ఇతర పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అటవీ శాఖ అధ్వర్యంలో చేపట్టిన, ప్రతిపాదించిన పర్యాటక అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు.అలాగే కోయిల్‌సాగర్ వద్ద ఇప్పటికే మంజూరైన అభివృద్ధి పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియను నీటి పారుదల శాఖ, విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (ఈ.డబ్లు. ఐ.సి) అధికారులతో సంప్రదించి వెంటనే ప్రారంభించి, పనులను త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. నీటిపారుదల శాఖ అధికారులు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ పనులను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి సంబంధించి ప్రతి శాఖ స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. చేపట్టాల్సిన పనుల అంచనాలు, అవసరమైన నిధులు, అమలు చేయాల్సిన చర్యల వివరాలతో సమగ్ర ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు.జడ్చర్ల లో టూరిజం ప్లాజా ఏర్పాటుకు,కోయిలకొండ మండలలో రామకొండ ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి ప్రతిపాదనలను రాష్ట్ర టూరిజం డైరెక్టర్ కు పంపినట్టు టూరిజం శాఖ అధికారి కలెక్టర్‌కు వివరించారు.

ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎ.నిర్మల, జిల్లా అటవీ అధికారి నవీన్ రెడ్డి, జిల్లా పర్యాటక, క్రీడల శాఖ అధికారి రాజశేఖర్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదింటి కళ్యాణానికి కాంగ్రెస్ కొండంత అండ!

- లబ్ధిదారులకు రూ.24 లక్షల చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బయ్యని మనోహర్ రెడ్డి:

> * లబ్ధిదారులు: 24 మంది పేద కుటుంబాలు

> * మొత్తం మంజూరైన నిధులు: రూ. 24,02,784/-

>యాలాల మండల రైతు వేదిక

తాండూరు, అక్టోబర్ 28 (వుదయం ప్రతినిధి):

పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పిస్తూ వారి ఇళ్లలో వెలుగులు నింపడమే లక్ష్యంగా తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం పనిచేస్తోందని తాండూరు శాసనసభ్యులు బుయ్యని మనోహర్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం యాలాల మండల రైతు వేదికలో అంగరంగ వైభవంగా జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో 24 మంది లబ్ధిదారులకు రూ. 24,02,784 విలువైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే బియ్యని మనోహర్ రెడ్డి స్వయంగా అందజేశారు.

ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ "సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా పాలనలో ప్రతీ పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు నేరుగా అందుతున్నాయి. సంక్షేమంలో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలుపుతున్నాంమహిళా సాధికారతకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం, సబ్సిడీపై గ్యాస్ సిలిండర్లు అందిస్తూ ఆడబిడ్డల ఆర్థిక భారాన్ని గణనీయంగా తగ్గించాం."అర్హులైన ప్రతీ ఒక్కరికీ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నాం. తెల్ల రేషన్ కార్డు ఉన్నప్రతీ నిరుపేద కుటుంబంలో ఒక్కొక్కరికి 6 కిలోల సన్న బియ్యాన్ని అందిస్తున్న ఘనత మన కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు రాబోయే రోజుల్లో రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి మరిన్ని అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలను ప్రవేశపెడతాం. అర్హులైన ప్రతీ ఒక్కరూ ప్రభుత్వ పథకాలను

సద్వినియోగం చేసుకోవాలి

అన్నారుఈ కార్యక్రమంలోయాలాల సొసైటీ ఛైర్మన్ చెన్నారం అనిల్ కుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు నర్సిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహిపాల్, మాజీ ఛైర్మన్ సురేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు కర్ణం పురుషోత్తం రావు, తిమ్మాయిపల్లి భీమయ్య, శ్రీధర్, యువ నాయకులు చంద్రశేఖర్ గౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు, డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు పార్టీ ముఖ్య నాయకులు, లబ్ధిదారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో డ్రైవింగ్.. ఇద్దరికి జైలు శిక్ష!

ఎనిమిది మందికి జరిమానా..

మునగాల పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన వాహనదారులు

మునగాల, అక్టోబర్ 28 (వుదయం):

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని మునగాల ఎస్సై మల్లు సంజీవరెడ్డి హెచ్చరించారు. మద్